www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

మంగళవారం | 8-8-2017 | పేజీలు: 14 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 114 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: పాడ్యమి రా 12.26 తదుపరి విదియ; నక్షత్రం: ధనిష్ఠ తె. 4.53 తదుపరి శతభిషం; వర్జ్యం: ఉ. 7.46-9.27; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.24; రా. 10.24-11.08; అమృతఘడియలు: సా. 5.54-7.35; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.42 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

GST

జూలై 1కి ముందు: GOODS AND SERVICE TAX
జూలై 1న: GOOD SIMPLE TAX
జూలై 17న: GROWING STRONGER TOGETHER
ఆగస్టు 7న: GREAT SCARY TAX

కొత్త పన్ను కొరకొర.. అవగాహన అరకొర

వ్యాపారుల్లో ఆందోళన
రాష్ట్ర ప్రభుత్వాల్లో అసమ్మతి
అధికారుల్లో గందరగోళం..

ఐదు వారాల క్రితం అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తాజా పరిస్థితి ఇది. కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధాన్లు తాంబూలాలిచ్చేశా తన్నుకుచావండంటారు. ప్రధాని మోదీ కూడా చట్టం చేసేశా సర్దుకుపోండంటారు. జీఎస్టీ అర్థమేంటో, పద్ధతేంటో తెలియకుండానే దాంతో సహజీవనం మొదలెట్టేశాం. ఆ లెక్కలు చేయరాక, లెక్క ప్రకారం చేయలేక అనేక వ్యాపారాలు విరామం తీసుకున్నాయి. ఏకాభిప్రాయంతో చట్టం చేశామని కేంద్రం చెబుతున్నా అమలుపై ఎన్నో అనుమానాలు, అయోమయం! కొత్త పన్ను క్షేత్ర స్థాయిలో ఎలా ఉంది? ఎవరు లాభపడుతున్నారు? ఎవరు ఇబ్బందులు పడుతున్నారు? ఆర్థిక రంగంపై ప్రభావం ఎలా ఉంది? ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏం చేయాలి? తదితర అంశాలతో

...ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు... నేటి నుంచి!

కొరకరాని జీఎస్టీ



అపరిపక్వ చట్టంతో అంతటా అయోమయం

జీఎస్టీకి గట్టి మద్దతునిచ్చిన రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి. ఒకింత గట్టిగానే మద్దతిచ్చాయి. జీఎస్టీ బిల్లును ఆమోదించిన తొలి రాష్ట్రం తెలంగాణే. అప్పుడు జీఎస్టీపై విమర్శలను ఆ రాష్ట్ర సీఎం కేసీఆర్ తిప్పికొట్టారు. దీని అమలువల్ల రాష్ట్ర ప్రభుత్వ రాబడులు భారీగా పెరుగుతాయని ప్రకటించారు. కొత్త పన్నుల వ్యవస్థకు నైతికబలాన్ని ఇచ్చారు. ఇప్పుడు అదే కేసీఆర్ తీవ్రస్థాయిలో జీఎస్టీపై విరుచుకుపడుతున్నారు. ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కోసం ఉద్దేశించిన ప్రాజెక్టుల వ్యయభారం భారీగా పెరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చి నెల రోజులైనా ఇంకా పూర్తిగా కుదురుకోలేదు. నిత్యం కొత్త సమస్యలు, ఫిర్యాదులు, డిమాండ్‌లు... భిన్న వర్గాల నుంచి వినవస్తున్నాయి.

అధికారులకే అర్థం కాని వ్యవస్థ.. రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యాపారాలు డీలా!

వృద్ధి గణాంకాల నేల చూపులు.. చిన్న వ్యాపారుల పరిస్థితి ఘోరం

(ఆంధ్రజ్యోతి బిజినెస్ బ్యూరో)

జీఎస్టీపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సమగ్ర స్వరూపంతో కాకుండా అపరిపక్వంగా కొత్త పన్నుల వ్యవస్థను అమల్లోకి తెచ్చారని ఆక్షేపిస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారానికి, ప్రజా సంక్షేమానికి మధ్య గీత చెరిపేసి అన్ని ఖర్చుల పైనా ఒకేరకంగా పన్ను బాదడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారం, ప్రజా సంక్షేమం, దీర్ఘకాలిక అభివృద్ధి.. ఇవన్నీ వేరు వేరు లక్ష్యాలు. లాభాలే లక్ష్యంగా సాగే వ్యాపారం నుంచి పన్నులు పిండుకోవడానికి, దీర్ఘకాలిక అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులపై పన్నులు విధించడానికి తేడా ఉంది. పైగా పాత ప్రాజెక్టులను కూడా పన్నుల పరిధిలోకి తేవడం వివాదాస్పదంగా మారింది. సన్నాహాలు ఏమీ లేకుండా హడావుడిగా జీఎస్టీ అమలుకు నిర్ణయించడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయన్న అభిప్రాయం రాజకీయ పార్టీల్లోనూ, ట్రేడర్లలోనూ ఉంది. వినియోగదారులు కూడా సంతృప్తిగా లేరు. జీఎస్టీపై అన్ని పక్షాలను ఏకతాటిపైకి తెచ్చి పార్లమెంట్ ఆమోదముద్ర సాధించిన ప్రభుత్వం జీఎస్టీ అమలు విషయంలో మాత్రం తొందరపడింది. నిదానంగా ముందుకు పోవాలనీ, తొందరపాటు వద్దని ఆర్థిక వేత్తలు, వ్యాపార సంఘాలు వారిస్తున్నా వినకుండా జూలై ఒకటి నుంచి అమల్లోకి తేవాలని

మిగతా 11వ పేజీలో...

• ఇందు మూలముగా తెలియజేయునదేమనగా..



ఐఏఎస్‌ల జనం బాట!

కలెక్టర్ నుంచి సీఎస్ వరకూ పల్లె నిద్ర... ప్రజలతో భేటీ

పథకాల అమలు పరిశీలన.. వాటిపై ప్రజాభిప్రాయ సేకరణ

సమస్యలకు పరిష్కారాల సూచన.. నేడో రేపో ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆఫీసుల్లో కూర్చోవడం, సమీక్షలు నిర్వహించడం, ఆదేశాలు జారీ చేయడం మాత్రమే కాదు! ఇకపై ఐఏఎస్‌లూ గ్రామాల్లో పర్యటించాల్సిందే. జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ప్రతినెలా నిర్దేశిత రోజుల్లో పల్లె బాట పట్టాలి. రాత్రి అక్కడే బస చేయాలి. అక్కడ తమ శాఖలతోపాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నీ పరిశీలించాలి. వాటిపై ప్రజాభిప్రాయం తెలుసుకోవాలి. ప్రజల నుంచి వచ్చే ఆలోచనలను స్వీకరించాలి. వారి సమస్యలకు పరిష్కారం లభించేలా విధాన నిర్ణయాలు తీసుకోవాలి. 'ప్రజల వద్దకు అధికార యంత్రాంగం' వెళ్లేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అతి త్వరలోనే వెలువడనున్నాయి. దీనివల్ల శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందని, వినూత్న ఆలోచనలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ యంత్రాంగంలోని ప్రతి స్థాయి అధికారి... అంటే ప్రధాన కార్యదర్శి

మిగతా 12వ పేజీలో...

• పైవాడు చూస్తున్నాడు..



2

డ్రోన్ చూపే ఊరి దారి

రోడ్డుపై పగుళ్లూ సుస్పష్టం
రోడ్డుపక్క చెత్త కూడా 'క్లియర్'
సీసీ రోడ్లపై సత్వర అంచనా
నాణ్యతపైనా కెమెరాతో నిఘా
నిమ్మకూరులో పైలట్ ప్రాజెక్టు
త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు

3 నెలలు.. 28 ప్రాజెక్టులు!



సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న మహిళా నేతలు సునీత, సుజాత, సీతక్క

పూర్తి చేస్తాం.. దీనికి తిరుగులేదు

నీటి భద్రత మా ప్రాధాన్యం
2019కి పోలవరం పూర్తి
వచ్చే ఏడాది గ్రావిటీ ద్వారా నీరు
15న పురుషోత్తపట్నం షురూ
ప్రతి ఎకరాకూ నీరివ్వడమే లక్ష్యం
పోలవరం పర్యటనలో సీఎం

రాజమహేంద్రవరం/కాకినాడ/ ఏలూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): "నీటితో అద్భుతాలు సృష్టించవచ్చు. పంట పండుతుంది. దాహం తీరుతుంది. పర్యాటకమూ అభివృద్ధి చెందుతుంది. పోలవరం పూర్తి చేసే అవకాశం దక్కడం నా అదృష్టం. భగవంతుడు నాకు, మా పార్టీకి ఇచ్చిన అవకాశం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన పోలవరం, పురుషోత్తపట్నం ఎత్తిపోతల ప్రాజెక్టులను పరిశీలించారు. వర్షంలోనే

మిగతా 12వ పేజీలో...

నంద్యాల టెన్షన్!

నామినేషన్ల పరిశీలనలో హైడ్రామా



శిల్పా నోటరీ రెన్యువల్ కాలేదన్న టీడీపీ
భూమా ఐటీ రిటర్న్‌పై వైసీపీ ఫిర్యాదు
ఇద్దరి నామినేషన్లూ సక్రమమే: ఈసీ

చెల్లియో.. చెల్లకో..

కర్నూలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నిక నామినేషన్ల పరిశీలన ఘట్టం వైసీపీ, టీడీపీల్లో కొన్ని గంటల పాటు ఉత్కంఠ రేపింది. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి నామినేషన్ చెల్లదని వైసీపీ.. వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్ చెల్లదని టీడీపీ పరస్పర అభ్యంతరాలు

మిగతా 11వ పేజీలో...

పవన్ గో.పి... బాబు యముడు: రోజా 12



నెల్లూరులో వెంకయ్యకు ఘనస్వాగతం పలికి తిలకం దిద్దుతున్న ప్రజలు

రాజ్యాంగ పరిధిలో రాష్ట్రానికి న్యాయం

కేంద్రం ఏపీకి 2.30 లక్షల కోట్లిచ్చింది.. 4.23 లక్షల ఇళ్లిచ్చా
సభను హుందాగా నిర్వహిస్తా.. విలువలు పెంచుతా
మేకింగ్ ఆఫ్ డెవలప్డ్ ఇండియాలో పాల్గొనండి: వెంకయ్య
నెల్లూరులో సత్కారం.. తిరుపతిలో వైద్య కళాశాల ప్రారంభం

నెల్లూరు/తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిధిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌కు తగిన న్యాయం చేస్తానని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారు. ప్రతి రోగినీ వీఐపీగానే భావించి చికిత్స చేయాలని వైద్యులకు పిలుపిచ్చారు. ఆయన

మిగతా 2వ పేజీలో...

చేనేతకు 'సంక్రాంతి'! 12

చంద్రన్న కానుకలో వస్త్రాల పంపిణీ
తెల్లకార్డుపై పంచె, ధోవతి, చీరలు
చేనేత దినోత్సవ సభలో అచ్చెన్న



మోదీ షాదీ ముబారక్ 14

ముస్లిం యువతుల కోసం 'షాదీ షగున్'
పట్టభద్రులైతే పెళ్లి కానుకగా 51 వేలు

ప్రహ్లాదరాయులకు రథోత్సవాలు



కర్నూలు జిల్లా మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామి 346వ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పీఠాధిపతి సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో సోమవారం రాఘవేంద్రస్వామి బృందావనాన్ని విశేషంగా అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, రజిత, గజ, స్వర్ణ రథోత్సవాలపై అధిష్ఠించి ఆలయ ప్రాకారం చుట్టూ ఊరేగించారు. - మంత్రాలయం

చంద్రబాబు, లోకేశ్ కటౌట్లకు రాఖీలు



రక్షాబంధన్ కార్యక్రమాన్ని నంద్యాల టీడీపీ నేతలు వినూత్నంగా నిర్వహించారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ కటౌట్లకు మహిళలు రాఖీలు కట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, నెల్లూరు, కడప, అనంతపురం,చిత్తూరు జిల్లాల్లోనూ సీఎం ఫెక్సీలకు రాఖీలు కట్టారు. - నంద్యాల

స్వచ్ఛ చల్లపల్లి @ 1000



ప్రముఖ వైద్యులు డీఆర్‌కే ప్రసాద్, పద్మావతి దంపతులు చేపట్టిన 'స్వచ్ఛ చల్లపల్లి' కార్యక్రమం సోమవారానికి 1000వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్వచ్ఛ కార్యకర్తలు గ్రామంలో బైక్ ర్యాలీ చేసి, సభ నిర్వహించారు. ఈ సభలో ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ చల్లపల్లి దేశానికే దిశానిర్దేశమని కొనియాడారు. - చల్లపల్లి

1.91 కోట్ల పాత నోట్లు స్వాధీనం



రద్దయిన 500, 1000 నోట్లు కలిగివున్న ముగ్గురిని విశాఖపట్నంలో పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి 1.91 కోట్ల పాత నోట్లు స్వాధీనం చేసుకున్నారు. గెద్దం కల్యాణ్‌కుమార్, కండిబోటి నవీన్, గుడ్ల వెంకటరమణ కలిసి గత ఏడాది డిసెంబరు 31 వరకూ కమీషన్ ప్రాతిపదికన రద్దయిన నోట్లను మార్పిడి చేశారు. ఆతర్వాత కొన్ని పాత నోట్లు వీరి వద్ద ఉండిపోయాయి. వీటిని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంచగా పోలీసులు దాడి చేశారు. - విశాఖపట్నం

మందుల కోసం కాళ్లు వాచేలా..



వీరంతా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ మందుల కౌంటర్ల వద్ద బారులు తీరిన జనం. రెండు జిల్లాలకు ఇదే పెద్దాసుపత్రి కావడంతో నిత్యం ఇక్కడికి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఓపీ వద్ద మందులు తీసుకునేందుకు వీరు గంటల సేపు ఎదురు చూడాల్సి వస్తోంది. కౌంటర్ల సంఖ్య పెంచి ఇబ్బందులు తప్పించాలని కోరుతున్నారు. - కాకినాడ

రాజ్యాంగ పరిధిలో రాష్ట్రానికి

న్యాయం చేస్తా!



వెంకయ్య అభినందన సభలో పాల్గొన్న ప్రజలు

వెంకయ్యకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ బాలు, చిత్రంలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం రాత్రి తిరుమల చేరుకున్న సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి స్విమ్స్‌లో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి వైద్య కళాశాలను, రుయాలో ప్రభుత్వ కాన్పుల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించారు. స్విమ్స్‌లో మరో 7 భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం నెల్లూరులో ఆయనకు ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఆయా సందర్భాల్లో వెంకయ్య మాట్లాడారు. 'రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి తీరని అన్యాయం జరిగిందని గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2.30 లక్షల కోట్లను వివిధ రూపాల్లో అందించింది. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసే ముందే 2.23 లక్షల ఇళ్లు రాష్ట్రానికి మంజూరు చేశాను. అంతకుముందు కేటాయించిన రెండు లక్షల ఇళ్లతో కలిపితే మొత్తం 4.23 ఇళ్లు ఒక్క ఏపీకే అందించాను' అని తెలిపారు. విశ్వ గురువుగా శక్తివంతమైన భారతదేశంగా ఆవిర్భవించాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకే ప్రధాని మోదీ ఎన్నో మార్పులు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోతున్నారని కొనియాడారు. 'రాజ్యసభలో అర్థవంతమైన చర్చ జరిగేవిధంగా కృషి చేసి వన్నె తెస్తా. సభను హుందాగా, నిర్మాణాత్మకంగా పని చేయించి ప్రజాస్వామ్య విలువలను పెంచుతా. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి గెలిపించారు. 30 ఏళ్లుగా నేను ఎంపీలకు బాగా పరిచయం ఉన్నందునే ప్రచారం చేయలేదు' అని తెలిపారు. తెలుగు ప్రజలకు మంచి పేరు తెస్తానని అన్నారు. 'వైద్యులకు ప్రతి రోగీ వీఐపీనే. వ్యాధి చికిత్సలో ఎవరినైనా ఒకేలా ట్రీట్ చేయాలి. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది. కష్టపడండి. క్రమశిక్షణతో ఎదగండి. మీకు నేనే ఉదాహరణ' అని వెంకయ్య తిరుపతి స్విమ్స్‌లో వైద్య విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. మహిళలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతూ.. ఓ వైద్య విద్యార్థినితో, ఓ విదేశీ మహిళతో రాఖీ కట్టించుకున్నారు. వైద్యవిద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అత్యాధునిక ట్యాబ్స్‌ను వెంకయ్య అందజేశారు. మంత్రులు కామినేని శ్రీనివాస్, నారాయణ, సోమిరెడ్డి, ఎంపీలు మేకపాటి, వరప్రసాద్, ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా.. నెల్లూరులో పోలీసు మైదానం నుంచి వీఆర్ కళాశాల వరకు 1500 మీటర్ల జాతీయ పతాకం చేబూని విద్యార్థులు వెంకయ్యకు అఖండ స్వాగత పలికారు. ఆతర్వాత జరిగిన సభలో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

సాధారణ భక్తుడినే

తిరుమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడిని. దేశంలోనే రాజ్యాంగబద్ధంగా రెండో అత్యున్నత పదవైన ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యానంటే.. అది శ్రీవారి ఆశీస్సుల తోనే' అని వెంకయ్యనాయుడు అన్నారు. తిరుమలలో ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగు రోజుల్లో ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు వెల్లడించారు. బాధ్యతలు చేపట్టాక వస్తే ఆలయ మర్యాదలతో స్వాగతం, దర్శనం చేసుకునే అవకాశముందని ఈవో సింఘాల్ తెలిపారని, తాను సాధారణ భక్తుడినని ఈవోకు చెప్పానన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించే ముందు శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకోవాలన్న సంకల్పం కలిగిందని, స్వామి దర్శనంతో తనకు కొత్త వెలుగు కనిపించిందని చెప్పారు. ఆ వెలుగును దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగిస్తానని చెప్పారు.

డ్రోన్ చూపే ఊరి దారి!

- రోడ్డు, రోడ్డుపై పగుళ్లూ సుస్పష్టం
- రోడ్డుపక్క చెత్త కూడా 'క్లియర్'
- ఆరు నెలలకోసారి చిత్రీకరణ
- సీసీ రోడ్లపై సత్వర అంచనా
- నాణ్యతపైనా కెమెరాతో నిఘా
- నిమ్మకూరులో ప్రయోగాత్మక ప్రాజెక్టు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- 'ఉపాధి' నిధులతో వంద డ్రోన్ల కొనుగోలు



పగుళ్లు కూడా దొరికేస్తాయ్...

ఇది నిమ్మకూరు గ్రామంలో ఓ రహదారిపై వచ్చిన పగులు. ఇలా పగుళ్లు వచ్చినా, గుంతలు పడినా డ్రోన్ కెమెరా ద్వారా స్పష్టంగా గుర్తించవచ్చు. పనుల్లో నాణ్యత దెబ్బతింటే ఇట్టే పట్టేయవచ్చు.

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అది కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామం. ఆ గ్రామంలో మొత్తం రోడ్లు ఎన్ని? అందులో సిమెంటు రోడ్లు ఎక్కడ వేశారు? ఎన్ని రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి? ఎన్ని ఇంకా వేయాల్సి ఉంది? ఇళ్లు, కాలువలు, మురికి కాలువలు, పశువుల పాకలు, ఆట స్థలాలు, శ్మశానాలు... ఎక్కడెక్కడున్నాయి? ఎలా ఉన్నాయి? రోడ్లకు బీటలు పడ్డాయా? రోడ్ల పక్కనో, రోడ్డుపైనే చెత్త పోగు పడిందా? అది ఎలాంటి చెత్త? ఇలాంటి సమస్త వివరాలు... ఒక్క మీట నొక్కితే తెరపై ప్రత్యక్షం. ఇది డ్రోన్ కెమెరా మహిమ! పనుల్లో నాణ్యత పరిశీలించేందుకు, స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టును పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ తన దత్తత గ్రామం, ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులో చేపట్టారు. త్వరలో దీనిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,910గ్రామ పంచాయతీల్లో అమలు చేయనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.3 కోట్లతో వంద డ్రోన్లను కొనుగోలు చేయనుంది. ఉపాధి హామీ పథకంలోని పనులను మరింత నాణ్యతగా, వేగంగా చేసేందుకు, చేసిన-చేయాల్సిన పనులపై సమగ్ర ప్రణాళిక రూపొందించుకునేందుకు ఇది ఉపయోగపడనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతి ఆరు నెలలకోసారి డ్రోన్ల ద్వారా గ్రామాలను చిత్రీకరిస్తారు. పనుల ప్రగతితోపాటు... లోటుపాట్లనూ సచిత్రంగా గుర్తిస్తారు.

నాలుగు విభాగాలుగా రహదారులు

రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 1.10 లక్షల కిలోమీటర్ల రహదారులున్నాయి. గ్రామాల్లోని అంతర్గత రోడ్లతో పాటు, గ్రామాలకు-గ్రామాలకు మధ్య అనుసంధానంగా ఉండే రోడ్లూ ఇందులో ఉన్నాయి. గత మూడేళ్లలో గ్రామ పంచాయతీల్లో మొత్తం 12వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. ఇకపై ప్రతి గ్రామంలోని రోడ్లను నాలుగు రకాలుగా విభజిస్తారు. డ్రోన్ కెమెరాల సాయంతో గ్రామం మొత్తం చిత్రీకరిస్తారు. అందులోని రోడ్లను పరిశీలించి ఏ, బీ, సీ, డీగా వర్గీకరిస్తారు. 'ఏ' అంటే కొత్తగా వేసిన సిమెంటు రోడ్లు. 'బి' కేటగిరీ అంటే చిన్న చిన్న మరమ్మత్తులు అవసరమైనవి. 'సీ' అంటే పనులు జరుగుతున్న రోడ్లు! 'డీ' కేటగిరీలో మట్టిరోడ్లు ఉంటాయి. ఇలా రోడ్ల పరిస్థితిని గుర్తించి... ఒక్కో గ్రామంలోని మొత్తం రహదారులను సీసీ రోడ్లుగా మార్చేందుకు ఎంత ఖర్చవుతుంది అన్నదానిపై అంచనా తయారు చేస్తారు. అదే సమయంలో జరుగుతున్న పనుల నాణ్యత కూడా కంటిముందే ఉంటుంది. ప్రతి ఆరు నెలలకోసారి డ్రోన్లతో పంచాయతీల్లోని రోడ్లను, మొత్తం పంచాయతీని వీడియో తీసి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అనుసంధానం చేస్తారు. తద్వారా ఆయా గ్రామాల్లో రోడ్ల పరిస్థితి ఏంటన్నది ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతారు. గ్రామాల్లో చెత్త ఎక్కడ పేరుకుపోయినా డ్రోన్ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆయా గ్రామాల్లో చెత్త శుభ్రం చేయించేందుకు, అవసరమైన చర్యలు తీసుకునేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. ఇలా పనుల పరిశీలనకు డ్రోన్లు సమకూర్చుకునేందుకు ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవచ్చు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లకే డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇస్తారు. ప్రతి ఆరునెలలకోసారి తమ పరిధిలోని గ్రామాలను చిత్రీకరిస్తారు.

నిర్మాణంలోని రోడ్డు



నిమ్మకూరులో నిర్మాణంలో ఉన్న ఓ రహదారి ఇది. ఇందులో నిర్మాణ సామగ్రిని కూడా చూడవచ్చు.



ఇదిగో చెత్త

ఈ ఫొటోలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను కూడా డ్రోన్ కెమెరా పట్టేసింది. అది ఏ రకం చెత్త... నిర్మాణ శిథిలాలు పడేశారా, ఇళ్లలోని వ్యర్థాలను తెచ్చి పోశారా... మరేదైనానా? అని స్పష్టంగా కనుకున్నేంతగా వీడియో/ఫొటోలు వస్తాయి.

లోకం తీరు



రాఖీ కడితే.. గిఫ్ట్‌గా పార్టీ బాధ్యతలు ఇచ్చి పంపుతున్నాడు!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
చిత్తూరు	23.2	34.4
హైదరాబాద్	24.5	33.8
కర్నూలు	25.2	34.2
గుంటూరు	26.0	33.0
రాజమండ్రి	26.0	37.0
విజయవాడ	26.8	37.0



ఆరెస్సెస్ కార్యకర్త హత్యకేసును సీబీఐకి ఇవ్వడానికీ సిద్ధమే

ఆరెస్సెస్ కార్యకర్త రాజేశ్ హత్య విషయంలో బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తోంది. రాష్ట్రంలో పలుచోట్ల అల్లరు చేయడానికి కాషాయపార్టీ కుట్రలు చేస్తున్నట్లు నిఘావర్గాల సమాచార ముంది. రాజేశ్ హత్య కేసును సీబీఐకి అప్పగించడానికి కూడా మేం సిద్ధంగా ఉన్నాం. అంతే కాదు రాజకీయ ప్రేరేపిత హింసను అరికట్టడానికి చర్యలు చేపడుతున్నాం.

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



పేదలకు గ్యాస్ సబ్సిడీ ఉంటుంది

వంట గ్యాస్‌పై ఉన్న సబ్సిడీని తీసివేయాలని ప్రభుత్వం భావించడంలేదు. పేదలకు సబ్సిడీ కొనసాగుతుంది. కిరోసిన్‌పైనా సబ్సిడీ అలాగే ఉంటుంది.

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

కేన్సర్ చికిత్సలో బంగారం సాయం!

లండన్, వాషింగ్టన్, ఆగస్టు 7: కేన్సర్ చికిత్సలో బంగారం చూర(సూక్ష్మ అణువులు) సహాయపడుతుందని యూకేలోని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌కు వాడే ఔషధాల పనితీరును, ప్రభావాన్ని పెంచుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని తెలిపారు. బంగారం చూర కలిగిన ఒక రసాయన పరికరాన్ని రూపొందించిన పరిశోధకులు.. కీమోథెరపీ దుష్ప్రభావాల్ని తగ్గించడంలో, ఆరోగ్యకర కణజాలానికి ఇబ్బంది కలగకుండా దెబ్బతిన్న కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని చికిత్స చేయడంలో పరికరం ఉపయోగపడుతుందని వివరించారు. మరోవైపు ఒక్కొక్క జీవించి ఉన్న కణాన్ని సంగ్రహించి, మోసుకొని పోయే పాక్-మాన్ లాంటి మైక్రోబాట్‌ను అమెరికాలోని నార్త్ కరోలినా స్టేట్ వర్సిటీ, డ్యూక్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఔషధాలకు కేన్సర్ కణాలు ఎలా స్పందిస్తున్నాయో తెలుసుకునేందుకు ఇది సహాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, నొప్పి ఉపశమనానికి వాడే 'ఒపియాడ్'ను కేన్సర్ బాధితులు ఎక్కువగా, సాధారణంగా వాడుతారని భారత సంతతి శాస్త్రవేత్తతో కూడిన యూనివర్సిటీ ఆఫ్ టొరంటో పరిశోధకుల బృందం తెలిపింది.

తగ్గిన రుతుపవనాల జోరు

- దక్షిణాదిలో వర్షాభావ పరిస్థితులు
- తెలంగాణ, సీమల్లో 15% లోటు వర్షపాతం
- చత్తీస్‌గఢ్‌లో ఉపరితల ఆవర్తనం.. వర్ష సూచన

విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్ ఇప్పటికే సగానికిపైగా ముగిసింది. రుతుపవనాల ప్రభావంతో జూన్‌లో ఆశాజనకంగా వర్షాలు కురిసినా జూలైలో తగ్గాయి. ఇప్పటి వరకూ తిరిగి పుంజుకోలేదు. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క కోస్తా తప్ప మిగిలిన సబ్ డివిజన్లలో వర్షాభావం కొనసాగుతోంది. సీజన్ ప్రారంభం నుంచి సోమవారం వరకు దక్షిణాదిలో సాధారణం కంటే 18 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాలతో తడిసి ముద్దయ్యే కేరళలోనే ఈసారి 27 శాతం తక్కువ వర్షపాతం నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర కర్ణాటకలో 20 శాతం, దక్షిణ కర్ణాటకలో 35 శాతం, తెలంగాణ, రాయలసీమల్లో 15 శాతం లోటు నమోదైంది. తెలంగాణ, రాయలసీమల్లోని కొన్ని జిల్లాల్లో 30 శాతం తక్కువ వర్షపాతం నమోదుకావడంతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. కోస్తాలో సోమవారం నాటికి 12 శాతం మిగులు వర్షపాతం కొనసాగుతున్నా గడచిన వారం రోజులుగా చెదురుమదురు వర్షాలే కురుస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఐదారు రోజులకు లోటు నమోదు కావచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులపై ఇప్పటికే రైతుల్లో ఆందోళన నెలకొంది. కృష్ణా బేసిన్ పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. దీనికి కారణం అరేబియా సముద్రం శాఖ రుతుపవనాలు బలంగా లేకపోవడమేనని అంచనా. రుతుపవనాలు చురుగ్గా లేకపోవడంతో మేఘాలు లేక ఎండ పెరిగింది. వేసవి మాదిరిగా మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉండడంతో సాయంత్రానికి అక్కడక్కడా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి వర్షాలు కురుస్తున్నాయి. కాగా చత్తీస్‌గఢ్‌లోఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తా, తెలంగాణలో ఎక్కువచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

వరి సాగు అంతంతే!

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది వరి సాగు అంతంత మాత్రంగానే ఉంది! కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఫర్వాలేదనిపించినా మిగిలిన జిల్లాల్లో సాగు పడకేసింది. రాష్ట్రంలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 15.63 లక్షల హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 6.09 లక్షల హెక్టార్లలోనే నాట్లు పడ్డాయి. ఇది కేవలం 40% మాత్రమే. శ్రీకాకుళంలో ఈ దఫా తొలకరిలోనే భారీ వర్షాలు కురవడం, నాగావళి, వంశధార ప్రాజెక్టుల్లోకి దండిగా నీరు రావడంతో సిక్కోలు రైతులు వరిసాగు చేపట్టారు. గోదావరి డెల్టాకు జూన్ ఒకటిన, కృష్ణా డెల్టాకు జూలై మొదటి వారానికే ప్రభుత్వం సాగు నీరు విడుదల చేసింది. దీంతో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు గోదావరి డెల్టా కాలువలతో వరి సాగు ముమ్మరంగా చేపట్టారు. అలాగే పట్టిసీమ నీటితో ప్రభుత్వం కృష్ణా డెల్టాకు నీరిచ్చినా, పశ్చిమ డెల్టాలో రైతులు వరి జోలికి పోలేదు. అయితే, ఇప్పుడిప్పుడే నాట్లు పడుతున్నాయి. ఇక నాగార్జునసాగర్ ఆయకట్టులో నీరు విడుదల చేయని కారణంగా పెద్దగా నారుమళ్లు పోయలేదు. గుంటూరులో కొంత వెద పద్ధతిలో వరి సాగు చేపట్టారు. ప్రకాశంలో నామమాత్రంగానూ వరి వేయలేదు. నెల్లూరులో 36% మాత్రమే వరి వేసినట్లు అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో 5% కూడా వరి సాగవలేదు. కడపలో 9%, అనంతపురంలో 2% వరి వేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు కట్టింది.

దేవరపల్లి

వివాదానికి తెర

పర్చూరు(దేవరపల్లి): ప్రకాశం జిల్లా పర్చూరు మండలం దేవరపల్లిలో భూముల వివాదానికి తెరపడింది. దళితుల భూములను వారికి అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామంలో నీటి అవసరాల దృష్ట్యా చెరువును అభివృద్ధి చేసేందుకు దళితులు సాగుచేసుకొంటున్న భూములను స్వాధీనం చేసుకొని చెరువును తవ్వటానికి ప్రభుత్వం సిద్ధమయింది. ఈ నేపథ్యంలో వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళన చేపట్టాయి. దీంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వాస్తవపరిస్థితులు తెలుసుకునేందుకు మంత్రి నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో బృందం గ్రామాన్ని సందర్శించింది. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం కొన్నేళ్లుగా భూములు సాగుచేసుకొంటున్న దళితులు జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు రావటంతో వారి అభ్యర్థన మేరకు తిరిగి వారికి భూములను అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

- కళాతపస్వికి ఘన సత్కారం



ఒంగోలు: దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, దర్శక రుషి కె.విశ్వనాథ్‌ను ఒంగోలులో సోమవారం అక్కినేని కళాపరిషత్తు స్వర్ణ కంకణాన్ని బహూకరించి ఘనంగా సత్కరించింది. పారిశ్రామికవేత్త శిద్దా పాండురంగారావు సహకారంతో జరిగిన కార్యక్రమానికి మంత్రి శిద్ధా రాఘవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- ఆలయాల మూత



చంద్ర గ్రహణం కారణంగా తిరుమల శ్రీవారి ఆలయం, బెజవాడ కనకదుర్గ గుడి, శ్రీశైలం మల్లన్న దేవస్థానం సహా రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలూ సోమవారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. అయితే, శ్రీకాళహస్తి దేవస్థానంలో మాత్రం గ్రహణ సమయంలో కాలాభిషేకం నిర్వహించారు.

నేడు గ్రూప్-3 మెయిన్స్ 'కీ'

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-3 మెయిన్స్ పరీక్షలు సోమవారం సాఫీగా ముగిశాయి. ఈ పరీక్షలకు 91% మంది హాజరయ్యారు. 6న(ఆదివారం) 9 జిల్లాల్లో నిర్వహించిన పేపర్-1కు 31,859 మంది, పేపర్-2కు 31,867 మంది హాజరయ్యారు. 7న(సోమవారం) 4 జిల్లాల్లో నిర్వహించిన పేపర్-1కు 16,019 మంది, పేపర్-2 కు 16,037 మంది హాజరయ్యారు. దీనికి సంబంధించిన 'కీ' మంగళవారం విడుదల చేస్తారు. రెస్పాన్స్ షీట్లను వెబ్ సైట్‌లో ఉంచుతారు.

వర్సిటీ పోస్టులు భర్తీ అయ్యేనా?

- ఎస్వీయూ చుట్టూ వరుస కోర్టు కేసులు
- సర్కారు అభిమతానికి ఆటంకాలు
- నోటిఫికేషన్లు వచ్చే వరకూ అనిశ్చితే

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపక పోస్టుల భర్తీ రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్ మారింది. నియామకాలు ఎప్పటికి జరుగుతాయి? అసలు జరుగుతాయా? అన్న అనుమానాలు ఈ కొలువులపై ఆశలు పెట్టుకున్న వారిని వెంటాడుతున్నాయి. గతంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, బాధ్యతా రాహిత్యం కారణంగానే ప్రతిష్ఠంభన కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,385 పోస్టులు భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసినా.. రెండేళ్లుగా అడుగడుగునా ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. గతంలో మాదిరిగా రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరగకుండా చెక్ పెట్టేందుకు తొలుత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలని, ఈ బాధ్యతను ఏపీపీఎస్సీకి అప్పగించాలని సర్కారు ఆలోచన. దీన్ని పలుమార్లు వైస్‌చాన్సెలర్ల సమావేశంలో పెట్టి వారి ఆమోదం తీసుకున్నారు. కానీ నిర్ణయాన్ని అమలు చేయాల్సిన విశ్వవిద్యాలయాలు చివరికి ఏం చేస్తాయోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటాయని, అవి అకడమిక్ బాడీలన్న వాదనల నడుమ అసలు ఏం జరగబోతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఒకవైపు వరుస కోర్టు కేసులు.. మరో వైపు వర్సిటీల పాత్ర మధ్య స్క్రీనింగ్ టెస్ట్ అన్ని వర్సిటీలు నిర్వహిస్తాయా? లేక తమకు అవసరం లేదన్న నిర్ణయానికి వస్తాయా? అన్న విషయమై స్పష్టత లేకుండా పోయింది. రిక్రూట్‌మెంట్‌పై పడుతున్న కోర్టు కేసులన్నీ కూడా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కేంద్రంగానే నడుస్తున్నాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. పోస్టుల రేషనలైజేషన్‌కు సంబంధించి హైపవర్ కమిటీ చేసిన సిఫారుసులను.. అంటే పోస్టుల రీడిజిగ్నేషన్ చేయడం, అవసరం ఉన్న డిపార్ట్‌మెంట్లకు పోస్టులు బదిలీ చేయడాన్ని సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో సదరు ఉత్తర్వులను కోర్టు కొట్టేసింది. అయితే పాలక మండళ్ల అనుమతితో చేసుకోవచ్చని కోర్టు చెప్పడం తెలిసిందే. తాజాగా సీఏఎస్ - ప్రమోషన్లపైనా కొందరు కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వర్సిటీల పాలక మండళ్లు మరోసారి సమావేశం కాబోతున్నాయి. ఈ సందర్భంగా చేసే తీర్మానాలు రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలకం కానున్నాయని సమాచారం. ప్రభుత్వం తరఫున నియమించిన స్టాండింగ్ కౌన్సిళ్లు కూడా ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్‌ను అడ్డుకునేందుకు కొంత మంది తెర వెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రిక్రూట్ మెంట్ జరగకుండా అడ్డుకునేందుకు ఓ వర్గం అన్ని విధాల తెర వెనుక ప్రయత్నాలు చేస్తోందన్న అభిప్రాయాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తమ అనుచరులకు అధ్యాపక పోస్టులు రావాలంటే ఈ ప్రభుత్వంలో రిక్రూట్‌మెంట్ జరగరాదని వారి అభిప్రాయం. ఈ నేపథ్యంలో ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ చివరికి ఏ మలుపు తిరగనుందో అనే దానిపై వర్సిటీలు నోటిఫికేషన్లు జారీ చేసే వరకూ స్పష్టత రాబోదని సమాచారం.

టికెట్ దగ్గర తిరకాసు!

- కృష్ణవేణి కథలో మరో విఘ్నం
- మూడేళ్ల తర్వాత తొలగిన చెర
- సౌదీ నుంచి కడప రావడానికి
- టికెట్ కొనడానికి ఎంబసీ నో

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



హత్య కేసులో ఇరుక్కొంది. 'నేరం చేయలేదు' అని చెప్పడానికి భాష అడ్డంపడి, జైలు పాలైంది. ఇక బయట ప్రపంచం చూడలేనేమోనని బెంగపడింది. ఎట్టకేలకు విడుదలకు కోర్టు ఆదేశించింది. ఇన్నాళ్ల ఎడబాటు తరువాత కుటుంబాన్ని కలుసుకోబోతున్నానన్న ఆమె ఆనందం.. అక్కడి భారత ఎంబసీ తీరుతో నీరుగారిపోయింది. ఇంతలో ప్రవాసాంధ్రులు ముందుకురావడంతో.. ఆమె సమస్య ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. కడప జిల్లా పుల్లంపేట మండలం మల్లెంవారిపల్లె గ్రామానికి చెందిన పుటిక కృష్ణవేణి కథ అడుగడుగునా ఆందోళన కలిగిస్తూనే సాగింది. స్వగ్రామంలో భర్త ఎటో పోయి, అత్తామామలు వృద్ధులయిపోయి..అనాథలుగా మిగిలిన తన పిల్లల దగ్గరకు వెళ్లాలన్న ఆమె ప్రయత్నం ఇన్నేళ్లుగా విఘ్నమవుతూనే ఉంది.

వైద్యుడిచ్చిన మందు స్థానంలో నీళ్ల తాగించి పొరపాటున సేటు కుమార్తె మరణానికి కారణమైన కేసులో కృష్ణవేణిని సౌదీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ఆమె తప్పేం లేదని ఇటీవల కోర్టు నిర్ధారించి, విడుదలకు అంగీకరించింది. ఇక విమానం ఎక్కడమే తరువాయి! సరిగ్గా ఇక్కడే సౌదీలోని భారతీయ ఎంబసీ అడ్డం పడుతోందని బాధితురాలు వాపోయింది. ఆమెకు టికెట్ తీసి ఇవ్వడానికి ఎంబసీకి ఏం అభ్యంతరముందో తెలియడం లేదు. నిజానికి, కృష్ణవేణి వంటి వారికి టికెట్, వసతి కల్పించడం కోసం ఎంబసీ.. సీడబ్ల్యూఎఫ్ నిధిని నిర్వహిస్తోంది. అయినా.. 'నీ టికెట్ నువ్వే కొనుక్కో' అని అధికారులు తేల్చిచెప్పారు. విషయం తెలుసుకొన్న కువైత్‌లోని రాయలసీమ గల్ఫ్ సంక్షేమ మండలి అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి.. ఆమె విమాన టికెట్‌కయ్యే మొత్తాన్ని జైలు అధికారులకు అందించాడు.

చావులోనూ పేగుబంధం

విజయనగరం/రామభద్రపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం మిర్తివలస గ్రామానికి చెందిన కోట ఈశ్వరరావు(42) తాపీ మేస్త్రి. సోమవారం తెల్లవారు జామున నిద్రలోనే గుండెపోటుకి గురయ్యాడు. ఎంత పిలిచినా చలనం లేకపోవడంతో భార్య కేకలు పెట్టింది. అంతా వచ్చిచూసేటప్పటికే ఈశ్వరరావు చనిపోయాడు. ఆ విషయం తెలుసుకొన్న తల్లి గంగమ్మ(65).. షాక్‌కి గురై మరణించింది.

వైద్యం కోసం వచ్చి..: ఒడిశాలోని జయపూర్‌కి చెందిన రాధానాథ్ పాండా.. భార్య కుంతల పాండా(58), కుమారుడు అమిత్‌పాండా(41)తో కలిసి విజయనగరం వచ్చాడు. మెరుగైన వైద్యం కోసం ఈనెల నాలుగో తేదీన వచ్చినవారు స్థానిక లాడ్జీలో ఉంటున్నారు. ఉదయం భార్య, కుమారుడిని లాడ్జీలో వదిలి ఏదో పని మీద రాధానాథ్‌పాండా బయటకు వెళ్లాడు. మరునాడు ఉదయం హోటల్ బాయ్స్ గది డోర్ కొట్టగా ఎటువంటి స్పందన లేదు. ఆ రోజంతా గది తలుపులు మూసే ఉన్నాయి. సోమవారం ఉదయం గదిలోంచి దుర్వాసన రావడం మొదలైంది. వెంటనే హోటల్ యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. తలుపులు బద్దలుకొట్టి లోపలకు వెళ్లిన వారికి, మంచంపై కుళ్లిపోయిన స్థితిలో తల్లీ, కొడుకుల మృతదేహాలు కనిపించాయి. బ్యాగులు తనిఖీ చేయగా పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, రూ.51,010 నగదు కనిపించాయి.

సుప్రీం ఆదేశాలు

మేమే పాటించాలా?: ముద్రగడ

కిర్లంపూడి: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం పాదయాత్రను సోమవారం కూడా పోలీసులు అడ్డుకున్నారు. ముద్రగడ తన అనుచరులతో కలిసి ఇంటి నుంచి పాదయాత్రగా గేటు వద్దకు రాగానే ఏఎస్పీ నయీమ్, డీఎస్పీ రామారావు, సీఐ కాశీవిశ్వనాథం అడ్డగించారు. దీంతో ముద్రగడ ఆగ్రహించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తాము మాత్రమే పాటించాలా పోలీసులు పాటించరా అని ధ్వజమెత్తారు. మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు వద్ద చంద్రబాబు నానా బీభత్సం చేశారని, అప్పుడు అనుమతులున్నాయా అని, చట్టం వారికి వర్తించదా కాపు జాతికి మాత్రమే వర్తిస్తుందా అని ముద్రగడ ప్రశ్నించారు. పోలీసులతో కరచాలనం చేసి వెనక్కి వెళ్లిపోతున్నారని హోంమంత్రి చినరాజప్ప ఎద్దేవా చేస్తున్నారని, పోలీసులను దాటుకుని వెళ్లమంటారేమో కనుక్కుని చెప్పండి అని అన్నారు. అనంతరం.. అక్కడే కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. కాగా, ముద్రగడను సోమవారం వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కన్నబాబు, చలమలశెట్టి సునీల్, ముత్యాల శ్రీనివాస్ తదితరులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. ముద్రగడ పాదయాత్రకు అనుమతి లేదనడం విడ్డూరంగా ఉందన్నారు.

కర్ణాటక మంత్రి డీకేపై

ఐటీ ప్రశ్నల వర్షం

- 4గంటలపాటు విచారించిన అధికారులు

బెంగళూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ నివాసాలు, ఆయన బంధువుల ఇళ్లపైనా ఆదాయపన్ను అధికారులు విస్తృత తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం ఆయనను అధికారులు విచారించారు. దాదాపు 4 గంటలపాటు సాగిన విచారణలో అధికారులు మంత్రిని పలు కీలక ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. మరో రెండు రోజుల తర్వాతే తాను ఐటీ అధికారుల ముందు హాజరవుతానని ఆదివారం మంత్రి ప్రకటించినప్పటికీ.. అనూహ్యంగా ఆయన తన ప్రణాళికను మార్చుకున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో క్వీన్స్ రోడ్డులోని ఐటీ కార్యాలయానికి వెళ్లి అధికారుల ముందు హాజరయ్యారు.

మాన్సాస్ ట్రస్టు భూముల రక్షణకు చర్యలు

- కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు.. ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందన



విజయనగరంలో నూలు వడుకుతున్న కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు

విజయనగరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని మాన్సాస్ ట్రస్టుకు నాలుగు జిల్లాల్లో ఉన్న భూములను పరిరక్షించేందుకు అన్నివిధాలా ప్రయత్నం చేస్తున్నామని మాన్సాస్ ట్రస్టు చైర్మన్, కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు తెలిపారు. సోమవారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రస్టు భూములు కొన్ని తమ అధీనంలోనే ఉన్నాయని చెప్పారు. మరికొన్ని ఆక్రమణల్లో ఉన్నాయని, ఇంకొన్ని వివాదాల్లో ఉన్నాయని తెలిపారు. వీటన్నింటినీ పరిరక్షించే బాధ్యత చైర్మన్‌గా తనపై ఉందన్నారు. విశాఖ జిల్లాలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో మాన్సాస్ భూములపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వస్తున్న విషయాన్ని ప్రస్తావించగా.. ఆశించిన ధరలు రాని కారణంగానే మిగిలిన భూముల వేలాన్ని విరమించుకున్నామన్నారు.

నేడు ఇంజనీరింగ్ తుది దశ కౌన్సెలింగ్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎంసెట్-ఇంజనీరింగ్ స్ట్రీమ్ తుదిదశ సీట్ల కేటాయింపు మంగళవారం జరగనుంది. శని, ఆదివారాల్లో మొత్తం 13,358 మంది అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వీరిలో కొత్త అభ్యర్థులు 127 మందే ఉండడం గమనార్హం. మిగిలిన వారంతా ముందు జరిగిన కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది కాలేజీ మార్పుకోసం ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో ఎంసెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ జరగగా 31,845సీట్లు మిగిలిపోయాయి. అభ్యర్థుల ఆప్షన్లు నమోదు చేసుకునే ముందుగా గత రెండు దశల్లో కోర్సుల వారీగా కాలేజీల్లో భర్తీ అయిన సీట్ల వివరాలను తెలుసుకునేందుకు ఆ సమాచారాన్ని https://apea cet.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

నేటి నుంచి ఎంసెట్ (బైపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్: ఎంసెట్ (బైపీసీ స్ట్రీమ్) తొలిదశ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ఈ నెల 10 వరకు జరగనుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు ఆప్షన్ల నమోదు ప్రక్రియను సమాంతరంగా చేపడతారు. రాష్ట్రవ్యాప్తంగా 22 హెల్ప్‌లైన్ సెంటర్లలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. సీట్ల కేటాయింపు ఈ నెల 11న జరుగుతుంది. ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్‌ను https://apeamcetb.nic.in వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ముందుగా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి.

'ప్రాక్సీ' ఓటింగ్!

ప్రవాస భారతీయుల కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నికల చట్టాలను సవరిస్తున్నది. ఇకపై తాము ఉంటున్న దేశాల నుంచే ప్రవాసులు పరోక్షంగా ఓటు వేయడానికి వీలుగా ప్రజాప్రాతినిధ్య చట్టానికి చేసిన సవరణలను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించింది. పార్లమెంటు ఆమోదముద్ర పడిన తరువాత, విదేశాల్లో ఉన్నవారందరికీ ఈ 'ప్రాక్సీ ఓటింగ్' అవకాశం లభిస్తుంది. సుమారు కోటీ పాతికలక్షల మంది ఎన్నారైలు సుదీర్ఘకాలంగా డిమాండుచేస్తున్న ఈ హక్కు ఇంతకాలానికి వారికి దఖలుపడబోతున్నప్పటికీ, ఆచరణలో అది దుర్వినియోగమయ్యే ప్రమాదాలు అధికంగా ఉన్నాయి. దీనితోపాటు దేశ రాజకీయాల్లో వారికి మరింతగా దక్కబోతున్న ప్రాధాన్యం అనేక రాష్ట్రాల ఎన్నికలపై విశేష ప్రభావం కూడా చూపబోతున్నది.


భారత ప్రధానులు విదేశ పర్యటనలకు పోయినప్పుడు అక్కడి ప్రవాసులకు విశేషమైన ప్రాధాన్యం ఇవ్వడం గతంలో అంతగా లేదు. మోదీ వచ్చిన తరువాత, విదేశాల్లోనివారే నివ్వెరపోయే రీతిలో భారీ సదస్సులు, సమావేశాలు జరగడం మొదలైంది. ప్రవాసులనుంచి పెట్టుబడులను ఆకర్షించే కార్యక్రమంగా ఉపరితలంలో కనిపిస్తున్నప్పటికీ, తమ ఘనకార్యాలను చాటుకోవడానికీ, ప్రతిపక్షాలను చీల్చిచెండాడడానికీ మోదీకి ఈ సమావేశాలు ఎంతగానో ఉపకరించాయి. ప్రవాస భారతీయుల మీద ఆయన ప్రదర్శించే ఈ విశేషమైన ప్రేమకు ఇప్పుడు ప్రాక్సీ ఓటింగ్ కూడా తోడుకాబోతున్నది. భారతదేశంలో జరిగే శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో తన తరఫున ఓటుచేయడానికి తన నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తిని ఎన్నారై రిజిస్టర్ చేసుకుంటే ఎన్నికల సంఘం ఆ వ్యక్తిని ఆమోదిస్తుంది. ప్రతీ ఎన్నికకు సదరు ఎన్నారై తన ప్రాక్సీని మార్చుకోవాలి. పంజాబ్, గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల నుంచి విదేశాల్లో స్థిరపడిన వారి సంఖ్య అధికంగా ఉన్నందున ఈ పరోక్ష ఓటింగ్ అవకాశం వారికి అధికంగా ప్రయోజనం చేకూర్చబోతున్నది. ఎన్నికల సమయంలో వాతావరణం పోటాపోటీగా ఉన్నపక్షంలో ఎన్నారైలను కూడా వచ్చి ఓటేసి పొమ్మంటూ రాజకీయపక్షాల తరపున కుటుంబీకులు ఒత్తిడిచేయడం జరుగుతున్నదే. తమకు తాముగా వచ్చివాలుతున్న వారు కూడా లేకపోలేదు. కానీ, ఎంతో ఖర్చుభరించి ఇలా వస్తున్నవారి సంఖ్య పది పన్నెండు వేలు కూడా లేదు. ఈ నేపథ్యంలో, ఉన్నచోట నుంచే ఓటు వేయగలిగే అవకాశం కోసం ఎన్నారైలు ఎంతోకాలంగా ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. ప్రాక్సీ ఓటింగ్ ద్వారా కనీసం 80 లక్షల మంది ఓటుహక్కు వినియోగించుకోవచ్చునని అంచనా.

మోదీ ప్రభుత్వం ఎన్నారైలకు ఇవ్వబోతున్న ఈ విశేషమైన అవకాశంపై ప్రతిపక్షాలు మల్లగుల్లాలు పడుతూ, లాభనష్టాలు లెక్కలేసుకుంటున్నాయి. ముఖ్యంగా గుజరాత్ ఎన్నికల్లో ప్రభావం ఏమిటో తరచిచూస్తున్నాయి. ఈ ప్రాక్సీ ఓటింగ్ వల్ల ఓటుహక్కు దుర్వినియోగమవుతుందనీ, ఇందుకు బదులు ప్రవాసీలంతా తమ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలకు వచ్చి అక్కడ ఓటుచేసే విధంగా ఎన్నికల సంఘం విస్తృతమైన ఏర్పాట్లు చేయడం ఉత్తమమని కొన్ని పార్టీలు అంటున్నాయి. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నప్పటికీ, ఎన్నికలసంఘం ఏర్పాటు చేసిన కమిటీ మాత్రం తన అధ్యయనంలో ఇది కుదిరేపని కాదని ఎప్పుడో తేల్చేసింది. 2010లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రవాసులకు ఓటు హక్కు కల్పించినప్పుడు వారంతా ఎగిరిగంతేశారు కానీ, అందరూ ఇక్కడకు వచ్చి ఓటేయాల్సిందేనని ఎన్నికల సంఘం ఆ తరువాత తేల్చడంతో నీరసించిపోయారు. అందరూ పేర్లను రిజిస్టర్ చేసుకోమని ఈసీ చెప్పినప్పుడు 2014 ఎన్నికల నాటికి పదివేలమంది మాత్రమే ఆ పనిచేశారు. ఎన్నారైల ఓటింగ్‌కు సంబంధించిన పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు వచ్చినప్పుడు ఆ అవకాశం ఎలా కల్పించాలో నిర్ధారించడానికి ఒక కమిటీని వేసినట్టు ఎన్నికల సంఘం తెలియచేసింది. ఈ కమిటీ అన్ని పార్టీల అభిప్రాయాలనూ సేకరించింది. పరోక్ష ఓటింగ్‌ను సీపీఎం, కాంగ్రెస్ వంటివి వ్యతిరేకించాయి. అన్ని మార్గాలనూ అధ్యయనం చేసిన తరువాత ఈ కమిటీ దౌత్యకార్యాలయాల్లో ఓటింగ్ ఏర్పాటుచేయడం, ఇంటర్నెట్ ఓటింగ్‌ను అనుమతించడం కుదరవని తేల్చింది. అలాగే, పోస్టల్ బ్యాలెట్, ఈ-పోస్టల్ బ్యాలెట్ (రిటర్నింగ్ అధికారి ఎన్నారైకు ఖాళీ బ్యాలెట్ పంపితే అతడు ఓటువేసి తిరిగి అధికారికే పంపే విధానం) విధానాల్లోనూ లోపాలున్నాయని తేల్చింది. ప్రాక్సీ ఓటింగ్‌ను పరిశీలించవచ్చునని మాత్రమే ఈ కమిటీ చెప్పినప్పటికీ, నెలరోజుల క్రితం సుప్రీంకోర్టు ఏదో ఒక విధానాన్ని త్వరగా నిర్ధారించమని ఒత్తిడిచేయడం మోదీ ప్రభుత్వానికి కలిసివచ్చింది.

అయితే, ఈ విధానంలో ప్రాక్సీగా నమోదైన వ్యక్తి కచ్చితంగా ఎన్నారై సూచించిన పార్టీకే ఓటుచేస్తాడన్న నమ్మకం లేదు. సదరు వ్యక్తి అభ్యర్థులందరినుంచీ ప్రాక్సీ అధికారాన్ని చూపించి డబ్బులు తీసుకోవచ్చు, అంతిమంగా తనకు నచ్చిన వారికే ఓటువేయవచ్చు. ఒకే ఓటు వున్న వ్యక్తి ఇప్పుడు రెండు ఓట్లున్న వాడవుతాడు. ప్రవాసులు తమకు ఉపాధినిచ్చిన వారికో, పై అధికారులకో జడిసి వారు చెప్పిన వారినే ప్రాక్సీలుగా గుర్తించే అవకాశాలూ ఉన్నాయి. ఇక గల్ఫ్ దేశాలకు వలసపోయిన వారిలో అత్యధికులు పెద్దగా చదువుకోనివారు, నైపుణ్యంలేని వారు కావడం వల్ల వారు 'ప్రాక్సీ'లను నమోదు చేసే విషయంలో ఉత్సాహం చూపించకపోవచ్చు. కానీ, ఇందుకు భిన్నంగా రాజకీయపక్షాల ప్రతినిధులు రంగంలోకి దిగి తమవారిని ప్రాక్సీలుగా రుద్ది ఓట్ల వేట జోరుగా సాగించవచ్చు. వివిధ దేశాల్లోని ఎన్నారై సంఘాలు, రాజకీయపార్టీల సంఘాలు కూడా ఇందులో కీలకమైన పాత్ర పోషించే అవకాశాలున్నాయి. ఇక, ఒక కుటుంబంలోని వ్యక్తుల్లో వేర్వేరు రాజకీయ అభిప్రాయాలున్నప్పుడు అతడి కుటుంబీకులే ఎన్నారై సూచించిన వ్యక్తికి ఓటేస్తారన్న నమ్మకం లేదు. విదేశాల్లో ఉన్న మహిళలు భయానికో, భక్తికో అత్తవారి కుటుంబీకులనే ప్రాక్సీలుగా ప్రకటించి తద్వారా తాను అనుకున్న పార్టీకి ఓటువేయలేకపోవచ్చు. శాసనసభ ఎన్నికల్లోనే కాక, పార్లమెంటు ఎన్నికల్లో కూడా హోరాహోరీ పోరు కారణంగా ఐదుపదివేల ఓట్లు గెలుపోటములను తేల్చేస్తున్న కాలమిది. ఈ దేశ రాజకీయాలతో ప్రత్యక్షంగా సంబంధం లేని వారు ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయిస్తున్న ఈ ప్రక్రియపై పార్లమెంటులో లోతైన చర్చ జరిగి అందరికీ సమ్మతమైన మార్గాన్ని ఆవిష్కరించడం అవసరం.

భారత్-చైనా మధ్య అమెరికా పిల్లి

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

చైనీయుల నాగరికత అంతర్ముఖ స్వభావం కలిగినది. ఆ దేశం పదే పదే విదేశీ దాడులకు గురైంది. పొరుగు దేశాలైన మంగోలియా, కొరియా, జపాన్, వియత్నాం, బర్మా, టిబెట్లు చైనాపై పలుమార్లు దాడి చేశాయి. దాదాపు 2,500 ఏళ్ళ క్రితం చిన్ రాజవంశీకులు బయటి తెగలు చేస్తున్న దాడుల నుంచి కాచుకోవటం కోసం గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను నిర్మించుకున్నారు. 6వ శతాబ్దంలో తాంగ్ రాజవంశీకులు ఇతర తెగలకు ముడుపులు చెల్లించి వారికి రక్షణ బాధ్యతలను అప్పగించటం ద్వారా శాంతిని నిలబెట్టుకున్నారు. 10వ శతాబ్దంలో సుంగ్ రాజవంశీకులు ఉత్తరాదిన ఉన్న తెగలకి ఏడాదికి ఇంత చొప్పున చెల్లించి వారి నుంచి ప్రమాదం రాకుండా చూసుకున్నారు. 13వ శతాబ్దంలో బీజింగ్ నగరాన్ని మంగోలు వంశ రాజు చెంఘీజ్ ఖాన్ స్వాధీనం చేసుకున్నాడు. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు చైనాను చుట్టుముట్టి వియత్నాంలో ఫ్రాన్స్, బర్మాలో ఇంగ్లాండ్, మంచూరియాలో రష్యా, కొరియాలో జపాన్ పాగా వేశాయి. మొదట్నుంచీ ప్రతీ చైనా పాలకుల ప్రధాన సమస్య బయటి దాడుల నుంచి తమ భూభాగాన్ని కాపాడుకోవటమే. చైనా పాలకులు కూడా అడపాదడపా పొరుగు దేశాలపై దండెత్తిన సందర్భాలు ఉన్నప్పటికీ, అవి ఎక్కువ కాలం సాగలేదు. చైనా తన నాలుగు వేల ఏళ్ళ సుదీర్ఘ చరిత్రలో ఎప్పుడూ ఒక విదేశీ నేలను జయించలేదు.

టిబెట్‌ను దీనికి ఒక మినహాయింపుగా చెప్పుకోవచ్చు. అయితే టిబెట్ చారిత్రకంగా చైనా సామంత దేశంగానే ఉంటూ, పశ్చిమాసియా ప్రాంతం నుంచి ఆక్రమణలు జరగకుండా చైనాకు ఒక కవచంగా ఉపయోగపడుతూ వచ్చింది. కాబట్టి చైనాతో ఆ దేశ సంబంధం– మన దేశానికి భూటాన్, నేపాల్ దేశాలతో ఉన్న సంబంధం లాంటిది మాత్రమే. దాన్ని చైనా దాడికి గురైన దేశమని అనలేం.

భారత్-చైనాల మధ్య స్నేహం అంటే అమెరికాకు గిట్టదు. కాబట్టి అది మన దేశంలో చైనాపట్ల వ్యతిరేకత పెంచేలా మన ప్రొఫెసర్లనూ, బ్యూరోక్రాట్లనూ ప్రోత్సహిస్తోంది. అమెరికా నడిపే ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్య సమితి, ఇతర బహుళజాతి సంస్థల నుంచీ, ఇంకా నేరుగా అమెరికన్ విశ్వవిద్యాలయాల నుంచీ అనేక లాభదాయకమైన ఒప్పందాల్ని ఆశించే మన బ్యూరోక్రాట్లు ఆ అమెరికా పాటే పాడతారు.

చైనాలాగే భారతీయ నాగరికత కూడా అంతర్ముఖ స్వభావాన్ని కలిగినదే. మొదట్నుంచీ ఈ దేశం కూడా కుషాణులు, శృంగులు, మొఘలులు, ఫ్రెంచివారు, బ్రిటీషువారు, పోర్చుగీసులు ఇలా అనేక పాశ్చాత్య దాడుల్ని చవిచూసింది. స్వభావసిద్ధంగా భారత్, చైనాలు అంతర్ముఖమైన, స్నేహశీలమైన దేశాలు.

ఈ రెండు దేశాల స్నేహానికీ 1962 యుద్ధంతో మొదటి ఆటంకం ఏర్పడింది. ఆనాటి భారత రక్షణ మంత్రి కృష్ణ మీనన్ అవలంబించిన బాధ్యతారహితమైన 'ఫార్వార్డ్ పాలసీ' (దుందుడుకు ఆక్రమణ విధానం) వల్లనే ఈ యుద్ధం జరిగిందని నెవిల్ మాక్స్‌వెల్ ఎంతో అమూల్యమైన సమాచారాన్ని సేకరించి రాసిన 'ఇండియాస్ చైనా వార్' పుస్తకం స్పష్టంగా నిరూపించింది. పరంపరగా చైనా వారి అధీనంలో ఉంటూ వచ్చిన భూభాగాల్లోనికి భారతీయ సైన్యం దూకుడుగా చొరబడింది. "పాఠం నేర్పటం" అనే మాటను చైనీయులు ఎక్కువగా వాడుతుంటారు. వారికి సంబంధించినంత వరకూ 1962 యుద్ధం భూభాగాన్ని ఆక్రమించటం కోసం జరిగింది కాదు; భారత దేశానికి "పాఠం నేర్పటం" కోసం జరిగింది. కాబట్టి మనం 1962లో జరిగిందంతా మన తెలివితక్కువతనం వల్లనే అని ఒప్పుకొని ఊరుకోవటం మంచిది. ఫ్రాన్సుపై జర్మనీ దేశం దండెత్తి విజయం సాధించినప్పటికీ, ఉమ్మడి శ్రేయస్సు కోసం ఫ్రాన్స్ జర్మనీతో రాజీకి వచ్చింది. అదే విధంగా మనం కూడా మన సరిహద్దు సమస్యలపై ఒక రాజీకి రావటం పెద్ద కష్టమేం కాదు. ప్రస్తుతం డోకలామ్ వద్ద ఏర్పడిన ఘర్షణాత్మక వాతావరణానికి మరో 'ఫార్వార్డ్ పాలసీ' కారణమా, లేక చైనా దౌర్జన్యమే కారణమా అన్నది నాకు తెలీదు. కాబట్టి, నేను ఈ వ్యాసాన్ని ఒక స్థూల దృక్పథం నుంచి రాస్తున్నాను.

భారత్-చైనాల మధ్య స్నేహం పెరగటం అమెరికా పిల్లికి ఇష్టం ఉండదు. అమెరికా రెండో ప్రపంచ యుద్ధం నాటి నుంచీ ఒక దౌర్జన్యపూరితమైన దేశంగానే వ్యవహరిస్తోంది. అమెరికా పునాదులే స్థానిక రెడ్ ఇండియన్ల రక్త తర్పణాలందుకున్న నేలపై ఏర్పడ్డాయి. ఐరోపా నుంచి వచ్చిన ఈ ఆగంతకులు అక్కడి స్థానికుల్ని నిర్దాక్షిణ్యంగా చంపి, బలవంతంగా వారి భూభాగాల్ని ఆక్రమించుకొన్నారు. అమెరికా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాతి నుంచి కొరియాపైనా, వియత్నాంపైనా, ఇరాక్‌పైనా దాడులకు దిగింది. చిలీలో సాల్వడార్ అలెండె వలే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎందరో నాయకుల్ని పదవీచ్యుతుల్ని చేయటంలో సాయపడటమేగాక, సౌదీ అరేబియా వంటి ఎన్నో ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రభుత్వాలకు తన వ్యాపార లబ్ధి కోసం నిస్సిగ్గుగా మద్దతునిస్తూనే వచ్చింది. భారత్, చైనాల మధ్య స్నేహం ఉండటం అమెరికాకు గిట్టదు. కాబట్టి అది మన దేశంలో చైనాపట్ల వ్యతిరేకత పెంచేలా మన ప్రొఫెసర్లనూ, బ్యూరోక్రాట్లనూ ప్రోత్సహిస్తోంది. అమెరికా నడిపే ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్య సమితి, ఇతర బహుళజాతి సంస్థల నుంచి, ఇంకా నేరుగా అమెరికన్ విశ్వవిద్యాలయాల నుంచీ అనేక లాభదాయకమైన ఒప్పందాల్ని ఆశించే మన బ్యూరోక్రాట్లు ఆ అమెరికా పాటే పాడతారు. భారత ప్రభుత్వ మాజీ విద్యుచ్ఛక్తి కార్యదర్శి ఒకరు ప్రపంచ బ్యాంకు తనకు అప్పజెప్పిన పనికి రోజుకు 65వేల రూపాయలు ఇస్తోందని ఎంతో గర్వంగా నాతో చెప్పారు. ఆయన సహజంగానే ప్రపంచ బ్యాంకును నడిపించే అమెరికన్ దొరల తరఫున పనిచేస్తాడు. మన బ్యూరోక్రాట్లూ, ప్రొఫెసర్లూ ఇలాంటి లాభదాయకమైన ఒప్పందాల పట్ల ఆశతో అప్రయత్నంగానే అమెరికా తరఫున పనిచేస్తుంటారు. అలా తెలివైన పిల్లిలాంటి అమెరికా భారత్, చైనాలను ఓ రెండు వెర్రి కోతుల్ని చేసి వాటి మధ్య చిచ్చు రాజేస్తోంది.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

నిజమైన ప్రత్యామ్నాయం మేమే!

నంద్యాల ఉపఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ ఒకవైపు, ప్రతిపక్షంగా చెలామణి అవుతోన్న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్‌సీపీ) మరోవైపు పోటీచేస్తున్నట్లు పైకి కనిపిస్తోంది. అయితే తెరవెనక నుంచి ఇద్దరినీ నడిపిస్తున్న రాజగురువు మాత్రం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)యేనన్నది బహిరంగ రహస్యం.

రాష్ట్రానికి పదేళ్ళు ప్రత్యేకహోదా అమలుచేస్తామని 2014 ఎన్నికల ముందు హామీనిచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చాక హోదాను తుంగలో తొక్కింది. రాష్ట్ర సత్వర అభివృద్ధికోసం కాంగ్రెస్(యూపీఏ) ప్రభుత్వం ఇచ్చిన 5 ఏళ్ళ హోదాను కూడా అమలుచేయకుండా తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్రాభివృద్ధికి భరోసాగా సుమారు 5 లక్షల కోట్ల విలువ చేసే అనేక ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం చట్టంలో ఇస్తే వాటన్నింటినీ ఎన్డీయే (బీజేపీ–టీడీపీ) ప్రభుత్వం పక్కనపెట్టింది. మరీముఖ్యంగా అత్యంత వెనకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్రలకు చట్టబద్ధంగా ఇచ్చిన సుమారు రూ. 23,450 కోట్ల 'ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ'ని కూడా అమలుచేయకుండా రాయలసీమకు తీరనిద్రోహం చేసింది.


బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపైన ప్రజలపక్షాన నిలదీయాల్సిన అధికార తెలుగుదేశం పార్టీ తమ స్వలాభాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టి బీజేపీకి మోకరిల్లింది. చివరకు ప్రత్యేక హోదానే అవసరం లేదంటూ రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచింది. ఇక ప్రతిపక్ష వైసీపీ అయినా కేంద్ర అన్యాయంపైన రాజీలేకుండా పోరాడుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది.

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా నేడు దేశంలో ఒక వ్యూహం ప్రకారం మతతత్వ విద్వేష రాజకీయాలు నడుపుతూ దళితులు, మైనారిటీలు, గిరిజనులు, ఇతర బలహీనవర్గాలపై అనేక రూపాల్లో నిత్యం మానసిక, భౌతిక దాడులను ప్రోత్సహిస్తున్న బీజేపీకి రాష్ట్రంలోని అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీలు 'సంపూర్ణ మద్దతు' తెలపడం రాజ్యాంగ లక్ష్యాలను, లౌకికవాద, ప్రజాస్వామ్య, సామాజికన్యాయ లక్ష్యాలను విస్మరించడమే. రాష్ట్రాలపైన రాజకీయ గుత్తాధిపత్యం కోసం బీజేపీ చేస్తున్న నయా బ్లాక్‌మెయిలింగ్, అనైతిక, అవినీతికర కుట్రల్లో తమ తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం టీడీపీ, వైసీపీలు రెండూ తోలుబొమ్మలుగా మారాయి.

ముఖ్యంగా వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆశయాలే తమ విధానాలంటూ ప్రచారం చేసుకుంటున్న వైసీపీ రాజశేఖర్‌రెడ్డి ఆత్మ ఘోషించే విధంగా మతతత్వ బీజేపీకి లొంగిపోయింది. వైఎస్ఆర్ ఏనాడూ మతతత్వ బీజేపీతో ఎలాంటి స్నేహం చేయలేదు. రాజశేఖర్‌రెడ్డి రాజకీయ చరిత్ర మొత్తం కాంగ్రెస్ పార్టీ చరిత్రతోనే ముడిపడింది. కాంగ్రెస్ పార్టీ లౌకిక విధానాలనే రాజశేఖర్‌రెడ్డి చివరి శ్వాసవరకూ పాటించారు. కనుక బీజేపీకి సంపూర్ణ మద్దతును ప్రకటించాక కూడా వైసీపీ రాజకీయంగా రాజశేఖర్‌రెడ్డిని స్మరించడం అనైతికం. ఎవరో రిజిష్టరు చేసుకున్న యువజన, శ్రామిక రైతు పార్టీని వైఎస్ఆర్ కలిసి వస్తుందని తీసుకుని, కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా మరణించిన రాజశేఖరెడ్డి బొమ్మను పెట్టుకుని, కాంగ్రెస్ పార్టీ పదేళ్ళ పాలనలో చేసిన సంక్షేమ పథకాలను తమవిగా ప్రచారం చేసుకుంటున్న వైసీపీని నిజానికి ఒక 'డమ్మీపార్టీ' అనాలి. వైసీపీకి సొంత సిద్ధాంతాలు, విధానాలు లేవు. మొన్న ఆ పార్టీ ప్రకటించిన 'నవరత్నాలు' పథకాలు కూడా ఒక్కటి మినహా మిగతావన్నీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేసినవే.

2014 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీచేసిన వారు ఇప్పుడు వైసీపీ తరపున.. అప్పుడు వైసీపీ నుంచి పోటీచేసినవారు ఇప్పుడు తెలుగుదేశం తరపున పోటీచేయడం వారివారి స్వార్థ రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట. కేవలం అధికారం కోసం లేదా గెలుపుకోసం క్షణాల్లో పార్టీలు మార్చేయడం, విలువల్ని, నైతికతలను నడిబజారులో వదిలేయడం వీరికే చెల్లింది. ఫిరాయింపులను నిర్లజ్జగా టీడీపీ ప్రోత్సహించింది. వైసీపీ కూడా అధికారపక్షానికి తక్కువేమీ కాదన్నట్లు ఇంతవరకూ తమపార్టీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన వ్యక్తిని కాదని, టీడీపీలో టిక్కెట్టు ప్రకటించే విషయంలో స్పష్టత ఇవ్వడం లేదంటూ బయటకు వచ్చిన వ్యక్తిని ఆఘమేఘాలమీద తమ అభ్యర్థిగా ప్రకటించేసింది. అభ్యర్థులు మారలేదు. మెడలో రంగుల కండువాలే మారాయి. నిజంగా దీనిలో ప్రజల ప్రయోజనాలు ఎక్కడ? ప్రజల కోసం ఎవరైనా పార్టీలు మారారా? ప్రజల సమస్యల కోసం ఎవరైనా రాజీనామాలు చేసారా?

నంద్యాల ఉప ఎన్నికల్లో ఓడిపోతే తమ రాజకీయ భవిష్యత్తు శూన్యమైపోతుందనే భయం టీడీపీ, వైసీపీలను వెంటాడుతోంది. అందుకే అధికార తెలుగుదేశం పార్టీ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆఘమేఘాల మీద అభివృద్ధి ముసుగుతో వందల కోట్లు కుమ్మరిస్తోంది. వైసీపీ కూడా తన 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను ముందే ప్రకటించేస్తుందంటే ఎన్ని హామీలైనా గుప్పించి, ఎలాగైనా ప్రజల్ని నమ్మించి గెలవాలనే అధికారదాహం తప్ప



మరేమీ కనిపించడం లేదు. ఈ విషయంలో టీడీపీకి వైసీపీ ఏమీ భిన్నంగా లేదు. విధానాలపరంగా చూస్తే అధికార దాహంతో ఇద్దరూ 2019 ఎన్నికల్లో బీజేపీతో స్నేహానికి వెంపర్లాడుతున్నవారే.

2014 టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో 600లకు పైగా హామీలను ఇచ్చింది. ఈ హామీలతో ఓట్లు పొంది అధికారం చేపట్టాక ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయకుండా రాష్ట్రప్రజలను దగా చేసింది. రైతు, డ్వాక్రా, చేనేతల రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, ప్రతి కుల సమూహానికీ విడివిడిగా అనేక హామీలు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి, సంక్షేమానికి ఎన్నో వాగ్దానాలు చేసింది. ఏఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేసింది. గత మూడేళ్ళ టీడీపీ పాలనలో అన్నిరంగాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. రాయలసీమ సమగ్రాభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించకుండా ఈ ప్రాంతంపై వివక్ష చూపుతోంది. ఒకే ప్రాంతంలో అభివృద్ధినంతా కేంద్రీకరిస్తూ మళ్ళీ ప్రాంతీయ విద్వేషాలకు పరోక్షంగా తెలుగుదేశం ప్రభుత్వం ఆజ్యం పోస్తోంది. ఇక ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన వైసీపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై చివరి వరకూ పోరాడాల్సిన బాధ్యత నుండి రెండేళ్ళ ముందే వైదొలగిపోయింది. రెండేళ్ళ తర్వాత జరిగే సాధారణ ఎన్నికలకు ఇప్పటినుంచే హామీలను గుప్పించడం మొదలుపెట్టింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇదొక విచిత్ర పరిస్థితి.

దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల నాయకత్వంలో అనన్యమైన త్యాగాలు చేసిన సంస్థ కాంగ్రెస్. స్వాతంత్ర్యానంతరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌తో కలిసి అద్భుత రాజ్యాంగాన్ని ఈ దేశానికి అందించిన పార్టీ కాంగ్రెస్. అనేక మతాలు, కులాలూ, ప్రాంతాలుగా విడిపోయివున్న సమాజాన్ని ఒకదేశంగా కలిపి వుంచి అన్నివర్గాల ప్రజలూ సామరస్యంతో, గౌరవంగా జీవించే విధంగా ఈ దేశాన్ని నిర్మించిన పార్టీ కాంగ్రెస్. ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలకు రిజర్వేషన్లతో పాటు, అనేక సంక్షేమ కార్యక్రమాలను రూపొందించింది. మహిళల సాధికారత కోసం రాజకీయంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన పార్టీ కాంగ్రెస్. చట్టసభల్లో సైతం మహిళలకు, బీసీలకు రిజర్వేషన్లు అమలు ద్వారా న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నది. దేశంలో హరిత విప్లవాన్ని, పారిశ్రామిక విప్లవాన్ని, శాస్త్ర సాంకేతిక విప్లవాలను సాధించి భారతదేశాన్ని ప్రపంచ దేశాల ముందు అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టిన ఘనత కాంగ్రెస్‌ది. దేశహితం కోసం, మత సామరస్యం, లౌకిక విధానాల పరిరక్షణ కోసం, శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు ప్రాణత్యాగాలు చేసారు.

2004 నుంచి 2014 వరకూ అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ పేదలకు, రైతులకు, యువతకు, మహిళలకు, సమాజంలోని అన్నివర్గాలకు 'ఇందిరమ్మ రాజ్యం – ఇంటింటా సౌభాగ్యం' పేరుతో ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీది. సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దార్శనికతలో రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో వెనకబడ్డ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. దేశవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, ఆహారభద్రత చట్టం, ఉపాధిహామీ చట్టం, 2013 భూసేకరణ చట్టం, అటవీహక్కుల చట్టం, ఇలా అనేక హక్కులను ఈ దేశ ప్రజలకు అందించిన ఘనచరిత్ర కాంగ్రెస్ పార్టీదే. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్ళు, ఆరోగ్యశ్రీ, రైతుకు రుణమాఫీతో పాటు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, వడ్డీలేని రుణాలు, పింఛన్లు, ఇలా అనేక విధాలుగా ప్రతిఒక్కరికీ సంక్షేమంలో స్వర్ణయుగం చేసిన పార్టీ. ఒక్క మాటలో ఈ దేశాన్ని ఒకపక్క సంక్షేమ రాజ్యంగా మరోపక్క ఆధునిక భారతదేశంగా నిర్మించిన పార్టీ కాంగ్రెస్.

ఈ దేశ చరిత్రపైన, కాంగ్రెస్ త్యాగాలపైన, కాంగ్రెస్ ఈ దేశానికి చేసిన సేవపైన ఏమాత్రం అవగాహనలేని కొందరు కాంగ్రెస్‌ను తక్కువచేస్తూ ప్రగల్భాలు పలుకుతుంటారు. చెప్పుకోవడానికి ఏ చరిత్ర లేనివాళ్ళు, ఈ దేశం కోసం ఎలాంటి త్యాగాలూ చేయనివారు, కాంగ్రెస్‌పైన, కాంగ్రెస్ మహానాయకులపైన తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్వేషాలను కలిగిస్తుంటారు. కాంగ్రెస్ పార్టీ అనేక జయాపజయాలను చూసింది. కాంగ్రెస్‌కు గెలుపు ఓటములు కొత్తకాదు. అనేక సంక్షోభాల నుంచి తిరిగి ఫినిక్స్ పక్షిలా లేచి మహాశక్తిగా ఎగసిపడింది. అయితే ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న కొన్ని భావోద్వేగాలతో తల్లి మీద అలిగినట్లు ప్రజలు కాంగ్రెస్‌పైన అలిగారు అంతే. రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నంద్యాల ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ మీ వెంటే వుండి పోరాడుతుంది. రాయలసీమ సాగునీటి హక్కుల కోసం ముఖ్యంగా ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరి నగరి తదితర ప్రాజెక్టుల పూర్తికోసం, గుండ్రేవుల రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాల కోసం, శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకు పునరుద్ధరించడం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేస్తున్నాం.

■ డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి
అధ్యక్షులు, ఏపీసీసీ

జనవాక్యం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

గ్రామాలకు చేరని ప్రగతి రథం..!

భారతదేశంలో 25 ఏళ్ళ క్రితం ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల ఫలం పరిశ్రమాధిపతులతో పాటు పట్టణ మధ్యతరగతి ప్రజానీకానికి అందాయి. ప్రస్తుతం సమాచార, శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందడంతో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించాయి. నేడు భారతీయ వినియోగదారులు సెల్‌ఫోన్లు, టీవీలు, కార్లు వంటి ఇతర ఉపకరణాలను సులభంగా ఏర్పాటుచేసుకోగలుగుతున్నారు. ఇదంతా మన ఆర్థికాభివృద్ధికి నిదర్శనమే! కానీ, ఈ ప్రగతి బాటలో నగరాలతో పాటు పల్లెలూ, గిరిజన ప్రాంతాలూ పాత్రధారులైనప్పుడే భారతదేశం నిజమైన ఆర్థికాభివృద్ధి సాధించగలదు. ఈ కల నిజం కావాలంటే, ఆర్థికరంగంతో పాటు వ్యవసాయం, పరిపాలనా, గ్రామీణ వైద్య, విద్యారంగాల్లో నూతన సంస్కరణలు రావాలి. నేడు గ్రామీణ ప్రజలకు అడుగడుగునా పలు రూపాల్లో అవరోధాలు ఎదురవుతున్నాయి. నాసిరకం విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులను అమ్ముతున్న కంపెనీలు, దుకాణాల ఆట కట్టించడానికి అధికార యంత్రాంగం చిత్తశుద్ధి చూపకపోవడం వల్ల చిన్న, సన్నకారు రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి మోసాలు ఎక్కువవుతున్నా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నాయో అర్థం కావడం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందేలా చూడడం సమ్మిళిత అభివృద్ధికి కీలకంగా పనిచేస్తుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి కొత్త కొత్త పద్ధతులు అవలంబించిన రాష్ట్రాల్లో గణనీయ ఫలితాలు వచ్చాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రైతు బజార్లు, మహిళా స్వయం సహాయక బృందాలు మంచి ఫలితాలనిస్తున్నాయి. మరికొన్ని రాష్ట్రాల్లో గ్రామాల సేద్య ఉత్పత్తులను ఒకే చోటుకు తెచ్చి క్రయ, విక్రయాలు జరిగేలా ప్రయోగాలు సఫలమైనవి. కేరళలో పేద మత్స్యకారుల సంఘాలు చేపల వ్యాపార అభివృద్ధికి తోడ్పడినవి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు పాల కంపెనీలు కుమ్మక్కై, రైతులు అమ్మే పాలలోని వెన్న శాతాన్ని తగ్గించి చూపుతున్నాయి. అవే పాలను వేరే చోట పరీక్షిస్తే వెన్న శాతం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ అంశంపై ఎవరికి ఫిర్యాదు చెయ్యాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. గత 25 ఏళ్ళ ఆర్థిక సంస్కరణల కాలంలో జీడీపీలో వ్యవసాయం వాటా బాగా తగ్గిపోవడమే గాక, గ్రామీణ యువతకు ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కుంగిపోయాయి. తద్వారా పట్టణాలకు వలసలు పెరిగిపోయాయి. స్మార్ట్ ఫోన్లు, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు తదితర అధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తే అధికార యంత్రాంగంలో అవినీతి అరికట్టవచ్చనే అభిప్రాయం ప్రభుత్వానిది. ప్రజల్లో చైతన్యం పెరగనంత వరకు, మారుతున్న కాలానికి అనువైన కొత్త సంస్థలు రానంత వరకు కేవలం టెక్నాలజీతోనే పని జరగదని ప్రభుత్వాలు గమనించాలి. ప్రజలు ప్రతి దానికి ప్రభుత్వంపై ఆధారపడటం అభిలాషణీయం కాదు. సంస్కరణలు అమలుచేసే క్రమంలో ప్రజల భాగస్వామ్యం కుడా ఉండాలి. అప్పుడు గానీ, ఆర్థికాభివృద్ధిలో పట్టణాలతో పాటు గ్రామాలు కూడా నిజమైన పురోగతి చెందుతాయి.

- శ్రీనివాస్ చిరిపోతుల, వెంకటేశ్వర్ల పల్లి

మార్కెట్ రక్షణపై ఆర్‌సీఈపీ వేటు

జూలై 24 నుంచి 28 వరకూ హైదరాబాద్‌లో జరిగిన 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య' ఒప్పందం (రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్ షిప్ – ఆర్‌సీఈపీ)పై చాలా వరకూ అంగీకారం కుదిరినట్లు తెలిసింది. ఈ ఒప్పందం వల్ల మనకున్న కొద్దిపాటి మార్కెట్ రక్షణ తప్పుతుంది. ఇప్పుడున్న ధరలు కూడా పంటలకు దక్కవు. పాడి, చేనేత, దేశీయ మార్కెట్‌పై ఆధారపడిన పరిశ్రమలు కుదేలవుతాయి. ప్రపంచ పెట్టుబడులు ఏకమై తలెత్తిన బహుళజాతి సంస్థలు ఉత్పత్తి రంగం మొదలు మార్కెట్ల వరకు అన్నింటా అధికారం చెలాయిస్తాయి. ఇవి దేశ సార్వభౌమత్వాన్ని కూడా సవాలు చేసే అధికారం చెలాయించే క్లాజులు ఇందులో ఉన్నాయి. ఈ మార్పులకు అవసరమైన 'ఇన్వెస్టర్ స్టేట్ డిస్ప్యూట్ సెటిల్‌మెంటు' (ఐఎస్‌డీఎస్) క్లాజుకు సభ్యదేశాలన్నీ అంగీకరించినట్టు సమాచారం పొక్కింది. ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంటు చాప్టర్‌నూ ఈ సమావేశంలోనే ముందుకుతెచ్చినట్టు తెలిసింది. పేటెంట్ల విధానానికి తెరెత్తారు. ఇంత తీవ్రత కలిగిన దీన్ని పార్లమెంటులో చర్చించకుండా ప్రభుత్వం ఆమోదించడానికి సిద్ధం కావడం ఎన్‌డీఏ పాలకులే కార్పొరేట్ల ఏజెంట్లయ్యారన్న విమర్శకు తావిస్తోంది.



ఆర్‌సీఈపీలో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వగైరా 16 సభ్య దేశాలున్నాయి. ఇవి 2012లో కాంబోడియాలో తొలి సమావేశం జరిపాయి. గత నెలలో హైదరాబాద్‌లో 19వ రౌండ్ జరిగింది. భారత్‌లో ఈ చర్చలు ఇక్కడి వరకూ రావడానికి తోడ్పడే క్రమం 1991 నుంచి మొదలైందని చెప్పొచ్చు. అప్పటి వరకు 113 శాతం దిగుమతి సుంకాలు విధించే హక్కుతో ప్రభుత్వ రంగం ఆసరాగా భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించింది. 1991 తరువాత ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ (ఎల్‌పీజీ) విధానాలతో మన మార్కెట్టుకూ, పెట్టుబడులకూ ఉన్న రక్షణ తప్పింది. ప్రపంచ పెట్టుబడితో ఏకం కావాలన్న దేశీయ సంపన్న పెట్టుబడిదారుల ఒత్తిడితో మన పాలకులు ఇందులో చేరారు. ఆపై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో 1995లో మన దేశాన్ని చేర్చారు. 1992 రెగ్యులేషన్ చట్టం ప్రకారం రూపొందిన 1997–2002 'ఎగ్జిమ్ పాలసీ'లోకి దించారు. ఐదేళ్ళకొకసారి దీన్ని మార్చేలా రూపొందించారు. ఇది 'ఎగుమతి ప్రోత్సాహక విధివిధానాల'ను రూపొందించింది. ఇప్పటి వరకు జరిగిన ఈ మార్పుల కొనసాగింపుగా ఆర్‌సీఈపీ ఉంది.

1991 తరువాత జరిగిన మార్పులేంటి? దిగుమతులపై 113 శాతంగా ఉన్న సుంకాన్ని 32.7 శాతానికి మన పాలకులు దించారు. ఎగ్జిమ్ పాలసీ వచ్చాక వాజ్‌పేయి ప్రధానిగా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఆయన ప్రభుత్వం ఫోఖ్రాన్ అణు పరీక్షలు జరపడం అమెరికా ఆగ్రహానికి కారణమైంది. దానిని ప్రసన్నం చేసుకునేందుకు మార్కెట్ రక్షణలో డబ్ల్యూటీవో మనకు ఇచ్చిన హక్కును మూడేళ్ళ ముందే వదులుకొని 2000, 2001లో 1428 వస్తువులను ఈ పాలసీ పరిధిలోకి తెచ్చారు. దీనిప్రకారం మన అవసరాలతో నిమిత్తం లేకుండా నిర్దేశిత మొత్తాలను దిగుమతి చేసుకొని తీరాలి. దీంతో చౌక పామోలిన్ దిగుమతులు జరిగాయి. ఫలితంగా వేరుశనగ, కొబ్బరి నూనె, ఇతర నూనె గింజల పంటల ధరలు పడిపోయాయి. దేశంలో అధికంగా గోధుమ ఉత్పత్తులు జరిగిన సంవత్సరమే ఎన్‌డీఏ ప్రభుత్వం దిగుమతులపై ఉన్న 25 శాతం సుంకాన్ని ఎత్తేసింది. దీంతో దిగుమతులు పెరిగి, రైతు అమ్మే గోధుమ ధరలు పడిపోయాయి. రెండేళ్ళు కరువుబారిన పడిన మధ్యప్రదేశ్‌లో 2016–17 వ్యవసాయ సీజన్లో దిగుబడులు పెరిగినా వరికి ధర లేకుండా పోయింది. కందిపప్పు దిగుమతితో మన రాష్ట్రంలో క్వింటా రూ.9 వేలు ఉన్న కంది ధర రూ.4 వేలకు పడిపోయింది.

ఆర్‌సీఈపీ ఒప్పందం అమల్లోకొస్తే ఇప్పటివరకూ పాక్షికంగానైనా ఉన్న దిగుమతి సుంకాలతో నిరోధించే రక్షణ పూర్తిగా తప్పుతుంది. మన ఉత్పత్తుల ధరలు బహుళజాతి సంస్థల లాభాల వేటకు బలవుతాయి. ఇప్పుడున్న ధరలు కూడా పంటలకు దక్కవు. పాడి, చేనేత, దేశీయ మార్కెట్‌పై ఆధారపడిన పరిశ్రమలు కుదేలవుతాయి. బహుళజాతి సంస్థలు ఉత్పత్తి రంగం మొదలు మార్కెట్ల వరకు అన్నింటా అధికారం చెలాయిస్తాయి. ఈ ఒప్పందం దేశ సార్వభౌమత్వానికి సవాలుగా మారుతుంది.

రైతు అమ్మే పంటల ధరలు పడిపోయినప్పుడు ప్రజలు కొనే పప్పుల ధరలు పెరగడంపై ప్రజల్లో తీవ్రమైన ఆందోళన వ్యక్తమైంది. దీనిపై ఆదాయపు పన్ను శాఖ స్పందించి 2015 అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య దాడులు చేసింది. ఈ ధరల మాయాజాలపు రాకెట్‌ను అది మూడు శ్రేణులుగా విశ్లేషించింది. తొలి శ్రేణిలో ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేసే బహుళజాతి స్థాయి సంస్థలున్నాయి. ముఖ్యమైన గ్లెన్‌కోర్, ఎడిల్ వైస్, షార్పుమెంటు గ్రూపులు పప్పులను దేశంలోకి దిగుమతిచేసే ప్రధాన సంస్థలుగా ఉన్నాయి. ఇంకా ఏటీజీ గ్రూపు, కమోడిటీ మల్టీ నేషనల్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. రెండో శ్రేణిలో దేశీయ డీలర్లయిన జిందాల్ గ్రూపునకు చెందిన దివిస్ జిందాల్, ప్రదీప్ జిందాల్, జిందాల్ ఆగ్రోతో పాటు సుపీరియర్ గ్రూపుకు చెందిన వికాస్ గుప్తా, ఎస్‌వి అగ్రిట్రేడ్‌కు చెందిన మనోజ్ అగర్వాల్, షార్పుమెంటు గ్రూపులున్నాయి. వీరు వ్యవసాయోత్పత్తులను రైతుల నుంచి సేకరించి తొలి శ్రేణి గ్రూపులకు అమ్ముతారు. మూడే శ్రేణిలో మనోజ్ అగర్వాల్, రిద్దిసిద్ది ఇంప్లెక్స్ పార్థ ఇంటర్నేషనల్, గున ఎంటర్‌ప్రైజెస్, చార్లెస్ ప్రయివేటు ఇండియా సంస్థలున్నాయి. లాభాలు తగ్గించి చూపి, పన్నుల ఎగవేతకున్న అవకాశాలను ఇవి తెలియజేస్తాయి. వీరు ముందు చెప్పిన రెండు గ్రూపుల ప్రయోజనాలను కాపాడే పనిలో ఉంటారు. ఇవి మనీ ల్యాండరిగుల్లోనూ తోడ్పడతాయి. ఇలా ఐటీ శాఖ రూపొందించిన 2,100 పేజీల నివేదికలో చౌకగా సేకరించడం, మార్కెట్లలో కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ధరలు పెంచడంలో దేని పాత్ర అవి నిర్వహిస్తున్నాయని 'ది వైర్' విశ్లేషించింది. ఇందువల్లే 2015లో తొలి దశలో 15 నుంచి 30 శాతం పెరిగిన పెసర, కంది, మినప ధరలు రెండో దశలో 64 శాతం పెరిగాయని విశ్లేషించింది. ఈ విధానాల ఫలితంగానే ప్రపంచ పాల ఉత్పత్తిలో 17 శాతం వాటాతో అతి పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఉన్న భారత్ పాడి పరిశ్రమ గాడి తప్పింది. 90 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల్లో పది శాతం మంది దీని నుంచి తప్పుకున్నారు. ఇలాంటి విధానాల మూలంగానే భారత బొమ్మల తయారీ పరిశ్రమ దారుణంగా దెబ్బతిన్నది. పింగాణీ పరిశ్రమ, చేనేత వృత్తులు ఒడిదుడుకులకు లోనయ్యాయి.

ఆర్‌సీఈపీ ఒప్పందం అమల్లోకొస్తే ఇప్పటి వరకూ పాక్షికంగానైనా ఉన్న దిగుమతి సుంకాలతో నిరోధించే రక్షణ పూర్తిగా తప్పుతుంది. సంపూర్ణ స్వేచ్ఛా వాణిజ్యం అమలౌతుంది. మన ఉత్పత్తుల ధరలు బహుళజాతి సంస్థల లాభాల వేటకు బలౌతాయి. ప్రపంచ మార్కెట్‌లో బడుగు దేశాల ఉత్పత్తులకు తావుండదు. సంపన్న దేశాలు వీటిని ముడి సరుకు సరఫరాదారులుగా మారుస్తాయి. వాటినే నవీనీకరించి (ప్రాసెస్ చేసి) తమ ఉత్పత్తులుగా ప్రపంచంలో ఎక్కువ ధర ఉన్నచోట అమ్ముతాయి. ఈ ఒప్పందంలో ఉన్న పేటెంట్ల విధానం కొన్ని రంగాల్లో బహుళజాతి సంస్థల పెత్తనానికి చోటిస్తాయి. ప్రత్యేకించి పేటెంటు పొందిన విత్తన కంపెనీలు విత్తన ధరలను ఇష్టానుసారంగా పెంచేస్తాయి. మందుల కంపెనీల్లోనూ ఇదే తరహా పెత్తనాన్ని చెలాయిస్తాయి. ఇందువల్ల మన దేశంలో పేదలకు ఊరటగా ఉన్న జనరిక్ మందుల దుకాణాలు కనుమరుగవుతాయి. యంత్ర, వస్త్ర, ఎలక్ట్రానిక్, పింగాణీ తయారీ వగైరా దేశీయ పరిశ్రమల మార్కెట్ వీటి కబ్జాకు గురౌతుంది. ఇందులో ఉన్న 'పెట్టుబడికి రక్షణ' అన్న క్లాజు మన దేశ సార్వభౌమత్వానికే సవాలుగా మారుతుంది. మన దేశ ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ చట్టాల పేరిట వీటి పెట్టుబడులకు అనుమతులు నిరాకరిస్తే మన పాలకుల్ని అంతర్జాతీయ న్యాయస్థానంలో సవాలు చేస్తాయి. అవి ప్రజా వ్యతిరేకమైనా పెట్టుబడి రక్షణ ఒప్పందాల మేరకు నడుచుకోవాలంటుంది. ఇందువల్ల మన జీడీపీలో అంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగ ఉత్పత్తుల్లో 1.6 శాతం తగ్గుదల ఉంటుందని వాణిజ్య శాఖ అంచనా కట్టింది. అయినా దేశీయ కార్పొరేటు వర్గాలు సంపదను పెంచుకునేందుకివి తోడ్పడతాయి. ఇంత తీవ్రత కలిగిన ఈ ఒప్పందాన్ని పార్లమెంటులో చర్చకు పెట్టకుండా ఆమోదించే పనిలో ఎన్‌డీఏ పాలకులున్నారు.

■ ఉన్నం వెంకటేశ్వర్లు
సీనియర్ జర్నలిస్టు



ఇంటి పని... వంట పని... ఆఫీసు పని... ఇష్టమైన సొంత పని... ఇన్నీ విసుగూ విరామం లేకుండా చేయడం మహిళలకే చెల్లిన మల్టీ టాస్కింగ్! ఏ దేశమేగినా... ఎందుకాలిడినా... భారతీయ వనిత ఈ మల్టీ టాస్కింగ్‌కి మచ్చుతునకే! కావాలంటే... లండన్‌లో ఉంటున్న ప్రవాస తెలుగు వనిత **వింజమూరి రాగసుధ**ను కలవండి. ఆమె డబుల్ పోస్ట్‌గ్రాడ్యుయేట్... భరతనాట్య కళాకారిణి... యూనివర్సిటీలో అధ్యాపకురాలు... స్కూళ్ళలో పిల్లలకు వర్క్‌షాపుల నిర్వాహకురాలు... మూడొందల ఏళ్ళ క్రితం నాటి ప్రాచీన తెలుగు పత్రాల గ్రంథాన్ని బ్రిటీషు లైబ్రరీ నుంచి బాహ్యప్రపంచంలోకి తెచ్చిన శోధకురాలు... బ్రిటీషు పార్లమెంట్ హౌస్ లలో ఇప్పటికి ఏడుసార్లు నృత్య ప్రదర్శన ఇచ్చి, రికార్డుకెక్కిన సాంస్కృతిక తేజం... పధ్నాలుగేళ్ళ క్రితం విదేశాలకు వెళ్ళినా, మూలాలు మర్చిపోని ఈ సంప్రదాయ సంగీత, సాహిత్య, నృత్య రాగసుధామయి **నవ్య**తో పంచుకున్న ముచ్చట్లు...

ప్రవాస కిరణం

నృత్య రాగసుధ

వింజమూరి రాగసుధ

నేను పెరిగింది, చదువుకున్నది, కొన్ని సంవత్సరాలు అధ్యాపకురాలిగా ఉద్యోగం చేసింది అంతా హైదరాబాదులోనే. దేశానికి రాణియైనా తల్లికి ముద్దుబిడ్డే అన్నట్లు, పన్నెండేళ్ళుగా లండన్‌లో ప్రవాసం అయినా, నాకు ఇప్పటికీ తెలుగుగడ్డ మీద, తెలుగు భాష మీద మమకారం తగ్గలేదు. సన్నిహితులు, బంధువులు అంతా ఇక్కడే. అందుకే, ఇప్పటికీ తరచుగా ఇండియాకు వస్తూనే ఉంటా.

చిన్నప్పటి నుంచి...

బ్రిటన్ లోనూ ఇవాళ నా గురించి చెప్పుకుంటున్నారంటే... ఇదంతా మన సంప్రదాయ లలిత కళల పుణ్యమే. మన కళలంటే నాకున్న ఇష్టమే నన్ను ఈ స్థాయికి తెచ్చింది. మా నానమ్మగారు వీణ, సంగీతం టీచరు. చిన్నతనం నించి నాకు సంగీత జ్ఞానం కొంత అలా అలవడింది. మా నాన్న గారికేమో నాట్యం మీద ఎక్కువ మక్కువ. అందుకని నన్ను మ్యూజిక్ కాలేజీలో భరతనాట్యంలో చేర్పించారు. అలా ఎనిమిదో ఏట నుంచి నృత్యం నేర్చుకుంటూ వచ్చా. మా నాన్నగారి పెదనాన్నగారైన వింజమూరి వరాహ నరసింహాచారి గారు కూడా సంగీతంలో దిట్ట. ఆయన తాళ లక్షణం లాంటి ముఖ్యమైన పుస్తకాలు ప్రచురించారు. కుటుంబ సభ్యులు లలితకళల్లో రాణించడం వల్ల వాటి పట్ల నా అభిరుచి నాతో పాటు పెరిగింది. రోజురోజుకీ బలపడింది.

విదేశానికి వెళ్ళిన కొత్తల్లో...

నేను 2003లో బ్రిటన్ కు వెళ్ళాను. అక్కడే స్థిరపడ్డా. ఇప్పుడు నాది బ్రిటీషు పౌరసత్వమే. మొదట్లో మాంచెస్టరులో ఉండేవాళ్ళం. అప్పట్లో అక్కడ తక్కువ మంది తెలుగువాళ్ళు ఉండేవాళ్ళు ఇప్పటితో పోలిస్తే. కొత్త ముఖాలు, కొత్త ప్రాంతం. మొదట్లో ఇబ్బంది పడ్డాను. క్రమంగా అక్కడ గుజరాతీ వాళ్ళతో అనుబంధం ఏర్పడింది. తద్వారా భారతీయ విద్యాభవన్‌లో పిల్లలకు నాట్యం చెప్పే అవకాశం వచ్చింది. అలా అలా అంచెలంచెలుగా పెరుగుదలకు అవకాశం లభించింది.

బ్రిటన్ పార్లమెంట్‌లో భారతీయ నృత్యం

బ్రిటీషు పార్లమెంటులోని కమిటీ రూముల్లో వివిధ సమావేశాలు జరుగుతూ ఉంటాయి. అందులో భాగంగా సంఘాలు, సంస్థలు రకరకాల అంశాలపై చర్చలు నిర్వహిస్తుంటాయి. అందుకు అనుమతి ఇస్తుంటారు. అలా కొన్ని సందర్భాలలో, కొన్ని ప్రత్యేక విషయాలపై నన్ను నాట్యం చెయ్యమని కోరారు. అలా బ్రిటీషు పార్లమెంటులోని ఎగువ సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్), దిగువ సభ (హౌస్ ఆఫ్ కామన్స్) రెండింటిలోనూ నాట్యాన్ని ప్రదర్శించే అరుదైన అవకాశం వచ్చింది. అలా ఇప్పటి దాకా బ్రిటీషు పార్లమెంటులో మూడేళ్ళలో ఏడుసార్లు నృత్య ప్రదర్శన చేశా. అది ఒక రికార్డు. అందుకే, (నవ్వుతూ...) అది నేను కొద్దిగా గర్వించే విషయమే.

అలాగే, 2012 అక్టోబరులో ఐక్యరాజ్య సమితి వారి జీవ వైవిధ్య సదస్సు (సి.బి.డి)కు భారతదేశం ఆతిథ్యమిచ్చింది. అదీ హైదరాబాదులో! అప్పుడు నేను బ్రిటన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ సాంస్కృతిక సమన్వయకర్తగా వ్యవహరించా. అంతేకాకుండా, స్వయంగా నోవాటెల్ ప్రాంగణంలో గ్రీన్ యాత్రలో భాగంగా నాట్యం కూడా చేశా. ఎదురుగా ప్రేక్షకులలో ఐక్యరాజ్యసమితి సి.బి.డి. కార్యనిర్వాహక కార్యదర్శి అయిన బ్రెజిల్ దేశానికి చెందిన డాక్టర్ బ్రౌలియో ఫెర్రైరా దియాస్ లాంటి ముఖ్యులున్నారు. వాళ్ళు మెచ్చుకోవటం ఎంతో సంతోషాన్నిచ్చింది.

నృత్యంలో... వైద్యం, సాధికారత

నేను లండనులో సంస్కృతి సెంటరు అనే సంస్థ ద్వారా భరతనాట్యం, జానపద నృత్యాలలో తర్ఫీదు ఇస్తూ ఉంటాను. ఈ క్రమంలో నాట్యపరంగా వైవిధ్యమైన అంశాలపై శ్రద్ధ చూపిస్తే పాశ్చాత్యులకు అర్థమయ్యేలా మన సంస్కృతిని ప్రదర్శించవచ్చని నాకు అనుభవమైంది. అలా నాకు తృప్తి కలిగించిన విషయం ఏమిటంటే... ఆయుర్వేదం ప్రాధాన్యం, వైద్య చికిత్సలో సంగీత - నృత్య ప్రాధాన్యం, మహిళా సాధికారత లాంటి అంశాలను ప్రదర్శించడం. ఈ అంశాలను నేను ఎంచుకోలేదు. సందేశాత్మకంగా ఉండేలా నాట్యాన్ని ప్రదర్శించండి అని నిర్వాహకులు అడిగారు. నిజానికి ఒక క్షేత్రయ్య పదానికో, అన్నమాచార్య కీర్తనకో నాట్యం చెయ్యమంటే తేలికయ్యేదేమో!



కానీ, వీటి గురించి నృత్యం అంటే పెను సవాలే. అందుకే, ఆయుర్వేదం పైన ఎలాంటి సంగీతంతో, ఏ విధంగా నృత్యాన్ని ప్రదర్శించాలని ఆలోచనామథనం చెయ్యాల్సి వచ్చింది. చివరికి ధన్వంతరి మంత్రాన్ని నేపథ్యంగా తీసుకుని ఆయనను విష్ణువు అవతారంగా చూపిస్తూ ఆయుర్వేదం ఎలా ఉద్భవించిందో ఒక కథలా చూపించా. వైద్య చికిత్సలో సంగీతం ఎలా ఉపయోగపడుతుందో నాట్యం ద్వారా చూపించడం కష్టమే. దానికి కూడా వేణునాదాన్ని నేపథ్యంగా తీసుకుని శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః అనే సందేశంతో నాట్యాన్ని మొదలుపెట్టాను.



అలాగే, ప్రపంచ జలదినోత్సవాల సందర్భంగా మేము నాట్యం ద్వారా 'జలాంజలి' పేరిట నివాళి అర్పించాం. దీని వెనుక కథేమిటంటే... భారత ప్రధాని నరేంద్ర మోడీ నీటిని పరిరక్షించండి అని చేసిన విస్తృత ప్రచారంలో భాగంగా బ్రిటీషు పార్లమెంటులో నీటి పరిరక్షణ పైన సదస్సు ఏర్పాటు చేశాం. నీటిపై ఆధారపడే జనసమూహాల వ్యవహారాల శైలి పైన ఈ నృత్యాంశం ప్రదర్శించాం.

తాజాగా మరో మరపురాని అనుభవం ఎదురైంది. బ్రిటన్‌లో కార్నివల్ అనేది ప్రజాదరణ పొందిన ఉత్సవం. అందులో ప్రపంచ నృత్యరీతులు ఉంటాయి. బెల్లీడాన్సు నుంచీ సాంబా, ఫ్యూజన్, ఆఫ్రికన్ దాకా రకరకాల శైలులు ప్రదర్శిస్తారు. ఇవి చూడటానికి వేలమంది గుమిగూడతారు. ఈ సంవత్సరం నేను మన భారతీయ జానపద నృత్యం ప్రవేశపెట్టా.

అంతా గురువుల దయ!

ఇవాళ నాకు వచ్చిన ఈ గుర్తింపు, గౌరవం నాకు నాట్యం నేర్పిన గురువుల భిక్షే. మా గురువుగారు డాక్టర్ ఉమా రామారావుగారి గురించి ఏం చెప్పినా అతిశయోక్తి కాదు. కూచిపూడి, భరతనాట్య కళల్లో ఆరితేరిన విదుషీమణి ఆమె. ఆవిడతో నాకు పాతికేళ్ళకు పైగా అనుబంధం. వారి దగ్గర నాట్యాభ్యాసం చెయ్యడం కళలో లోతులు, మెలకువలు అర్థం చేసుకోవడానికి ఎంతో దోహదం చేసింది. కొత్త విషయాల మీద నాట్యాన్ని ఎలా సమర్పించవచ్చో గురువు గారితో చర్చిస్తుంటే మేధస్సు పెరిగేది. కొన్నేళ్ళుగా వారితో కొన్ని పరిశోధనాంశాలపై కలిసి పనిచేశా. దాని ఫలితంగానే శ్రీనివాస గద్యం, కొన్ని శహాజీ మహారాజు గీతాలను నాట్యానికి అనుగుణంగా వెలువరించగలిగాం.

> బ్రిటన్‌కీ, భారతదేశానికీ విద్యావిధానాల్లో, బోధన ప్రణాళికలో చాలా తేడాలున్నాయి. భారతదేశంలో అరటిపండు ఒలిచి, చేతిలో పెట్టినట్టు చదివిస్తూ ఉంటాం విద్యార్థుల్ని. కానీ, బ్రిటన్‌లో అవగాహన ప్రక్రియ అంతా పరిశోధన, పరిశీలన ఆధారంగా ఉంటుంది.

అలాగే, నాకు తృప్తినిచ్చిన మరో పని ఉంది. రామానుజుల వారి జీవితచరిత్రపై రాసిన లేఖనం తాళపత్రాల రూపంలో లండన్‌లో బ్రిటీషు లైబ్రరీలో దాదాపు డెబ్భై ఏళ్ళుగా ఉంది. అందరికీ అందుబాటులో లేని, ఆ ప్రతి మొత్తం అంతా ఎత్తి రాయడానికి మూడేళ్ళకు పైగా పట్టింది. దాన్ని గత ఏడాది పుస్తకరూపంలో తీసుకొచ్చాం. ఆ పుస్తకావిష్కరణ కూడా బ్రిటీషు పార్లమెంటులోనే జరిగింది. ప్రస్తుతం దాన్ని ఆంగ్లంలోకి అనువదిస్తున్నా.

సమయం వస్తే ఆపలేరు!

నేను ఇప్పుడు లండన్‌లో యూనివర్సిటీ ఆఫ్ సండర్‌ల్యాండ్‌లో అధ్యాపకురాలిని. ఈ ఆధునిక సమాజంలో ఇప్పటికీ జాతి పరమైన వివక్ష, స్త్రీ పురుష లింగ వివక్ష గురించి విన్నప్పుడు బాధ అనిపిస్తుంది. మనం ఎంత చదువుకున్నా ఎన్ని తెలివితేటలు ఉన్నా, ఒక స్థాయి తరువాత బ్రిటిషువారు మనల్ని పై స్థానాల్లోకి రానివ్వరు, చేరనివ్వరు అని తెలిసినవాళ్ళు అంటారు. ఇవి వాళ్ళకు అనుభవం నేర్పిన పాఠాలు అనుకోవచ్చు. కానీ, క్రమంగా ఈ దృక్పథం మారుతోంది. నేనైతే వీలైనంత సహనంగా ఉండాలంటా. దేనికైనా సమయం ఉంటుంది. అప్పుడు మన ఎదుగుదల ఎవరూ ఆపలేరు అని నా నమ్మకం.

ఎప్పటికప్పుడు కొత్తదనం!

లండన్‌లో ఉన్నా... మాతృదేశాన్నీ, మాతృభాషనూ, సంస్కృతినీ మర్చిపోలేదు, మర్చిపోలేను. ఇప్పటికీ తెలుగులో చిన్న కథలు, కవితలు, వ్యాసాలు రాయడం అలవాటు. కొన్ని మంచి రచనల్ని ఇంగ్లిషులోకి అనువాదం చేస్తుంటా. ఎప్పటికప్పుడు పనిలో ఏదో ఒక కొత్తదనం ఎంచుకోవడం నాకిష్టం. ఆ మధ్య రెండు హాలీవుడ్ సినిమాలకు తెలుగు డైలాగ్ ఎడిటింగ్ సహాయం చేశా. ఒకటి వార్నర్ బ్రదర్స్ వారి బ్యాట్‌మ్యాన్ వర్సెస్ సూపర్‌మ్యాన్, ఇంకొకటి ఫెంటాస్టిక్ బీస్ట్స్ అండ్ వేర్ టు ఫైండ్ దెమ్. భాషాపాటవాన్ని రకరకాల రంగాల్లో ఉపయోగించచ్చు అనడానికి ఇదో ఉదాహరణ.

మా పాపకు ఋణపడి ఉంటా!

నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానంటే, అందుకు మా ఇంట్లో ప్రోత్సాహం కూడా కారణం. మా వారు వృత్తిరీత్యా ప్రాజెక్ట్ మేనేజర్. ఆయన మరాఠీ భాషీయులు. మేము ఇంట్లో హిందీలో మాట్లాడుకుంటాం. ఆయన నన్ను బాగా ప్రోత్సహిస్తూ ఉంటారు పరోక్షంగానైనా. మా అమ్మాయికి ఆరేళ్ళు. (నవ్వుతూ...) మా ఇంట్లోనే బహుళ సాంస్కృతిక సమ్మేళనం అన్న మాట! నా పురోగతి విషయంలో మా వారి కన్నా మా పాపకు నేను ఎక్కువ ఋణపడి ఉంటా. నేనెప్పుడూ తీరిక లేకుండా పనుల్లో మునిగిపోవడం వల్ల తగినంత సమయం కేటాయించడం లేదని అప్పుడప్పుడు నేనే తప్పు చేసినట్లు భావిస్తుంటా.

సంకల్పబలమే సాధనం

ఎవరికైనా ఉండేది రోజుకి ఇరవైనాలుగు గంటలే! అందుకే సమయాన్ని ఎలా విభజించుకోవాలి అనేది ఒక కళ ఏయే విషయాలకు ముందస్తుగా ప్రాధాన్యం ఇవ్వాలో ఒక ప్రణాళిక వేసుకుంటే అంతా సజావుగా సాగిపోతుంది. వర్కింగ్ ఉమన్‌గా తోటివారికి నేనిచ్చే మొదటి సలహా... ఆందోళన పడవద్దు అనేదే! టెన్షన్ పడినంత మాత్రాన ఏదీ పరిష్కారం కాదు. సమస్య కొలిక్కి రాదు. ఇది నేను చెయ్యాలి అని మనస్ఫూర్తిగా నిర్ణయించుకుంటే దానికి మనం సమయాన్ని కేటాయించాల్సిందే, దానికి ఉపాయం ఉండాల్సిందే. సంకల్పబలం అనేది మనల్ని ముందుకు తీసుకెళ్తుంది. కొద్దో గొప్పో త్యాగాలు చేయాల్సి వస్తుంది. పెద్దలు చెప్పినట్లు... కష్టే ఫలి! ఎవరికైనా ఇదే విజయసూత్రం!

• రెంటాల జయదేవ



చైతన్యం

కశ్మీర్‌లో.... మేము సైతం

కశ్మీర్ నిత్యం అల్లర్లతో రగులుతున్న ప్రదేశం. ఇది తెలిసిన వారెవరైనా అక్కడి యువత మనస్తత్వం ఎలా ఉందని అనుకుంటారు. తీవ్రవాదం వైపు సులభంగా ఆకర్షితులవుతుంటారని భావిస్తుంటారు. ఇక మహిళలు ఉద్యోగం మాటే ఎరగరు అని అనుకుంటారు. కానీ అది నిజం కాదు! అక్కడి యువతరంలో దేశం కోసం పనిచేయాలని తపించే వారు చాలామంది ఉన్నారు. ముఖ్యంగా మహిళలు మేము సైతం అంటూ ముందుకొస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పోలీసు ఉద్యోగాల ఎంపికే దీనికి నిదర్శనం.

వెల్లువలా...

కశ్మీర్ లోయలో పోలీసు ఉద్యోగాల ఎంపిక కోసం జమ్ము-కశ్మీర్ పోలీస్ శాఖ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఇది చూసిన చాలామంది కశ్మీర్‌లోయలో పోలీస్ ఉద్యోగాలను ఎవరు ఎంచుకుంటారు? అని అనుకున్నారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ అభ్యర్థులు పోలీసు ఉద్యోగం కోసం బారులు తీరారు. అందులోనూ మహిళా అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలకోసం రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. లేహ, కార్గిల్ జిల్లాల్లో జూలై 20న శారీరక దారుఢ్య పరీక్షలను నిర్వహించారు జమ్ము-కశ్మీర్ పోలీసులు. ఇందులో 1409 మంది అభ్యర్థులు అర్హత సాధిస్తే అందులో మహిళలే 299 మంది ఉన్నారు. ఇదే ఏడాది ఇంతకు ముందు 5300 కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపడితే 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. కశ్మీర్ లోయలో మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందనడానికి ఈ అంకెలు నిదర్శనమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మహిళలే ముందంజ...

పోలీస్ ఉద్యోగంలో చేరడానికి కశ్మీర్ మహిళలు ఆసక్తి చూపుతున్నారు. "జమ్ము డివిజన్‌లో ఆగస్టు 22 నుంచి 25 వరకు రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నాం. దీనికి అధిక సంఖ్యలో మహిళా అభ్యర్థులు హాజరవుతారని భావిస్తున్నాం" అని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. రాజౌరి, పూంఛ్ సెక్టార్‌లో సెప్టెంబర్ 7 నుంచి 10 వరకు నిర్వహించే డ్రైవ్‌లో ఎక్కువమంది మహిళా అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత ఏడాది నిర్వహించిన పోలీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 2 వేల మంది మహిళలు అర్హత సాధించారు. రెండో రౌండ్‌లో కొన్ని వందల మంది ఎంపికయ్యారు. ఇది లోయలో నివసించే మహిళల మనోధైర్యానికి అద్దం పడుతోంది. "నా కుటుంబానికి నా అవసరం చాలా ఉంది. నా చెల్లి, తమ్ముడు బాగా చదువుకోవాలి. వారి కోసం నేను పోలీస్ ఉద్యోగంలో చేరాలని అనుకుంటున్నాను" అని రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు వచ్చిన ఓ మహిళా అభ్యర్థి తన మనసులో మాటను పంచుకున్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనడానికి వచ్చిన పలువురు మహిళా అభ్యర్థులు పోలీస్ ఉద్యోగం గౌరవాన్ని, భద్రతను కల్పిస్తుందని భావిస్తున్నారు. అయితే ఇక్కడి వరకు వాళ్ల సులువుగా రాలేదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబసభ్యులు నిరాకరించారు. "నువ్వు ఆడపిల్లవి. పోలీస్ ఉద్యోగం చేయడమేంటి? అదీ కశ్మీర్‌లో...' అంటూ ఇంట్లో వాళ్ల నన్ను అడ్డుకున్నారు. నా నిర్ణయాన్ని ఇరుగుపొరుగు వారు సైతం వ్యతిరేకించారు. ఇది నా ఒక్కదాని పరిస్థితి కాదు. కశ్మీర్‌లోయలో అందరు మహిళలకు ఎదురయ్యేదే. అయితే మా కుటుంబసభ్యులను నేను ఒప్పించగలిగాను. ఇప్పుడిప్పుడే పరిస్థితిలో చాలా మార్పు వస్తోంది" అని మరో అభ్యర్థిని తన ఆవేదనను పంచుకున్నారు. మొత్తంగా కశ్మీర్ మహిళల్లో చైతన్యం వెల్లువిరుస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పిల్లలకు చారిత్రక సినిమాలు మేలు



పేరెంటచ్

పిల్లలు అడిగినప్పుడు మనకు నచ్చిన సినిమాల కన్నా, వాళ్లకు నచ్చిన వాటికే ఎక్కువగా తీసుకువెళుతుంటాం. వాటిల్లో చాలా వరకు సరదా సినిమాలే ఉంటాయి. అయితే అప్పుడప్పుడైనా, వాళ్లకు చరిత్ర ఆధారంగా తీసిన సినిమాలకు కూడా తీసుకు వెళుతూ ఉండాలి. నిజానికి సిలబస్ పుస్తకాలు చదవడానికే టైం సరిపోని రోజులివి. వాటికి అదనంగా పిల్లలతో చరిత్ర పుస్తకాలు ఏం చదివిస్తాం కానీ, గత చరిత్ర గురించిన కనీస జ్ఞానం లేకపోతే అది వారి జీవితంలో ఒక వైకల్యంగానే మిగిలిపోతుంది. చరిత్ర కోసం పుస్తకాలు పట్టుకుని చదవడం ఎవరికైనా కష్టమనిపించవచ్చేమో గానీ సినిమా చూస్తున్నప్పుడు ఆ కష్టం తెలియదు. నవలైనా, సినిమా అయినా అదొక సంగ్రహ ప్రక్రియ. ఒక సంక్షిప్త చిత్రణ. సమర్థుడైన ఒక దర్శకుడు దాదాపు 100 ఏళ్ల చరిత్రను కూడా రెండున్నర గంటల సినిమాలో చిత్రీకరించగలడు. అంతగా ప్రాధాన్యత లేని ఘట్టాలను మినహాయించడం ద్వారా ఈ సంక్షిప్తత సాధ్యమవుతుంది. అయితే, మిగతా సినిమాల్లో చాలా భాగం కల్పనే ఉంటుంది. చారిత్రక సినిమాల్లో కూడా కొంత కల్పన ఉండవచ్చు. కానీ అత్యధిక భాగం వాస్తవికతే ఉంటుంది. వాస్తవికత, కల్పన కన్నా ఎన్నో రెట్లు బలమైనది అనేది పరమ సత్యం. పిల్లలు ఎప్పుడైనా సామాజిక అంశాల చర్చల్లో పాల్గొన్నప్పుడు చారిత్రక అంశాలను ఉదహరించే ఎంతో కొంత జ్ఞానం ఈ చారిత్రక సినిమాల వల్ల కలుగుతుంది. ఇతర సినిమాల్ని అలా ఉదహరించే అవకాశం ఉండదు. ఒకవేళ ఉదహరించినా అది హాస్యాత్మకంగా ఉంటుంది. చారిత్రక సినిమాల్లో వినోదం అసలే ఉండదని కాదు. అందులోనూ వినోదంతో పాటు చారిత్రక జ్ఞానం కూడా ఉంటుంది. చారిత్రక ఆధారిత సినిమాలు చూడటం వల్ల పిల్లలకు కలిగే అదనపు ప్రయోజనమిది.



ఇలా చేయండి

ఒళ్లు నొప్పులా..!

కండరాల నొప్పులతో బాధపడుతున్నారా...! ఇలా చేయండి.

- గోరువెచ్చని నువ్వుల నూనెలో పిప్పర్‌మెంట్ ఆయిల్ కొన్ని చుక్కలు వేసి ఒంటికి రాసుకోవాలి.
- కండరాల నొప్పులు ఉన్నప్పుడు డిన్నర్‌లో తినే పదార్థాల్లో ఉప్పులేకుండా చూసుకోవాలి.
- కాల్షియం ఉండే డైట్ అంటే నట్స్, నువ్వులు, అవిసెలు, సన్‌ఫ్లవర్ సీడ్స్ బాగా తినాలి.
- పన్నీరు కూడా కండరాలకు, ఎముకలకు చాలా మంచిది.
- కండరాల నొప్పులు బాగా తీవ్రంగా ఉంటే శరీరంలో విటమిన్-డి ప్రమాణం ఎంత ఉందో పరీక్ష చేయించుకోవాలి.

స్వైన్ ఫ్లూ

భద్రం! బీ కేర్‌ఫుల్!!

స్వైన్ ఫ్లూ!.. ఇవాళ తరచూ వినిపిస్తున్న పేరు. పేదల నుంచి పేరున్న పెద్దవాళ్ల దాకా ప్రతి ఒక్కరినీ భయపెడుతున్న పేరు. ఏటా సీజన్‌లో విస్తృతంగా వ్యాపించే ఈ వ్యాధి తాజాగా ప్రముఖ హిందీ నటుడు ఆమిర్‌ఖాన్ కుటుంబంలో ఒకరికి ఇద్దరికీ రావడంతో జాతీయ వార్త అయింది.

ఇతరపరమైన మరికొన్ని వైరస్‌లలాగే స్వైన్-ఫ్లూ వైరస్ కూడా చాలా వేగంగా వ్యాపిస్తుంది. ప్రాథమికంగా దీని మూలాలు పందుల్లోంచి మొదలైనా, ఆ తర్వాత మనిషి నుంచి మనిషికి చాలా వేగంగా వ్యాపిస్తుంది. రోగ గ్రస్థుడైన వ్యక్తి ఒకే ఒక్క తుమ్ము ద్వారా వేల వైరస్‌లు బయటికి వస్తాయి. అలా తుమ్మినా, దగ్గినా ఆ వైరస్ ఆ పరిసరాల మీద, దగ్గరలో ఉన్న వ్యక్తుల మీద వాలిపోతుంది. గాలి ఈ వైరస్‌కు గొప్ప వాహకంగా పనిచేస్తుంది. 'హెచ్ 1 ఎన్ 1' అని పిలవబడే ఈ వైరస్ ఇన్‌ఫ్లూఎంజా వైరస్‌లాగే అనిపించినా దీని ఉధృతి చాలా తీవ్రంగా ఉంటుంది.

ఎవరికి సోకుతుంది?

- ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏళ్లు దాటిన పెద్దవారే ఎక్కువగా ఈ వైరస్ బారిన పడుతుంటారు.
- దీర్ఘకాలికంగా ఆస్పిరిన్ (బఫెరిన్) థెరపీ తీసుకునే యువతీ యువకులు కూడా ఈ వైరస్‌కు గురవుతారు.
- వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గిపోయిన వారిని ఈ వైరస్ చాలా వేగంగా ప్రభావితం చేస్తుంది. ఈ వైరస్‌కు గురయ్యే గర్భిణుల సంఖ్య కూడా ఎక్కువే.
- ఆస్తమా, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న వారు.

ఎలా తెలుస్తుంది?

స్వైన్‌ఫ్లూ వ్యాధిగ్రస్థుల్లో ముఖ్యంగా.. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు నుంచి నీరు కారడం, ముక్కు దిబ్బడ వేయడం వంటివి జరగవచ్చు. వీటికి తోడు ఒంటి నొప్పులు, నీరసం, వికారం, వాంతులు, విరేచనాలు కూడా కావచ్చు.

వైద్య చికిత్సలు

సమస్య ఒక సాధారణ స్థాయిలో ఉన్నప్పుడు మరీ అంత పెద్ద వైద్య చికిత్సలు అవసరం లేకపోవచ్చు. కాకపోతే ఈ వైరస్ ఇతరులకు సోకకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఆ జాగ్రత్తల్లో భాగంగా ఒసెల్టామివిర్ (టామీఫ్లూ), జనామివీర్ (రిలెంజా) వంటి యాంటీ వైరల్ మాత్రలు వేసుకోవాల్సి ఉంటుంది. బాగా ఆరోగ్యంగా ఉన్న వారికి ఈ వైరస్ సోకినా తమ వ్యాధి నిరోధక శక్తి ద్వారా ఏ మందులూ లేకుండానే దాన్నించి బయటపడతారు.

జాగ్రత్తలు

- స్వైన్ ఫ్లూ వైరస్ సోకిందని తెలియగానే విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలి. దీని వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. వైరస్‌తో పోరాడే బలం వారిలో పెరుగుతుంది.
- శరీరంలో ద్రవాలు తగ్గిపోకుండా తరచూ నీళ్లు, పండ్ల రసాలు తీసుకుంటూ ఉండాలి. కూరగాయల రసాలు, పండ్ల రసాలు వారు కోల్పోయిన పోషకాలను తిరిగి పూరించుకునే అవకాశం లభిస్తుంది.
- తలనొప్పి, గొంతునొప్పి, ఒంటినొప్పులు ఉంటే పెయిన్ రిలీవర్స్ వేసుకోవచ్చు.



నిర్లక్ష్యం తగదు!

చాలా అరుదుగానే అయినా ఒక్కోసారి ఈ స్వైన్ ఫ్లూ సమస్య, ప్రాణాపాయానికి దారి తీసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా హెచ్. ఐ.వి, ఎయిడ్స్ వంటి సమస్యలు ఉన్న వారిలో ఈ సమస్య తీవ్రంగా పరిణమిస్తుంది.

నివారణ ఉత్తమం!

- ఏటా టీకాలు తీసుకోవడం, స్వైన్‌ఫ్లూ ను నిరోధించే ఉత్తమ మార్గం. దీనికి తోడు తరుచూ సబ్బుతో చేతులు కడుక్కోవాలి.
- టేబుళ్లు, టెలిఫోన్ల వద్దకు వెళ్లకపోవడం, కళ్లు, నోరు, ముక్కు భాగాలను తరుచూ తాకకుండా ఉండడం ముఖ్యం.
- వైరస్ సోకిన వాళ్లకు దూరంగా ఉండాలి.
- మనుషులు గుంపులుగా ఉన్నచోటికి వెళ్లకపోవడం క్షేమకరం.

అక్కడో ఇక్కడో స్వైన్‌ఫ్లూ వైరస్ వ్యాపిస్తోందని తెలియగానే నివారణా చర్యలు చేపట్టాలి. వైరస్ సోకి సమస్య జటిలమవుతున్నప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం కూడా అంతే ముఖ్యం.

నవ్య — డాక్టర్

మొక్కకి పోషకాలు అవసరమే! అలాగని అవసరం లేకపోయినా ఎరువు వేస్తే ఏమవుతుంది? నేలలో సారం పెంచకుండా కేవలం కృత్రిమ ఎరువులు వేస్తే? అప్పుడూ లాభం ఉండదు. మొక్క కృశిస్తుంది. అలాంటిదే మన శరీరం కూడా! అవసరం ఉన్నా, లేకపోయినా 'హెల్త్ సప్లిమెంట్లు' ఎడాపెడా వాడేస్తే ఆరోగ్యం నశిస్తుంది.



హెల్త్ సప్లిమెంట్స్

అదనపు అనవసరం

కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, తృణ ధాన్యాలు, పప్పుధాన్యాలు తగు పరిమాణాల్లో ఉన్న సమతులాహారం తీసుకుంటే మన శరీరానికి సరిపడా పోషకాలు అందుతాయి. ఇలాంటి ఆహారం తీసుకునే ఆరోగ్యకరమైన వ్యక్తులకు అదనపు పోషకాల అవసరం ఉండదు. కానీ కొంతమంది కాస్త నీరసంగా అనిపించగానే 'బీ కాంప్లెక్స్' మింగేస్తూ ఉంటారు. ఇంకొందరు మోకాళ్లు నొప్పి పెడితే, 'క్యాల్షియం తక్కువైందేమో' అని ఆ సప్లిమెంట్లు వాడేస్తూ ఉంటారు. చర్మం మెరుపు సంతరించుకుంటుందని విటమిన్ ఇ క్యాప్స్యూల్స్, ఓపిక కోసం ఐరన్ టాబ్లెట్లు...ఇలా వైద్యుల ప్రమేయం లేకుండా మెడికల్ షాపులో దొరికే హెల్త్ సప్లిమెంట్లను విచ్చలవిడిగా వాడేస్తూ ఉంటాం. ఇలా చేయటం వల్ల మేలు కంటే కీడే ఎక్కువ. ఆరోగ్యంగా ఉండి హెల్త్ సప్లిమెంట్లు తీసుకోవటం వల్ల అదనంగా ఆరోగ్యప్రయోజనాలు సమకూరవు. అలా వాడటం వల్ల డబ్బు, దాంతోపాటు ఆరోగ్యం...రెండూ నష్టపోతాం. అయితే మరి ఈ హెల్త్ సప్లిమెంట్స్ ఎవరి కోసం ఉద్దేశించినవి? వీటిని ఎవరు వాడితే ఉపయోగం?

హెల్త్ సప్లిమెంట్లు వీళ్ల కోసం!

మద్యపానం చేసేవాళ్లు, వృద్ధులు, మంచానికే పరిమితమైన వాళ్లు, కొన్ని రకాల జబ్బుల వల్ల పేగులు ఆహారంలోని విటమిన్లను పీల్చుకోలేని రోగులు, బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్న వాళ్లు, కొన్ని రకాల ఆహార పదార్థాలని మాత్రమే ఎంచుకుని తినేవాళ్లు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, తల్లి పాలు మానేసిన తర్వాత కేవలం ఆవు పాల మీదే ఆధారపడే పిల్లలు...వీళ్లందరికీ అదనంగా విటమిన్లు అందించాల్సిన అవసరం ఉంటుంది.

వీటితో ప్రమాదం ఎక్కువ!

తగు ప్రమాణాల్లో విటమిన్లు తీసుకోవటం వల్ల ఆరోగ్యానికి ఎంత ప్రయోజనం ఉంటుందో, ఎక్కువ ప్రమాణాల్లో కొన్ని విటమిన్లు తీసుకోవటం వల్ల అంతకంటే రెట్టింపు ప్రమాదమూ ఉంటుంది. మనకు అందే విటమిన్లలో వాటర్ సాల్యుబుల్, ఫ్యాట్ సాల్యుబుల్...అనే రెండు రకాలైనవి ఉంటాయి. బీకాంప్లెక్స్ (బి1, బి2, బి6, బి12), విటమిన్ సిలు నీటిలో కరిగే గుణం కలిగి ఉంటాయి. కాబట్టి వీటిని తీసుకున్నా అవి మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతాయి. 'ఎ, డి, ఇ, కె' విటమిన్లు ఫ్యాట్ సాల్యుబుల్. ఇవి శరీరంలోని కొవ్వులో చేరి అక్కడే నిల్వ ఉండిపోతాయి. ఒంట్లో కొరత ఉంటేనే తీసుకోవాలి. అవసరం లేకపోయినా తీసుకుంటే కొంత పరిధి దాటాక శరీరంలో టాక్సిసిటీ (విషపూరితం)ని పెంచుతాయి. కాబట్టి ఈ రకమైన విటమిన్ల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి.

టాక్సిసిటీ అంటే?

ఫ్యాట్ సాల్యుబుల్ విటమిన్లు అవసరానికి మించి శరీరంలో చేరుకుంటే రక్తంలో కాల్షియం స్థాయిలు పెరిగిపోతాయి. ఈ అదనపు కాల్షియాన్ని పేగులు శోషించుకోలేవు. దాంతో కాల్షియం నిల్వలు మూత్రపిండాల్లో చేరి రాళ్లుగా మారతాయి. ఈ మూత్రపిండాల్లోని రాళ్లు మరెన్నో ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఇంతేకాకుండా తీసుకునే సప్లిమెంట్లను బట్టి రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఎక్కువైతే...ఇబ్బందులు!

విటమిన్ ఎ: 'విటమిన్ ఎ'ను గర్భిణులు పరిమితికి మించి తీసుకుంటే పిల్లలు అవకారాలతో పుట్టే ప్రమాదం ఉంది. అలాగే క్యాన్సర్ కారకాలు బిడ్డలో చేరుకునే అవకాశం కూడా ఉంటుంది.

బీటా కెరోటిన్: దీన్ని పరిమితికి మించి తీసుకుంటే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కి గురయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఒకవేళ ఊపిరితిత్తుల క్యాన్సర్ కలిగిఉండి, విపరీతంగా ధూమపానం చేసేవాళ్లైతే వ్యాధి మరింత తీవ్రమవుతుంది.

విటమిన్ ఇ: కొంతమంది చర్మ సౌందర్యం కోసం 'విటమిన్ ఇ' తీసుకుంటూ ఉంటారు. ఇలా రోజుకి క్రమం తప్పకుండా 400మి.గ్రా విటమిన ఇ తీసుకునే వాళ్లకి 'ఆల్కాజ్ మొటాలిటీ'...అంటే ఏ ఆరోగ్య సమస్యతోనైనా ప్రాణాలు కోల్పోయే అవకాశాలు పెరుగుతాయి. చాలామంది విటమిన్ ఇ వల్ల చర్మం మెరుపును సంతరించుకుంటుందని ఇంటర్నెట్, పుస్తకాల్లో చదివేసి వాటిని కొని వాడేస్తూ ఉంటారు. ఇలా విటమిన్ ఇ సప్లిమెంట్లను వాడటం వల్ల కూడా శరీరంలో టాక్సిసిటీ పెరుగుతుంది. రోజుకి 30 మైక్రో యూనిట్ల విటమిన్ ఇ అవసరం. ఇంతకు మించితే శరీరంలో టాక్సిసిటీ పెరుగుతుంది. విటమిన్ ఇని మాత్రగా కాకుండా నేరుగా చర్మం అప్లై చేయటం వల్ల టాక్సిసిటీకి అవకాశం ఉండదు పైగా మంచి ఫలితం కూడా ఉంటుంది.

కాల్షియం, విటమిన్‌డి: వీటిని సుప్రా థెరపెటిక్ డోసుల్లో తీసుకుంటే 'హైపోకాల్సీమియా' శరీరంలో కాల్షియం నిల్వలు పేరుకుపోయి ఆ పరిస్థితి వల్ల ఇతరత్రా ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చు. మరీ ముఖ్యంగా కాల్షియం నిల్వల వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడవచ్చు.

ఎసెన్షియల్ ఆయిల్స్: ప్రిమ్‌రోజ్ ఆయిల్ లాంటి ఎసెన్షియల్ ఆయిల్స్ వల్ల దీర్ఘకాల ప్రయోజనాలు ఉన్నట్టు ఎక్కడా నిరూపణ కాలేదు. ఎక్కువశాతం ఆయిల్స్ విటమిన్ ఇని కలిగి ఉంటాయి.

యాంటీ ఆక్సిడెంట్లు: యాంటీ ఆక్సిడెంట్లు తీసుకుంటే క్యాన్సర్ రిస్క్, హృద్రోగాలు తగ్గుతాయనే అపోహలు కూడా ఉన్నాయి. దీన్లో వాస్తవం ఉన్నా అది కొన్ని వర్గాల రోగులకే! తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి వీటి వల్ల కచ్చితంగా ప్రయోజనం ఉంటుంది. అలాగని ఆ తీవ్ర వ్యాధుల నుంచి రక్షణ పొందటం కోసం ప్రతి ఒక్కరూ యాంటీ ఆక్సిడెంట్ల మీద ఆధారపడితే లాభం కంటే నష్టమే ఎక్కువ!

ఐరన్ ట్యాబ్లెట్స్: కాస్త హుషారు తగ్గినా మందుల షాపుల్లో ఐరన్ టాబ్లెట్లు కొనేసి వేసుకుంటూ ఉంటారు. కానీ, రక్తం పరిమాణం తక్కువగా ఉందని వైద్యులు నిర్ణయించి, ఐరన్ సప్లిమెంట్స్ సూచిస్తే తప్ప వీటిని వాడకూడదు. కొందరికి ఐరన్ లోపం ఉంటుంది. కానీ శరీరంలో

ప్రొటీన్ పౌడర్స్ వాడవచ్చా?

ఎక్కువ శాతం మందికి అదనంగా ప్రొటీన్ పౌడర్ అవసరం ఉండదు. ఇవి కండరాలు పెంచే వ్యాయామం చేసే వాళ్లకి మాత్రమే అవసరం. అలాకాకుండా సాధారణ వ్యాయామం, కార్డియో ట్రైనింగ్ చేసేవాళ్లు ప్రొటీన్ పౌడర్లు వాడాల్సిన అవసరం ఉండదు. మరీ ముఖ్యంగా రెసిస్టెన్స్ ట్రైనింగ్ (వెయిట్ లిఫ్టింగ్) చేసేవాళ్లకి మాంసకృత్తులతో కూడిన ఆహారంతోపాటు అదనపు ప్రొటీన్లు అవసరమవుతాయి. ఇలాంటివాళ్లు డైటీషియన్ల సలహా మేరకు ప్రొటీన్ పౌడర్లను తీసుకోవాలి. అయితే ప్రొటీన్ పౌడర్ల వాడకం వల్ల అందే అదనపు ప్రయోజనాల గురించి శాస్త్రీయంగా నిరూపణ జరగలేదు. వీటిని దీర్ఘకాలం వాడటం వల్ల మూత్రపిండాల మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి వ్యాయామంలో భాగంగా ప్రొటీన్ పౌడర్లు తీసుకునేవారు క్రమం తప్పక వైద్యుల్ని కలుస్తూ క్రియాటినిన్, మూత్రపిండాల పనితీరును పరీక్షించుకుంటూ ఉండాలి.



ఎలా తినాలి? ఏం తినాలి?

సమతులాహారంతో శరీరానికి సరిపడా పోషకాలు అందుతాయి. మనలో ఎక్కువ మందికి సమతులాహారం అంటే అవగాహన ఉండదు. దాంతో ఆరోగ్యానికి మంచిదని తోచిన పదార్థాలన్నీ తినేస్తూ ఉంటారు. ఇలా చేయటం వల్ల అదనపు క్యాలరీలు, బ్యాడ్ కొలెస్ట్రాల్‌లు శరీరంలో పేరుకుపోయి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ కింది సమతులాహారం కోసం ఈ కింది ఆహార నియమాలు పాటించాలి.

ప్రొటీన్ల కోసం:
- పుట్టగొడుగులు
- గుడ్డులోని తెల్లసొన
- మాంసం
- ఆల్మండ్స్
- ఓట్స్
- చిక్కుళ్లు
- బఠాణీ
- డ్రై ఫ్రూట్స్

పీచు పదార్థం:
- బీర
- సొర
- ఆకు కూరలు
- క్యాబేజీ
- కీరా


విటమిన్ సి:
- క్యాబేజీ
- కాలీఫ్లవర్
- నిమ్మజాతి పండ్లు

విటమిన్ ఎ:
- పాలు
- పెరుగు
- ఇతర డైరీ ఉత్పత్తులు, క్యారెట్, బొప్పాయి


కాల్షియం:
- పొట్టు తీయని తృణధాన్యాలు
- నువ్వులు, మెంతులు


విటమిన్ ఇ:
- బాదం పప్పు











బీ కాంప్లెక్స్: బీ కాంప్లెక్స్‌లో బి1, బి2, బి6, బి12 అనే ఎన్నో రకాల వర్గాలున్నాయి. వైద్యులు సూచించే ఈ బీ కాంప్లెక్స్ పరిమాణం తీసుకునే ఆహారంలో పొందే బి విటమిన్లతో సమానంగా ఉంటుంది. అంటే ఆహారం ద్వారా 50% 'బి విటమిన్లు' అందితే, మిగతా 50 శాతాన్ని వైద్యులు మందులతో భర్తీ చేస్తారు. కొందరు ప్రత్యేకమైన వ్యక్తులకు నూటికి నూరు శాతం 'బి కాంప్లెక్స్'ను మందుల రూపంలోనే వైద్యులు సూచిస్తారు. బీ కాంప్లెక్స్ ఎంత వాడాలి? ఎప్పుడు వాడాలి? ఏ పరిస్థితుల్లో వాడాలనేది వైద్యులు నిర్ణయిస్తారు.

క్యాల్షియం, విటమిన్ డి: మనకు రోజు మొత్తానికి సరిపడా 'విటమిన్ డి'తో కలిసిన క్యాల్షియం పరిమాణం 600 నుంచి 800 మైక్రో యూనిట్లు. గర్భిణులు కూడా క్యాల్షియంను ఇదే పరిమాణంలో తీసుకోవాలి. అయితే రుతుక్రమం ఆగిపోయి మెనోపాజ్ దశకు చేరుకుని, 65 ఏళ్లు దాటిన మహిళలకు క్యాల్షియం మరింత ఎక్కువ అవసరం అవుతుంది. అయితే వీళ్లకు కూడా 800 నుంచి 1000కి మించి కాల్షియం ఇవ్వకూడదు. మెనోపాజ్ తర్వాత 1200 వరకూ అవసరం పడుతుంది. అయితే ఇంత క్యాల్షియం ఆహారం ద్వారా తీసుకోగలిగితే అదనంగా సప్లిమెంట్ల అవసరం ఉండదు.

'విటమిన్ డి' లోపం చాలా అరుదుగా తలెత్తుతుంది. ఈమధ్య కాలంలో ఎక్కువశాతం విటమిన్ డి కలిసిన వంట నూనెలే దొరుకుతున్నాయి. ఇలా ఫోర్టిఫైడ్ నూనెలు వాడటం వల్ల శరీరానికి సరిపడా 'విటమిన్ డి' అందుతుంది. అలాగే సూర్యరశ్మి ద్వారా కూడా మన చర్మంలో విటమిన్ డి తయారవుతుంది. కాబట్టి వైద్యులు సూచిస్తే తప్ప ఈ విటమిన్‌ను తీసుకోకూడదు. అయితే ఈమధ్య కాలంలో చాలామందిలో డి విటమిన్ లోపం కనిపిస్తోంది. ఇందుకు కారణం మారుతున్న మన జీవనశైలే! సూర్యోదయానికి ముందే ఆఫీసులకు వెళ్లిపోయి, సూర్యాస్తమయం తర్వాత బయటికి రావటం, ఎప్పుడూ కార్లలోనే తిరగటం, ఎక్కువగా నీడ పట్టునే ఉండిపోవటం, మతపరమైన ఆచారాలపరంగా శరీరాన్ని తల నుంచి పాదాల వరకూ ఎప్పుడూ కప్పి ఉంచటం...ఇలాంటి కారణాల వల్ల విటమిన్ డి లోపం తలెత్తవచ్చు. అయితే ఈ లోపం ఉన్నప్పుడు తగినంత సూర్యరశ్మి సోకేలా చూసుకుంటూ 'విటమిన్ డి' ఉన్న ఆహారం తీసుకుని లోపాన్ని పూడ్చుకోవాలిగానీ సప్లిమెంట్లు కొని వాడేయకూడదు.

ఐరన్ నిల్వలు తగినంత ఉంటాయి. అయినా వాటిని వారి శరీరం ఉపయోగించుకోలేక రక్తలేమికి గురయ్యే వీలున్నప్పుడు కూడా వైద్యులు ఐరన్ సప్లిమెంట్లను సూచిస్తారు. అలాగే ఐరన్ లోపం తీవ్రతలనుబట్టి దాన్ని భర్తీ చేసే మార్గాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొందరికి నోటి మాత్రలు సరిపోవచ్చు. కొందరికి రక్తంలో హిమోగ్లోబిన్ చాలా తక్కువగా ఉంటుంది. అలాంటప్పుడు రక్తం ఎక్కించవలసి రావొచ్చు. ఇక పిల్లలకు ఐరన్ టాబ్లెట్ల అవసరం ఉండదు. ఎక్కువ పరిమాణంలోని ఐరన్ పిల్లలకెంతో ప్రమాదం. వాళ్లు అల్మరాలో ఉంచిన ఐరన్ టాబ్లెట్లని పొరపాటున మింగేస్తే వాళ్ల శరీరంలో టాక్సిసిటీ పెరిగిపోయి, ప్రాణాలే పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ మాత్రలను పిల్లలకు దూరంగా ఉంచాలి. అలాగే ఆహార పదార్థాల్లోని ఐరన్ శరీరం శోషించుకోవాలంటే తగినంత విటమిన్ సి తినే ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. అలాగే విపరీతంగా యాంటాసిడ్లు వాడే వాళ్ల శరీరం కూడా ఐరన్‌లను శోషించుకోలేదు.

యాంటాసిడ్లు: అవసరం ఉన్నా లేకపోయినా తిన్న వెంటనే అరుగుదల కోసం యాంటాసిడ్లు వాడే అలవాటు చాలామందికి ఉంటుంది. ఇది చాలా ప్రమాదకరం. వీటిని వాడటం వల్ల జీర్ణాశయంలో తయారయ్యే యాసిడ్ క్రమం తప్పుతుంది. దాంతో జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి.

విరేచన మాత్రలు: ఏదో ఓ సందర్భంలో అందరం మలబద్ధకానికి గురవుతాం. ఇది సహజం. కానీ కొందరు ఒకసారి మలబద్ధకం తలెత్తగానే లాక్సేటివ్స్, మోషన్ టాబ్లెట్స్ అలవాటు చేసేసుకుంటారు. వీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సహజసిద్ధంగా మల విసర్జన జరిగే అవకాశాలు సన్నగిల్లుతాయి. పేగుల్లో కదలికలు తగ్గి మాత్ర వేసుకుంటేనే విరేచనం అయ్యే పరిస్థితి తలెత్తుతుంది.



డాక్టర్. శ్యామల జోస్యుల
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్,
కేర్ హాస్పిటల్స్, హై టెక్ సిటీ,
హైదరాబాద్.

ఆయుర్వేదం

మలినాలే వ్యాధి మూలం



పుట్టినప్పుడు ఏ శిశువైనా స్ఫటికంలా, కడిగిన ముత్యంలాగే ఉంటాడు. ఎప్పుడో అరుదుగా తప్ప పుట్టుకతోనే జబ్బులు ఉండడం జరగదు. అయితే అంతటి నిర్మలమైన శరీరాల్లో రోజులు గడిచే కొద్దీ ఒక్కొక్కటిగా హానికారకాలేవో పోగవుతాయి. జాగ్రత్తపడకపోతే శరీరాలు ఒక దశలో రోగాల పుట్టలైపోతాయి. దీనికంతా మధ్యలో వచ్చి చేరే మలినాలే కారణం. ఈ మలినాల్లో కొన్ని వాతావరణ కాలుష్యాల్లోంచి వచ్చి చేరితే, మరికొన్ని అతడు తీసుకునే ఆహార పానీయాల తాలూకు వ్యర్థాల్లోంచి వచ్చి చేరతాయి.

వాస్తవానికి శరీరంలో ప్రకృతి సహజంగానే మలినాలను తొలగించే ఒక బలమైన వ్యవస్థ ఉంది. అయితే, వివిధ కారణాల చేత ఒక్కోసారి ఈ వ్యవస్థ శరీరంలోని మలినాలను పూర్తిస్థాయిలో బయటికి పంపించలేకపోవచ్చు. అలాంటి స్థితిలోనే శరీరంలో విషపదార్థాలు పేరుకుపోతాయి. అందుకు దారితీసే తీవ్రమైన కారణాల విషయం అలా ఉంచితే అతి సాధారణ కారణాలు కూడా శరీరాన్ని విషతుల్యంగా మారుస్తాయి. ఉదాహరణకు శరీరానికి అవసరమైన పోషకాల పరిమాణం తగ్గినా, ఉండవలసిన దానికన్నా పెరిగినా అవి విషతుల్యంగా మారతాయి. ఈ విషపదార్థాలన్నీ ప్రాణాంతకం కాకపోవచ్చు. కానీ, జీవ క్రియలకు ఎంతో కొంత అవరోధంగా మారతాయి. శరీరాన్ని ఆ మేరకు రోగగ్రస్థంగా మారుస్తాయి.

స్థాయీ భేధాలు

ఆయుర్వేదం ప్రకారం అనారోగ్యానికి మూలాలు రెండు రకాలు. ఒకటి దోష స్థాయి, రెండవది వ్యాధి స్థాయి. సాధారణంగా దోషస్థాయిలో ఏ వ్యత్యాసాలూ బయటికి కనపడవు. అవి వ్యాధి రూపం ధరించిన పిదపే దాని లక్షణాలు కనిపిస్తాయి. అయితే, శరీరంలోని అపసవ్యతలను దోష స్థాయిలోనే కనిపెట్టే విధానం ఆయుర్వేదంలో ఉంది. ఈ శాస్త్రం ప్రకారం వాతం, పిత్తం, కఫం అంటూ దోషాలు మూడు రకాలు. ఈ మూడూ మానసిక స్థాయిలోనూ, శారీరక స్థాయిలోనూ ఉంటాయి. నిజానికి వాత, పిత్త, కఫాలు శరీర చలనశక్తికి తోడ్పడేవే. ఇవి కూడా ధాతువులే! అందుకే ఇవి శరీర నిర్మాణానికీ, దాని పనితనానికీ తోడ్పడతాయి. కాకపోతే వీటిది చంచల ప్రవృత్తి. మనం తీసుకునే ఆహారం, మన చర్యలు, ఆలోచనలను బట్టి ఇవి పూట పూటకూ మారుతూ ఉంటాయి. వీటిలో వచ్చే మార్పులూ, హెచ్చుతగ్గులే శరీరం వ్యాధిగ్రస్థం కావడానికి కారణమవుతాయి. అందుకే వీటిని దోషాలుగా గుర్తిస్తారు. ఏమైనా శరీరంలో పేరుకుపోయే అనవసర అంశాలు, వ్యర్థపదార్థాలే ఈ దోషాలకు ప్రధాన కారణం.

ఆమం... రోగాల హోమం

మనం తీసుకునే ఆహార పదార్థాలు సంపూర్ణంగా జీర్ణం కానప్పుడు శరీరంలో వ్యాధికారకమైన 'ఆమం' పుడుతుంది. దీన్నే 'ఆమవాతం' అని కూడా అంటారు. దీనివల్ల శరీరానికి హాని చేసే పలురకాల ఆమదోషాలు తలెత్తుతాయి. పైగా ఆహార పదార్థాలు సగం-సగంగా జీర్ణమైనప్పుడు వాటిల్లోని ఉపయుక్త అంశాలు, వ్యర్థ అంశాలు పూర్తి స్థాయిలో విడిపోవు. రెండూ కలగలిసిపోయి శరీరాన్ని విషతుల్యం చేస్తాయి. పైగా, జీర్ణం కాని ఆహార పదార్థాలు శక్తిగానూ మారలేవు. పూర్తిగా విసర్జించనూబడవు. ఇలా విసర్జితం కానివన్నీ శరీరంలో దీర్ఘకాలికంగా ఉండిపోతే, పలు రకాల వ్యాధులు మొదలవుతాయి. దీనికి తోడు ఆమానికి శరీరంలోని స్రోతస్సుల్ని మూసివేసే లక్షణం ఉంది. ఈ క్రమంలో రక్తనాళాలు, సిరలు, దమనులే కాకుండా కణానికీ కణానికీ మధ్య ఉండే అతి సూక్ష్మ దారులు కూడా మూసుకుపోతాయి. దీనివల్ల జీవక్రియలు కుంటుపడటంతో పాటు, జీవశక్తి అడుగంటిపోతుంది.

నిషిద్ధాహారాలు...

- మాంసం లేదా చేపల్లో మినప పప్పుగానీ, పాలుగానీ, తేనెగానీ కలపకూడదు.
- ఆకు కూరలు తిన్న తరువాత పాలు తాగకూడదు. కోడి మాంసం, పెరుగు కలిపి తీసుకోకూడదు. అతి స్వల్ప వ్యవధిలో కూడా తీసుకోకూడదు.
- పాయసం, మద్యం, అన్నం కలిపి తీసుకోకూడదు.
- తేనె, నెయ్యి, కొవ్వు పదార్థాలు, నీళ్లు, నూనె- వీటిలో ఏ రెండుగానీ, అన్నీ గానీ, సమాన నిష్పత్తిలో తీసుకోకూడదు. పైగా ఇవి తీసుకున్న వెంటనే నీరు తాగకూడదు.
- పెరుగు, ముల్లంగి, ఎండుమాంసం, ఎండు చేపలు, పంది మాంసం, గొర్రె మాంసం, చేపలు రోజూ తీసుకోకూడదు. అలాగే మినపపప్పు కూడా అలా నిరంతరంగా తీసుకోకూడదు.

విషకారకాలు:

నిర్ణీతకాలంలో మలం విడుదల కాకుండా శరీరంలోనే ఉండిపోతే శరీరం కలుషితమైపోతుంది. అన్నిటికన్నా మించి రక్తం మలినమవుతుంది. వ్యర్థపదార్థాలు నిలిచిపోతే అవి శరీరం లోని చలన శక్తికి అడ్డుపడుతూ ఉంటాయి. శరీరంలో వివిధ దశల్లో దేహక్రియలు నిరంతరం సాగుతూ ఉంటాయి. విషపదార్థాలు ఏ ఒక్క దశను ఆటంకపరిచినా మిగతా దశల మీద కూడా ఆ దుష్ప్రభావం పడుతుంది.

మిశ్రమాలతోనూ సమస్యే

కొన్ని రకాల ఆహార పదార్థాల మధ్య పొంతన కుదరదు. అలాంటి పొంతన కుదరని వాటినే 'విరుద్ధ ఆహార పదార్థాలు' అంటారు. అలాంటి విరుద్ధ ఆహార పదార్థాలను కలిపి గానీ, వెనువెంటనే గానీ తీసుకోకూడదు. విరుద్ధ ఆహారాలు శరీరంలో దోషాలు నింపడమే కాదు. దోషాలను బయటికి వెళ్లిపోకుండా లోపలే బంధిస్తాయి. అవన్నీ చివరికి విషపదార్థాలుగా మారతాయి.

విషానికి విరుగుడు

శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాల వల్ల ఒక్కో ధాతువులో ఒక్కో రకం దోషం పెరుగుతుంది. ఈ స్థితిలో శరీరాన్ని విషతుల్యం చేసే ఆ కారణాలను తొలగించడమే నిజమైన చికిత్స అవుతుంది. అందుకు శరీరాన్ని శుద్ధి చేసే 'శోధన చికిత్సలు' చేయాలి. దీనికి ఐదు రకాల ప్రక్రియలతో ఉండే పంచకర్మ చికిత్స ఉత్తమ మార్గం. అవసరాన్ని బట్టి పంచకర్మల్లోని ఐదు చికిత్సల్లో ఏదో ఒకటిగానీ, అన్నీగానీ చెయ్యాలి. వీటికి తోడు జలమర్దనం, స్నేహనం (శరీరానికి నూనె పట్టించడం), స్వేదనం (ఆవిరి స్నానం) కూడా అవసరమే. వీటికి తోడు ప్రత్యేకమైన కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవలసి ఉంటుంది. శరీర స్థితిగతిని శరీర ధర్మాన్ని అనుసరించి ఇచ్చే ఈ ఆహార పదార్థాలతో శరీరంలో మూతబడిన స్రోతస్సులన్నీ తెరుచుకుంటాయి. దాంతో శరీరమూ, మనస్సూ కొత్త శక్తినీ, కొత్త చైతన్యాన్నీ పుంజుకుంటాయి.

డాక్టర్ డి. విఠల్ రావు
రిటైర్ ప్రొఫెసర్, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల
హైదరాబాద్



డైలీ సుడోకు - 147

	2		4		8			
6		7		9				2
		2	8				9	
	5					9		3
		6	8		3	5		
1	4						2	
	6			2	7			
7		6		8				5
		2		5			7	

ఎలా పూరించాలి?
ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి. నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ బ్లాక్‌లోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 146 సమాధానం

నివేదన

ఆత్మస్థితిలోనే ఆనందం

పూర్వం ఒక పట్టణంలో ఒక శ్రీమంతుడు ఉండేవాడు. అతడికి దైవ భక్తి ఎక్కువ. సాధుపురుషులు ఎవరైనా కనిపిస్తే ఇంటికి తీసుకువెళ్లి విశేషమైన మర్యాదలు చేస్తుండేవాడు. ఒకసారి ఓ సాధువును ఇంటికి తీసుకొచ్చాడు శ్రీమంతుడు. తన స్థాయికి తగినట్టుగా అతిథి సత్కారాలు చేశాడు. భోజనం కోసం రకరకాలైన పిండి వంటలు చేయించాడు. ప్రత్యేకంగా పాయసం కూడా చేయించాడు.



సాధువుతో పాటు శ్రీమంతుడు కూడా భోజనానికి కూర్చున్నాడు. సాధువుతో.. "స్వామి! మా ఇంట్లో పాయసం అమృత సమానంగా ఉంటుంది. తప్పకుండా తీసుకోండి" అని అన్నాడు. సాధువు చిరునవ్వు నవ్వి "అలాగే" అన్నాడు. రెండు గ్లాసుల్లో పాయసం తెచ్చి అక్కడుంచారు. శ్రీమంతుడు ఒక గ్లాసు తీసుకుని అపురూపంగా పాయసం తాగాడు! ఇది గమనించిన సాధువు.. "పాయసం ఎలా ఉంది నాయనా!" అన్నాడు. 'అమృత సమానంగా ఉంది' అన్నాడు శ్రీమంతుడు. వంటవాడు రెండో దఫా పాయసం తెచ్చాడు. శ్రీమంతుడు మళ్లీ తాగాడు. "ఎలా ఉంది?" అన్నాడు సాధువు. "ఫర్వాలేదు" అన్నాడు. సాధువు వంటవాడిని పిలిచి మరో గ్లాసు పాయసం తేవాల్సిందిగా చెప్పాడు. శ్రీమంతుడితో దానిని కూడా తాగమన్నాడు. అయిష్టంగానే తాగాడు. "ఎలా ఉంది?" అన్నాడు. "విష తుల్యంగా" ఉందన్నాడు శ్రీమంతుడు. భోజనాలు పూర్తయిన తర్వాత సాధువు, శ్రీమంతుడు బయట వరండాలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు.

సాధువు ఆత్మ, జ్ఞానం తదితర అంశాల గురించి అనేక విషయాలు చెబుతున్నాడు. శ్రీమంతుడు మాత్రం ఇందాక చేసిన భోజనంలోని వంటకాల విశేషాల గురించి చెప్పసాగాడు. సాధువు కల్పించుకొని.. "నాయనా! మొదట పాయసం తాగినపుడు అమృతంగా ఉందన్నావు. రెండోసారి ఫర్వాలేదన్నావు. మూడోసారి విషంగా ఉందన్నావు! పాయసం అమృతం అయితే.. ఎన్నిసార్లు తాగినా అమృతంగానే ఉండాలి కదా! కాబట్టి విషయం బాహ్య వస్తువులో లేదు. మన భావనే వస్తువులలో సుఖాన్ని కల్పిస్తోంది. ప్రాపంచిక విషయాలు ఒకసారి గొప్పగా కనిపిస్తాయి, మరోసారి వృథాగా అనిపిస్తాయి. జీవుడు బాహ్య వస్తువులపై విరాగం కలిగి ఉండి.. ఆత్మస్థితిలో ఆనందాన్ని కలిగి ఉండాలి" అని బోధించాడు.

నయా హవా

కాదేదీ ఆర్ట్‌కు అనర్హం!

కాన్వాసును చూసే చూపు ఉండాలేకానీ నిర్జీవమైన వస్తువులకూ ప్రాణం పోయవచ్చు. జపాన్‌లో ప్రస్తుతం కాఫీ కప్ ఆర్ట్ ట్రెండ్ నడుస్తోంది. ఆస్ట్రేలియాకి చెందిన ఆడ్రియన్ హోగన్ జపాన్‌లో ఉంటున్నాడు. ఓసారి ఉబుసుపోక తెల్లటి కాఫీ గ్లాసులపై ఏదైనా ఆర్ట్ వేయాలని ఆలోచించాడు. ఆలోచించే తడవుగా రంగంలోకి దిగాడు. ఆ రోజు మధ్యాహ్నం వర్షం బాగా కురుస్తోంది. హోగన్ ఖాళీగా ఉండలేక కాఫీకప్‌లపై తాపీగా ఆర్ట్ వేశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశాడు. అతని ప్రతిభకు నెటిజన్లు ఫ్లాట్ అయ్యారు. కాఫీ కప్పును పెద్ద కాఫీ కప్పుగా.. అంటే దాని విలువను పెంచటానికి ఆర్టిస్ట్ ఇలా ఆర్ట్ వేశాడు. ఏదేమైనా జపనీస్ రెగ్యులర్ జీవితంలో కాఫీ కప్‌లపై ఉండే ఆర్ట్ రోజు రోజుకూ ఒకింత స్పీడ్‌తో దూసుకుపోతోంది. ఓ ట్రెండ్‌గా మారింది.



స్మార్ట్‌హోమ్

ఇలా చేస్తే నో టెన్షన్!

ఆఫీసుకు వెళ్లే హడావిడిలో ఇంటికి సంబంధించి చాలా విషయాలు మనం మర్చిపోతుంటాం. ముఖ్యంగా ఇంట్లో లైట్లు ఆపామా... లేదా... గ్యాస్ బటన్ ఆన్ చేసి వచ్చేసేమా.... గీజర్ ఆన్‌లోనే ఉంచామా...ఇంటికి తాళం సరిగ్గా వేశామా...పిల్లలు హోంవర్కు చేసుకుంటున్నారా లేకపోతే టివి చూస్తూ కూర్చున్నారా లాంటి బోలెడు అనుమానాలు ఆఫీసులో పనిచేసుకునేటప్పుడు చాలామందికి వస్తుంటాయి. స్మార్ట్ హోమ్‌తో ఈ అనుమానాలను ఇట్టే పోగొట్టుకోవచ్చు.



స్మార్ట్‌ఫోను లేదా టాబ్లెట్ సహాయంతో మన అనుమానాలకు క్షణాల్లో సమాధానాలను తెలుసుకోవచ్చు. మనం చేయాల్సిందల్లా ఇంట్లోని వస్తువులను, డివైజ్‌లను వాటికి అనుసంధానం చేయడమే. ఇంట్లో ఎలక్ట్రిసిటీతో పనిచేసే ఏ డివైజ్‌నైనా సరే హోమ్ నెట్‌వర్కులో పెట్టాలి. అవి మీ కమాండ్‌లో ఉండాలి. మీరు కమాండ్స్‌ను వాయిస్ ద్వారా, రిమోట్ కంట్రోల్ ద్వారా లేదా స్మార్ట్‌ఫోను, టాబ్లెట్‌ల ద్వారా ఇస్తే వెంటనే హోమ్ రెస్పాండ్ అవుతుంది. లైటింగ్, హోమ్ సెక్యూరిటీ, హోమ్ థియేటర్‌లకు సంబంధించిన అప్లికేషన్లు ఎక్కువగా ఉన్నాయి. స్మార్ట్ హోమ్స్, హోమ్ ఆటోమేషన్‌లకు నేడు ఎందరో ప్రాధాన్యం ఇస్తున్నారు. స్మార్ట్ హోమ్ టెక్నాలజీ విప్లవంతో ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ నుంచి ఫర్నేస్ వరకూ అన్ని ఎలక్ట్రానిక్ సాధనాలు మనం ఎక్కడ ఉన్నా మన కంట్రోల్‌లోకి వచ్చేశాయి. వీటి సహాయంతో ప్రజలు టెక్ స్మార్ట్ అయి ఒత్తిడి లేకుండా పనుల్లో నిమగ్నమవుతున్నారు. స్మార్ట్ హోమ్.. హ్యాపీ హోమ్ అంటున్నారు.

హెల్దీడైట్

ఆరోగ్య పండు..



- సిగరెట్లు తదితర పొగాకు ఉత్పత్తుల అలవాట్లను మానుకోవాలనుకునే వారికి అరటి పండు ఎంతో సహకరిస్తుంది. అరటి పండులో బి-6, బి-12 విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం, సహజంగానే ఉంటాయి. ఇవి సిగరెట్ మానుకున్నప్పుడు వచ్చే నికోటిన్ విత్‌డ్రాయల్ లక్షణాల నియంత్రణకు తోడ్పడతాయి.
- అరటి పండులో గ్లూకోజ్ నిలువలు చాలా ఎక్కువ కాబట్టి మధుమేహం ఉన్నవారు వాటిని తినకూడదని చెప్పడం పరిపాటి. అయితే అరటికాయలో చక్కెర, ఉప్పు నిలువలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల మధుమేహం ఉన్నవారు కూడా అరటికాయ కూర తినవచ్చు.
- అరటి పండులో అత్యధిక శాతం పొటాషియం ఉంటుంది. అందుకే తిన్న వెంటనే శక్తి వస్తుంది. అందుకే బాగా నీరసించిన వారికి సత్వరమే శక్తి రావాలంటే అరటిపండు తినాలి. అరటి పండులోని పొటాషియం హానికరం కాదు కూడా. నీళ్లలో ఉండే పొటాషియం హృద్రోగులకు కొంత నష్టం కలిగిస్తుంది. అయితే అరటి పండులోని పొటాషియంతో ఆ నష్టం ఉండదు.

కౌన్సెలింగ్


కిడ్నీ ఫెయిల్యూర్ ప్రాణాంతకమా?

మా నాన్నగారి వయసు 64. కొద్ది రోజుల క్రితం మూత్ర విసర్జన సాఫీగా జరగని కారణంగా డాక్టర్ వద్దకు తీసుకెళ్లాం. వెంటనే కొన్ని పరీక్షలు చేయించి 'ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్' అని చెప్పారు. అప్పటిదాకా ఎంతో ఆరోగ్యంగా ఉన్న వ్యక్తికి ఈ సమస్య రావడమేమిటో మాకేమీ అర్థం కావడం లేదు. ఎన్నిసార్లు అడిగినా తగ్గిపోతుందిలే అనడం తప్ప, డాక్టర్లు మరే వివరాలూ చెప్పడం లేదు. మేము చాలా ఆందోళనతో ఉన్నాం. మా నాన్నకు ప్రమాదం ఏమీ లేదు కదా!

- పి. కరుణాకర్, తెనాలి

శరీరంలోని అంతర్గత కారణాల వల్ల కాకుండా బాహ్య కారణాల వల్ల మూత్రపిండాలు పనిచేయకపోవడాన్ని ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ అంటారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినప్పుడు, అగ్ని ప్రమాదాల్లో శరీరం బాగా కాలిపోయినప్పుడు, వెన్నెముక లేదా వెన్నుపాము భాగంలో బలమైన దెబ్బలు తగిలినప్పుడు, మరేదైనా ప్రమాద జరిగినప్పుడు మూత్రపిండాలు తాత్కాలికంగా పనిచేయలేని స్థితి ఏర్పడుతుంది.

- ప్రమాదాల్లో బాగా రక్తస్రావం జరిగినప్పుడు సహజంగానే కిడ్నీలకు సరిగా రక్తం చేరదు. దీనివల్ల రక్తప్రవాహపు ఒత్తిడి తగ్గిపోతుంది. ఇది మూత్రవిసర్జన ప్రక్రియను కుంటుపరు స్తుంది.
- గుండెపోటు, క్లోమగ్రంథి, దెబ్బ తిన్నప్పుడు కూడా కిడ్నీలకు సరిపడా రక్తం అందక ఈ ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ జరగవచ్చు.
- మూత్ర పిండాల్లో రాళ్లు, కణుతులు ఏర్పడినప్పుడు కూడా అవి రక్తప్రసారానికి అడ్డుపడి, ఈ ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ సమస్య రావచ్చు.



ఈ స్థితిలో, విసర్జించే మూత్ర పరిమాణం బాగా తగ్గిపోవడం, లేదా మూత్రం పూర్తిగానే ఆగిపోవడం జరగవచ్చు. కొందరిలో మత్తుగా ఉండడం, కడుపులో తిప్పడం, వాంతులు కావడం, శ్వాస సరిగా ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కారణాలు ఏమైనా కావచ్చు. మూత్రం అతి తక్కువ పరిమాణంలో అంటే రోజుకు 400 మి.లీటర్ల కన్నా తక్కువగా మూత్ర విసర్జన జరగడాన్ని 'అలిగూరియా' అంటారు. రక్తంలోని వ్యర్థపదార్థాలను కిడ్నీలు సరిగా వడబోయలేకపోయినప్పుడు ఈ స్థితి వస్తుంది. ఒక్కోసారి మూత్ర విసర్జన పూర్తిగానే ఆగిపోతుంది. ఈ పరిణామాన్ని 'అనూరియా' అంటారు. ఏ మాత్రం వడబోత జరగక వ్యర్థాలన్నీ రక్తంలోనే నిలిచిపోయినప్పుడు ఈ స్థితి ఏర్పడుతుంది. అయితే కొంత మందిలో అన్నీ బాగానే ఉంటాయి. అంటే మూత్ర విసర్జన కూడా సక్రమంగానే జరుగుతుంది. అయితే మూత్రంలో వ్యర్థపదార్థాలు మాత్రం ఉండవు. దీనికి కిడ్నీలోని వడబోత వ్యవస్థ బొత్తిగా పనిచేయకపోవడమే కారణం,. ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే సరైన వైద్య చికిత్సలు అందితే సమస్యలు తొలగిపోయి కిడ్నీలు మళ్లీ చక్కగా పనిచేయగలుగుతాయి. అందులో ఏ రకమైన సందేహం లేదు. ఆందోళన పడాల్సిన అవసరం ఏమాత్రం లేదు.

- డాక్టర్ జి. నారాయణమూర్తి, కన్సల్టెంట్ యూరాలజిస్ట్

ఏ కష్టం వచ్చినా ఆయనకు చెబుతా!

– నితిన్



"నాకు త్రివిక్రమ్‌గారు గురువులాంటివారు. ఏ కష్టం వచ్చినా ఆయనకు చెప్పి సలహా తీసుకుంటాను. పవన్‌కల్యాణ్‌గారంటే చచ్చిపోయేంత అభిమానం. ఆ ఇష్టంతోనే నా ప్రతి సినిమాలోనూ ఆయన ప్రెజెన్స్ ఏదో ఒక విధంగా ఉండేలా చూసుకుంటాను" అని అన్నారు నితిన్. ఆయన హీరోగా నటించిన 'లై' ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా నితిన్ సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. " అమెరికా అమ్మాయిని చేసుకుని అక్కడ సెటిలైపోవాలనుకునే ఆవారా పిల్లాడి కథ ఇది. పొడవు గడ్డం, పొట్టి గడ్డం, క్లీన్ షేవ్... మూడు గెటప్పుల్లో కనిపిస్తాను. దర్శకుడు హను రాఘవపూడి చెప్పిన కథను చెప్పినట్టు తెరకెక్కించాడు. తన గత చిత్రాలకు ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉంటుంది. 'అ ఆ' తర్వాత నా మార్కెట్ పెరిగింది. దానికి తగ్గట్టు 14 రీల్స్ నిర్మాతలు కూడా కథను నమ్మి ఖర్చు పెట్టారు. మణిశర్మగారి సంగీతం సినిమాకు హైలైట్ అవుతుంది. ఇప్పటికే పాటలకు మంచి స్పందన వస్తోంది. రీరికార్డింగ్ కూడా అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. సినిమా మొత్తం ఒకరకమైన హాలీవుడ్ కలర్‌లో కనిపిస్తుంది. 'శ్రీ ఆంజనేయం'లో అర్జున్‌గారితో తొలిసారి నటించాను. అప్పుడు సీనియర్ కదా అని ఆయన్ని చూసి భయపడుతుంటే పిలిచి చాలా సన్నిహితంగా మాట్లాడేవారు. ఇప్పటికీ ఆయన అలాగే ఉన్నారు. ఫ్లైట్ వింగ్ మీద క్లైమాక్స్ యాక్షన్ చేశాం. రోప్ కూడా కట్టుకోకుండా డెడికేషన్‌తో పనిచేశారు. ఆయన ఫిట్‌నెస్‌ని చూస్తే ఎవరికైనా ఈర్ష్య కలుగుతుంది. 'లై' క్లైమాక్స్ చాలా కొత్తగా ఉంటుంది. దాదాపు 100 ఫైట్ల మధ్య యాక్షన్ ఎపిసోడ్ చేశాం. ఒక్కరోజుకే రూ.25లక్షలు ఖర్చయ్యేది. అలాగే వెగాస్ కేసినోలో చేసిన ఎపిసోడ్స్ కూడా కాస్ట్లీ ఎపిసోడ్స్. మేఘా ఆకాష్ పాత్ర చాలా బావుంటుంది. ఇందులో మా ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు క్యూట్‌గా అనిపిస్తాయి. మా పాత్రలు రెండూ నేరుగా ఏదీ మాట్లాడుకోవు. సినిమా మొదటి నుంచీ చివరి వరకు ప్రతి ఒక్క సంభాషణా వ్యతిరేకార్థంలోనే ఉంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఒక రకమైన మంచి ఎమోషన్‌తో బయటికి వస్తారు" అని చెప్పారు.

'లవ'తో పరిచయం..



ఎన్టీఆర్

ఇన్ షర్ట్ చేసుకుని, పద్ధతిగా తల దువ్వుకుని, చిరునవ్వులు చిందిస్తూ ఉన్న ఫొటోని 'లవ' పాత్రధారిగా పరిచయం చేశారు ఎన్టీఆర్. ఆయన మూడు పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జై లవకుశ'. ఇప్పటికే 'జై' పాత్ర పరిచయం పూర్తయింది. తాజాగా రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని 'లవ' పాత్ర పోస్టర్‌ను ఎన్టీఆర్, నందమూరి కల్యాణ్‌రామ్ విడుదల చేశారు. నందమూరి తారక రామారావు ఆర్ట్స్ పతాకంపై కల్యాణ్‌రామ్ నిర్మిస్తున్న చిత్రం 'జై లవకుశ'. కె.ఎస్.రవీంద్ర (బాబి) దర్శకత్వం వహిస్తున్నారు. జై, లవ, కుశ అనే మూడు పాత్రల్లో ఎన్టీఆర్ నటిస్తున్నారు. ప్రస్తుతం పుణెలో షూటింగ్ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "ఈ నెల 10తో టాకీ పూర్తవుతుంది. ఆ తర్వాత పుణెలోనే రెండు రోజులు ఎన్టీఆర్, రాశీ ఖన్నా కాంబినేషన్‌లో ఓ పాటను చిత్రీకరిస్తాం. హైదరాబాద్‌లో సెట్లో ఐటమ్ సాంగ్‌ను తెరకెక్కించాలి" అని తెలిపారు. నివేదా థామస్ మరో నాయికగా నటిస్తోన్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.





అక్టోబరు ఫస్ట్...

నిఖిల్ పెళ్లి

'హ్యాపీడేస్'లో 'మా అయ్య ఎమ్మెల్యే తెలుసా..' అనే డైలాగుతో తెలుగు ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయిన హీరో నిఖిల్. ఆ తర్వాత తనదైన శైలిలో వైవిధ్యమైన చిత్రాలను ఎంపిక చేసుకుని పలు విజయాలను చవిచూశారు. ఇప్పుడు ఈ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్‌కి పెళ్లి కుదిరింది. 'ఇంట్లో పెద్దలు అమ్మాయిని చూడటం మొదలుపెట్టారు' అని ఆయన ఇంతకు ముందే చెప్పారు. నిఖిల్ తల్లిదండ్రులు తమ బంధువుల అమ్మాయితోనే పెళ్లి ఫిక్స్ చేశారు. ఆ ప్రకారం తేజస్వినితో ఈ నెల 24న నిఖిల్‌కు నిశ్చితార్థం, అక్టోబర్ 1న వివాహం జరుగనున్నాయి. ఈ నెల 20 నుంచి అందరికీ ఆహ్వానించే పనుల్లో బిజీ కానున్నారు నిఖిల్.

సన్నిహితులను బాధపెట్టాను.. సారీ!



"యాక్షన్ సీక్వెన్స్ చేసే ప్రతిసారీ మేజర్ జాగ్రత్తలు తీసుకునే నేను, ఈ మధ్య జరిగిన 'ఆచారి అమెరికా యాత్ర' షూటింగ్‌లో ఒక చిన్న ప్రికాషన్ తీసుకోలేదు. దానివల్ల సన్నిహితులను బాధపెట్టాను. నా కోసం కన్నీరుపెట్టుకున్న వారందరికీ క్షమాపణలు చెబుతున్నాను" అని విష్ణు మంచు అన్నారు. మలేసియాలో 'ఆచారి ఆమెరికా యాత్ర' షూటింగ్‌లో ఇటీవల మంచు విష్ణు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం తాను బాగానే ఉన్నానని చెబుతూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "వారం రోజుల ముందు మలేసియాలో 'ఆచారి అమెరికా యాత్ర' షూటింగ్‌లో యాక్సిడెంట్‌లో గాయపడ్డాను. అమ్మకి, నాన్నకి, విన్నికి, అక్కకి, తమ్ముడికి సారీ చెప్పాలి. నేను తీసుకోని ఓ చిన్న ప్రికాషన్ వల్ల వాళ్లందరినీ చాలా బాధపెట్టాల్సి వచ్చింది. మా వాళ్లతో పాటు ఎంతోమంది స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు చాలా బాధపడ్డారు. వారందరికీ క్షమాపణ చెబుతున్నాను. యాక్షన్ ఎపిసోడ్ చేసే ప్రతిసారీ నేను మేజర్ ప్రికాషన్స్ తీసుకుంటాను. నా తీరును చూసి చాలా మంది నవ్వుకునేవారు. కానీ ఈ సారి ప్రమాదం జరిగింది. నిజానికి ఈ ప్రమాదంలో నా తప్పు ఏమీ లేదు. ఆ వీడియో రెండు, మూడు రోజుల్లో విడుదల చేస్తా. ప్రస్తుతం ఇలా అందరి ముందు మాట్లాడుతున్నానంటే అది కేవలం దేవుడు ఇచ్చిన వరం. మా అమ్మా నాన్న ఆశీర్వాదాల వల్లే పెద్దగా దెబ్బలు లేకుండా బయటపడ్డాను. 'ఇప్పుడు ఎలా ఉన్నారు?' అని సోషల్ మీడియా ద్వారా, ఫోన్ల ద్వారా చాలా మంది అడుగుతున్నారు. ఇప్పుడు బాగానే ఉన్నాను. మోకాలికి కొంచెం దెబ్బ తగిలింది. ముంజేయి, చేయి, భుజం బాగా లోతుగా రాసుకుపోయాయి. భుజం కాస్త పక్కకు జరిగిందని డాక్టర్లు అన్నారు. విశ్రాంతి అవసరమని చెప్పారు. భుజానికి సర్జరీ అవసరమా లేదా అనేది తర్వాత చెబుతామని అన్నారు. వరుసగా నితిన్ ఫోన్లు చేస్తూనే ఉన్నాడు. కల్యాణ్‌రామ్ అయితే 'పిల్లాలున్నారు.. ఎంత జాగ్రత్తగా ఉండాలి' అని తిడుతూ మెసేజ్ పెట్టాడు. నేను పరిశ్రమకు పరిచయమైన 15 ఏళ్లలో ఎంతో మంది ఆదరాభిమానాలు అందుకున్నాను. ఎల్లప్పుడూ అందరి ఆశీస్సులు నాకు ఉంటాయని కోరుకుంటున్నాను" అని చెప్పారు.



సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▼ 51.74	▼ 9.00	▼ 170	▼ 890	▼	▼
32273.67	10057.40	28,520	37,060	63.80	51.61
		10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	కిలో (రూపాయల్లో)		బ్యారెల్ ధర (డాలర్లలో..)



లగ్జరీ కార్లపై జీఎస్‌టీ వడ్డన

మరో 10 శాతం పెరగనున్న జీఎస్‌టీ సెస్సు.. ఆటోమొబైల్ కంపెనీల్లో తీవ్ర అసంతృప్తి

న్యూఢిల్లీ: ఎస్‌యువిలు, మధ్య, భారీ శ్రేణి లగ్జరీ కార్లు కొనే వారికి కేంద్ర ప్రభుత్వం పెద్ద షాకిచ్చింది. వీటిపై ప్రస్తుతం 15 శాతంగా ఉన్న సెస్సును 25 శాతానికి పెంచేసింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే వస్తువులు, విలాస వస్తువులపై ఈ ప్రత్యేక సెస్సు విధించేందుకు జీఎస్‌టీ చట్టం వీలు కల్పిస్తోంది. ఈ సెస్సు ద్వారా వసూలు చేసే మొత్తాన్ని జీఎస్ టీతో ఆదాయం నష్టపోయే రాష్ట్రాలకు నష్ట పరిహారంగా చెల్లిస్తారు. జీఎస్‌టీ అమల్లోకి రాక ముందు ఎస్‌యువిలు, లగ్జరీ కార్లపై, స్థానిక పన్నులతో కలిసి 52 నుంచి 54.72 శాతం వరకు పన్నుల భారం ఉండేది. జీఎస్‌టీ తర్వాత 28 శాతం జీఎస్‌టీ రేటుతో పాటు 15 శాతం సెస్సుతో అది 43 శాతానికి తగ్గింది. దాంతో ఆటోమొబైల్ కంపెనీలు ఎస్‌యువిలపై మోడల్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ధరలు తగ్గించాయి. లగ్జరీ కార్ల కంపెనీలైతే తమ వాహనాల ధర రూ.10 లక్షల వరకు తగ్గించాయి. దీంతో దేశంలో ఈ సంవత్సరం అమ్మకాలకు ఢోకా ఉండదని కంపెనీలు కొండంత ఆశలు పెట్టుకున్నాయి. వారి ఆశలు వమ్ము చేస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ సెస్సు భారాన్ని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచేసింది. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లోనే ప్రభుత్వం ఇందుకు సంబంధించిన బిల్లును సభల ఆమోదం కోసం పెట్టనుంది.

కంపెనీల ఆగ్రహం

ఎస్‌యువిలు, లగ్జరీ కార్లపై సెస్సు పెంచేయడంపై టయోటా కిర్లోస్కర్ మోటార్, మెర్సిడెజ్ బెంజ్, ఆడి, బిఎండబ్ల్యు వంటి ఆటోమొబైల్ కంపెనీలు భగ్గుమన్నాయి. నిలకడలేని ఇలాంటి నిర్ణయాల వలన దేశంలో ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధి దెబ్బతింటుందని హెచ్చరించాయి. స్వేచ్ఛా మార్కెట్ సూత్రాలకు ఈ నిర్ణయం విరుద్ధమని తెలిపాయి. దీని వల్ల భారత్‌లో తమ దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలు దెబ్బతిని ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' ప్రణాళికా దెబ్బతింటుందని పేర్కొన్నాయి. భారత పరపతి రేటింగ్‌నూ ఈ చర్య దెబ్బ తీసే ప్రమాదముందని తెలిపాయి. 'ప్రభుత్వ చర్య ఆటోమొబైల్ రంగాన్ని దెబ్బతీసేలా ఉంది. ఇది దేశ ఆర్థిక వృద్ధికి ఏ మాత్రం దోహదం చేయదు' అని టయోటా కిర్లోస్కర్ మోటార్ వైస్ చైర్మన్ శేఖర్ విశ్వనాథన్ అన్నారు. పెద్ద ఎస్‌యువిలు, లగ్జరీ కార్లపైనే సెస్సు పెంచడం చూస్తుంటే కొన్ని కంపెనీలకు మాత్రమే మేలు చేసేలా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై మెర్సిడెజ్ బెంజ్ ఇండియా కంపెనీ ఎండి, సిఇఒ రోలాండ్ ఫోల్జర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ చర్య మమ్మల్ని చాలా నిరాశపరిచింది. దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల విస్తరణకు ఇదో పెద్ద అడ్డంకిగా మారుతుంది' అన్నారు. జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయంతో భారత్‌లో తమ విస్తరణ ప్రణాళికలను పునఃసమీక్షించుకోవాల్సి వస్తోందని ఆడి ఇండియా చీఫ్ రహీల్ అన్సారీ అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

మాకూ బాధగానే ఉంది : ఎగుమతిదారులు

జీఎస్‌టీపై ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతిదారులూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ పన్నుల కింద రావలసిన రీఫండ్స్ సెప్టెంబర్ లేదా అక్టోబర్ వరకు విడుదలయ్యే సూచనలు లేకపోడంతో షిప్పింగ్ కంపెనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఇంజినీరిగ్ ఎగుమతుల సంస్థ ఇఇపిసి ఇండియా పేర్కొంది. డొమెస్టిక్ టారిఫ్ ప్రాంతాల నుంచి ఎగుమతి ఆధారిత కంపెనీలకు చేసే వస్తువులనూ జీఎస్‌టీ కింద ఎగుమతి వస్తువులుగా (డీమ్డ్ ఎక్స్‌పోర్ట్స్) పరిగణించడం లేదని ఇఇపిసి ఇండియా చైర్మన్ టిఎస్. భాసిన్ ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఎగుమతి యూనిట్లకు సరఫరా చేసేందుకు తాము దిగుమతి చేసుకునే వస్తువులకూ పన్నులు చెల్లించాల్సి వస్తోందన్నారు.



ఇడ్లీ పిండి, కంప్యూటర్ మానిటర్లపై తగ్గనున్న రేటు !

ఇడ్లీ, దోశ పిండి, కంప్యూటర్ మానిటర్లు, గ్యాస్ లైటర్ల వంటి దాదాపు 24 వస్తువులపై పన్ను భారం తగ్గించాలని జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయించినట్టు సమాచారం. చింతపండు, వేయించిన పప్పులపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్‌టీని ఐదు శాతానికి తగ్గిస్తారని భావిస్తున్నారు. ఇడ్లీ, దోశ పిండిపై ప్రస్తుతం ఉన్న 18 శాతం పన్ను భారాన్ని 12 శాతానికి కుదించేందుకూ కౌన్సిల్ ఆమోదముద్ర వేసిందని అధికార వర్గాలు చెప్పాయి. కోళ్లు, పశువుల దాణా కోసం ఉపయోగించే నూనె తీసిన చెక్కపై ప్రస్తుతం ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని ఐదు శాతం పన్ను శ్లాబులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ధూప్ బత్తి, దీపాల మీదా పన్ను భారం 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గనుంది. హోమాల కోసం ఉపయోగించే వస్తువులపై ఐదు శాతం జీఎస్‌టీ విధించాలని కౌన్సిల్ యోచిస్తున్నట్టు సమాచారం. వీటన్నిటిపై వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు.

తెలంగాణలో జాబ్ వర్క్‌కు ఊతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎస్‌టీ భారం తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వస్త్ర పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. కాటన్ వస్త్రాలతోపాటు, జాబ్ వర్క్ పద్ధతిలో నేత కార్మికులు నేసే చేనేత వస్త్రాలపై జీఎస్‌టీ భారాన్ని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో జీఎస్‌టీ మండలి నిర్ణయించింది. 'దాదాపు 80 శాతం జాబ్ వర్క్‌పై ఆధారపడిన తెలంగాణ చేనేత రంగానికి ఈ చర్య ఎంతో మేలు చేస్తుంది' అని తెలంగాణ స్టేట్ స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామేశ్వర రెడ్డి చెప్పారు. తెలంగాణ నుంచి వస్త్ర ఎగుమతుల కోసం కూడా కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఏపి స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ చైర్మన్ పి ధర్మతేజ కూడా జీఎస్‌టీ మండలి నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. జీఎస్‌టీకి ముందూ కాటన్ టెక్స్‌టైల్స్‌పై 5 శాతమే పన్ను ఉండేది. జీఎస్‌టీ రూపంలో ఒక్కసారిగా18 శాతం పన్ను భారం మోపడంతో పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో పడింది. 'ఎట్టకేలకు మా ఆందోళనని పరిగణనలోకి తీసుకుని పన్ను భారాన్ని 5 శాతానికి తగ్గించి మంచి చర్య తీసుకున్నారు.



25 శాతం పెరిగిన ఐటీఆర్ ఫైలింగ్స్

- నోట్ల రద్దుతో పన్ను పరిధిలోకి మరింత మంది

న్యూఢిల్లీ: గడచిన ఆర్థిక సంవత్సరానికి (2016-17) ఆదాయం పన్ను రిటర్ను(ఐటీఆర్)ల ఫైలింగ్ 25 శాతం మేర పెరిగి 2.82 కోట్లకు చేరుకున్నట్టు ఆదాయం పన్ను శాఖ వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో పన్ను రిటర్నులు దాఖలు చేసిన వ్యక్తుల సంఖ్య బాగానే పెరిగినట్టు తెలిపింది. ఆగస్టు 5వ తేదీ నాటికి ఐఆర్‌ఆర్‌లు దాఖలు చేసిన వ్యక్తుల సంఖ్య 25.3 శాతం పెరిగి 2.79 కోట్లకు చేరుకుందని, క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వీరి సంఖ్య 2.22 కోట్లకు పైగా ఉందని పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు, ఆపరేషన్ క్లీన్ మనీ వంటి చర్యల మూలంగా ఐటీఆర్‌ల దాఖలు బాగానే పెరిగిందని ఆదాయం పన్ను శాఖ వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దు కారణంగా చాలా మందిని ఆదాయం పన్ను చెల్లింపుల పరిధిలోకి తెచ్చినట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ చెబుతోంది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో పెరుగుదలే పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగిన ప్రయోజనానికి తార్కాణమని పేర్కొంటోంది. ఆగస్టు 5వ తేదీ నాటికి వ్యక్తిగత ఆదాయం పన్నుకు (కార్పొరేట్ టాక్స్ కాకుండా) సంబంధించి ముందస్తు పన్ను చెల్లింపులు 41.79 శాతం మేర పెరిగాయి. వ్యక్తిగత ఆదాయం పన్ను కింద సెల్ఫ్ అసెస్‌మెంట్ టాక్స్ (సాట్) 34.25 శాతం మేర పెరిగింది.

పుంజుకోనున్న స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు



న్యూఢిల్లీ: దేశీయంగా ఈ ఏడాది మూడో త్రైమాసికం (జూన్-సెప్టెంబర్)లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు పుంజుకునే అవకాశం ఉందని జెపి మోర్గాన్ నివేదిక అంచనా వేస్తోంది. పండగల సీజన్ నేపథ్యంలో కస్టమర్ల సెంటిమెంట్ మెరుగైందని, నిల్వలు కూడా పెరగనుందని పేర్కొంది. జీఎస్‌టీ అమలు నేపథ్యంలో రెండో త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు సాధారణంగానే ఉన్నట్టు తెలిపింది. ఫీచర్ ఫోన్ నుంచి స్మార్ట్‌ఫోన్‌కు మారే వారి సంఖ్య తక్కువగా ఉండటం వల్ల స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ తగ్గినట్టు పేర్కొంది. రెండో త్రైమాసికంతో పోల్చితే మూడో త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 25-30 శాతం వృద్ధికి అవకాశం ఉందని తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే వృద్ధి ఏడు శాతం ఉండవచ్చని పేర్కొంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమ్ముడైన ఫోన్లలో స్మార్ట్‌ఫోన్ల వాటా 45 శాతంగా ఉంది. రిలయన్స్ జియో 1,500 రూపాయలకే ఫీచర్ ఫోన్‌ను అందించనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ వాటా ఇప్పుడున్న స్థాయిలోనే ఉండే అవకాశం ఉన్నట్టు జెపి మోర్గాన్ నివేదిక అంచనా వేసింది.

బ్యాంక్ ఆఫ్ ఇండియా వాటాల విక్రయం

న్యూఢిల్లీ: ఎస్‌టిసిఐ ఫైనాన్స్‌లో 30 శాతం వాటాలను విక్రయించడం ద్వారా 626 కోట్ల రూపాయలు సమీకరించాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నిస్తోంది. వరుసగా రెండేళ్లు నష్టాలనే ప్రకటిస్తూ వస్తున్న ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు అంతగా ప్రధానం కాని ఆస్తులను విక్రయించడం ద్వారా ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునే ప్రయత్నాల్లో ఉంది. బిడ్డింగ్‌కు ఆఖరుతేదీ ఈ నెల 22 అని ప్రకటించింది. ఆసక్తి గల బిడ్డర్లతో ఈ నెల 14వ తేదీన ఎస్‌టిసిఐ యాజమాన్యం సమావేశానికి ఏర్పాట్లు చేసినట్టు ప్రకటించింది.

భారతి ఇన్‌ఫ్రాలో ఎయిర్‌టెల్ వాటాల విక్రయం

భారతి ఇన్‌ఫ్రాటెల్‌లో 3.7 శాతం వాటాలను విక్రయించాలని భారతి ఎయిర్‌టెల్ యోచిస్తున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ వాటాల విలువ 2500 కోట్ల రూపాయలుంటుందంటున్నారు. భారతి ఇన్‌ఫ్రాటెల్‌లో 11.32 శాతం వాటాలను ఈ ఏడాది మార్చి నెలలో తమ అనుబంధ సంస్థ నెటిల్ ఇన్‌ఫ్రాకు 6806 కోట్ల రూపాయలకు భారతి ఎయిర్‌టెల్ బదిలీ చేసింది. ఈ నెటిల్ ఇన్‌ఫ్రాలోని 3.7 శాతం వాటాలను విక్రయించడం ద్వారా 2550 కోట్ల రూపాయలు సమీకరిస్తే భారతి ఎయిర్‌టెల్ రుణభారం తగ్గుతుంది.

10న శాట్‌లో సహారా లైఫ్ కేసుపై విచారణ

ముంబై: సహారా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీని ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ లైఫ్‌లో విలీనం చేయాలన్న ఐఆర్‌డిఎ ఆదేశాలపై విచారణను శాట్ ఈ నెల 10కి వాయిదా వేసింది. పాలసీదారుల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యాపారం కొనసాగించే అవకాశం లేనందున ఆగస్టు 21లోగా ఈ కంపెనీని స్వాధీనం చేసుకోవాలని ఐఆర్‌డిఎ గత నెల 28న ఐసిఐసిఐ ప్రూడెన్షియల్ కంపెనీని ఆదేశించింది. దీంతో సహారా గ్రూపు ఈ విషయాన్ని శాట్‌లో సవాల్ చేసింది. సోమవారం ఈ కేసు విచారణకు రాగా ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

11 లక్షలకు పైగా పాన్ కార్డుల రద్దు

ఒక వ్యక్తికి ఒక పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) మాత్రమే ఉండాలి. కానీ ఒకటికి మించి పాన్‌లు ఉన్న వారి సంఖ్య దేశంలో లక్షల్లో ఉంది. ఇలాంటి వాటిని ఏరివేసే ప్రక్రియను ఆదాయం పన్ను శాఖ ముమ్మరం చేసింది. జూలై 27 వరకు 11,44,211 పాన్‌లను రద్దు చేసినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోష్ కుమార్ గాంగ్వర్ ఇటీవలే ప్రకటించారు. ఆదాయం పన్ను చట్టం ప్రకారం ఒక వ్యక్తికి ఒకటికి మించి పాన్‌లు ఉంటే 10,000 రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. దీన్ని లెక్క చేయకుండా కొంత మంది ఒకటికి మించి పాన్‌లు తీసుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేసేందుకు గాను ఒకటికి మించి పాన్‌లు కలిగిన వారిని గుర్తించడంతోపాటు అదనంగా ఉన్న పాన్‌లను రద్దు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయం పన్ను శాఖ వెబ్‌సైట్ ద్వారా పాన్ యాక్టివ్‌గా ఉన్నదీ లేనిదీ తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.



లాంకో ఇన్‌ఫ్రాకు హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): లాంకో ఇన్‌ఫ్రా లిమిటెడ్ కంపెనీకి ఉమ్మడి హైకోర్టులో చుక్కెదురైంది. తాము సమర్పించిన రూ.88 కోట్ల బ్యాంకు గ్యారంటీని నగదుగా మార్చుకోకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి), ఐడిబిఐ బ్యాంకులను ఆదేశించాలని కోరుతూ లాంకోఇన్‌ఫ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎ రామలింగేశ్వర్ రావు సోమవారం కొట్టివేశారు. ఇలా అడిగే హక్కు లాంకోకు లేదని స్పష్టం చేశారు. పిఎఫ్‌సి, ఐడిబిఐ నుంచి లాంకో ఇన్‌ఫ్రా రూ.2 వేల కోట్లు రుణం తీసుకుందని, రూ.88 కోట్లను బ్యాంకు గ్యారంటీగా సమర్పించిందని పిఎఫ్‌సి తరఫున సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ గ్యారంటీని ఎప్పుడైనా నగదుగా మార్చుకునే అధికారం పిఎఫ్‌సికి ఉందని ఆయన నివేదించారు. దీంతో న్యాయమూర్తి లాంకో పిటిషన్‌ను కొట్టివేశారు.

నాగార్జునా అగ్రికెమ్ లాభం రూ. 1.97 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాగార్జునా అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్‌ఎసిఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి 186.56 కోట్ల రూపాయల ఆదాయంపై 1.97 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 182.84 కోట్ల రూపాయల ఆదాయంపై 2.29 కోట్ల రూపాయల నికర లాభాన్ని కంపెనీ ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం పెరిగినప్పటికీ నికర లాభం మాత్రం తగ్గింది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) మూలంగా జూన్ త్రైమాసికంలో అమ్మకాలపై దెబ్బపడినట్టు కంపెనీ పేర్కొంది. కంపెనీ పేరును నాగార్జునా అగ్రికెమ్ లిమిటెడ్ నుంచి ఎన్‌ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌గా మార్చారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకుగాను ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు సమీపంలో ఉన్న పైడిభీమవరం వద్ద కొత్త ప్లాంట్‌ను ప్రతిపాదించామని, దీనికి అవసరమైన స్థల సేకరణ పనులు కొనసాగుతున్నాయని కంపెనీ తెలిపింది. వచ్చే మూడు నుంచి ఐదేళ్ల కాలంలో ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని పేర్కొంది. వ్యవసాయంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులు తీసుకురానున్నామని, ప్రస్తుత త్రైమాసికం(జూలై-సెప్టెంబర్)లో కొన్ని కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకురానున్నట్టు కంపెనీ తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరమైన సరికొత్త ఉత్పత్తుల కోసం ప్రముఖ కంపెనీలతో కలిసి పని చేస్తున్నట్టు పేర్కొంది. ఎగుమతులు ఆశాజనకంగా ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు సానుకూల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది.

తగ్గిన అమర రాజా బ్యాటరీస్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అమరరాజా బ్యాటరీస్ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ముడి సరుకుల వ్యయాలతోపాటు ఇతర వ్యయాలు గణనీయంగా పెరిగిపోవటంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నికర లాభం 23.58 శాతం క్షీణించి 99.85 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 130.53 కోట్ల రూపాయలుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు 1,465.28 కోట్ల రూపాయల నుంచి 1,686.96 కోట్ల రూపాయలకు పెరిగాయి. ఈ కాలంలో మొత్త వ్యయాలు 20.37 శాతం వృద్ధితో 1,274.53 కోట్ల రూపాయల నుంచి 1,534.24 కోట్ల రూపాయలకు పెరిగినట్లు అమర రాజా పేర్కొంది. త్రైమాసిక కాలంలో ముడి సరుకుల వ్యయాలు 25 శాతం మేర పెరగటం పనితీరుపై ప్రభావం చూపించిందని తెలిపింది. ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహన ఉత్పత్తి పెరిగిపోవటంతో ఆటోమోటివ్ బ్యాటరీ వ్యాపారం కూడా వృద్ధి చెందిందని పేర్కొంది. అయితే టెలికాం రంగంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఈ రంగం నుంచి వచ్చే రాబడి తగ్గిందని వెల్లడించింది. వినియోగదారులకు నిర్వహణాపరమైన వ్యయాలను తగ్గించేందుకు వినూత్నమైన ఉత్పత్తులను అందించటంపై దృష్టి సారించినట్లు అమర రాజా తెలిపింది. పారిశ్రామిక రంగం ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచకపోవటంతో ఇండస్ట్రియల్ బ్యాటరీ వ్యాపారం స్తబ్దుగా ఉందని పేర్కొంది. జీఎస్‌టీ అమల్లోకి రావటంతో కంపెనీ కూడా అందుకు తగ్గట్టుగా రూపుదిద్దుకుందని, జీఎస్‌టీ పన్ను విధానంతో ఈ రంగంలో సమాన అవకాశాలు లభిస్తాయని విశ్వసిస్తున్నట్లు అమర రాజా బ్యాటరీస్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా తెలిపారు. లెడ్ ధరలు పెరగటం, ఇండస్ట్రియల్ బ్యాటరీలకు డిమాండ్ మందగించటం వంటి అంశాల కారణంగా నిర్వహణ వ్యయాలను తగ్గించే ఉత్పత్తుల రూపకల్పనపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

సుబాబుల్ రైతుకు కష్టాలు

- కొనుగోళ్లు పూర్తిగా బంద్
- తాజాగా జీఎస్‌టీ సాకు



కంచికచర్ల: ఆంధ్రప్రదేశ్‌లో సుబాబుల్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సుబాబుల్ కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఏ మాత్రం స్పందన లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ మార్కెటింగ్ శాఖ అధికారులు కూడా పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు తప్పితే పరిస్థితిపై సమీక్ష కూడా చేయటం లేదు. మార్కెట్ యార్డుల్లో కాకుండా తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ ఆఫ్ సర్టిఫికెట్ (ఆర్‌సి) పై కొనుగోలు చేసేందుకు ఒక ప్రముఖ కంపెనీ తెర వెనుక ప్రయత్నిస్తున్నట్టుగా తెలిసింది. మరోవైపు మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావు ఒకట్రెండు సార్లు సమావేశాలు నిర్వహించి ధరలు పెంచి కొనుగోళ్లు చేయాలని కంపెనీలను ఆదేశించినా అది ఎక్కడా అమలు కావడం లేదు. ఏడాది నుంచి తూతూమంత్రంగా సుబాబుల్ కర్ర కొంటున్న కంపెనీలు ప్రస్తుతం పూర్తిగా నిలిపివేశాయి. జీఎస్‌టీ కారణంగా వే బిల్లుల సమస్య ఏర్పడిందంటూ ఐటిసి గత నెల చివరి వారం నుంచి కర్ర కొనటం లేదు. కొద్ది రోజుల నుంచి ఎపిపిఎం కూడా అదేబాట పట్టింది. టన్నుకు 4,400 రూపాయల ధరకు గాను చేతికి నికరంగా మూడు వేల రూపాయలు కూడా దక్కని దుస్థితి నెలకొన్నది. కంపెనీల దోపిడీని అరికట్టాల్సిందిగా రైతులు పోరాటం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. కంపెనీలు ఆడిందే ఆటగా పాడిందే పాటగా తయారైంది. కంపెనీల మాయాజాలంలో చిక్కుకున్న రైతుల గోడు ఆలకించే నాధుడే కనిపించటం లేదు. జనవరి నుంచి జూలై వరకు 2016లో నందిగామ ఎఎంసి పరిధిలో 2,39,774 టన్నుల సుబాబుల్ కర్ర కొనగా, 2017లో అదే కాలానికి నామమాత్రంగా 40,875 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. కంచికచర్ల ఎఎంసి పరిధిలో 2016లో జూలై వరకు 50,208 టన్నులు కొనగా, ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 18 వేల టన్నులు మాత్రమే కొన్నారు.

ఆర్‌సిపై కొనుగోళ్లకు కుట్ర

ఆర్‌సి (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) పై కొనుగోళ్లకు ఒక ప్రముఖ కంపెనీ ప్రయత్నిస్తున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే పక్కనే గల ఖమ్మం జిల్లాలో ఆర్‌సిపై తక్కువ ధరకు సుబాబుల్ కర్ర కొనుగోలు చేస్తున్నది. ఈ విధానంలో కంపెనీ నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయదు. ట్రేడ్ లైసెన్సు ఉన్న దళారులతో కాంట్రాక్టు కుదుర్చుకోవటంతో కంపెనీలకు వీలైనంత తక్కువ ధరకు కర్ర లభ్యమవుతుంది. మరోవైపు తెలంగాణాలోని సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు కృష్ణా జిల్లా నందిగామ ప్రాంతంలోని రైతులకు కుచ్చుటోపీ పెట్టింది. ఆ కంపెనీ నుంచి దాదాపుగా 11 కోట్ల రూపాయలకు పైగా రావాల్సి ఉంది. మిల్లు మూతబడటం, పైగా బ్యాంకులు సీజ్ చేయటం, కోర్టులో కేసులు నడుస్తుండటంతో రైతులకు సొమ్ములు రావటం లేదు. మూడేళ్ల నుంచి నిరీక్షిస్తున్న రైతులు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ నుంచి హామీ లభించటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనుగోళ్లు బంద్ అయినందున తాము పడుతున్న ఇబ్బందులు, నష్టాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే పాలకులు, అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మెడ్‌ప్లస్ రూ.1,300 కోట్ల సమీకరణ!

ప్రైవేట్ ఈక్విటీ సంస్థలతో చర్చలు

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్.. ప్రైవేట్ ఈక్విటీ సంస్థల నుంచి 20 కోట్ల డాలర్లు (1,300 కోట్ల రూపాయలు) సమీకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. నిధుల సమీకరణకు సంబంధించి ఇప్పటికే ప్రైవేట్ ఈక్విటీ సంస్థలైన జనరల్ అట్లాంటిక్, ట్రూ నార్త్ లతో చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. మెడ్‌ప్లస్‌లో ప్రస్తుతం ఇన్వెస్టర్లుగా ఉన్న సంస్థల నుంచి ఈ వాటాలను కొనుగోలు చేయాలని ఇరు సంస్థలు భావిస్తున్నాయి. సుదీర్ఘ కాలంగా కంపెనీలో వాటాదారులుగా ఉన్న వీరు గత కొంతకాలంగా తప్పుకోవాలని చూస్తున్నాయి. అయితే కొత్త ఇన్వెస్టర్లను చేర్చుకోవటం ద్వారా భవిష్యత్తులో మరింత వృద్ధిపథంలోకి దూసుకుపోవచ్చనేది మెడ్‌ప్లస్ భావనగా ఉంది. ప్రస్తుతం మెడ్‌ప్లస్‌లో యుఎస్‌కు చెందిన మౌంట్ కెల్లెట్ క్యాపిటల్‌కు 49 శాతం వాటా ఉండగా టీవీఎస్ క్యాపిటల్‌కు చెందిన టీవీఎస్ శ్రీరామ్ గ్రోత్ ఫండ్‌కు 10.59 శాతం, అజయ్ పిరామల్ సారథ్యంలోని ఇండియా వెంచర్ ఫండ్‌కు 9.9 శాతం వాటాలున్నాయి. ఈ మూడు సంస్థల వాటా 69 శాతంగా ఉండగా మిగిలిన వాటా మెడ్‌ప్లస్ వ్యవస్థాపక సిఇఒ మధుకర్ గంగాడి చేతిలో ఉంది.



ఎన్‌ఎండిసికి పిఆర్‌సిఐ అవార్డు

హైదరాబాద్: ఎన్‌ఎండిసి ప్రతిష్ఠాత్మకమైన పిఆర్‌సిఐ అవార్డును గెలుచుకుంది. సంస్థ హౌజ్ జర్నల్ అయిన ఖనిజ్ భారతి, కార్పొరేట్ డైరీ 2017కు గాను ఎన్‌ఎండిసి ఈ అవార్డును దక్కించుకుంది. రెండో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా పిఆర్‌సిఐ, హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ నుంచి ఈ అవార్డును ఎన్‌ఎండిసి ఎజిఎం (కార్పొరేట్ కమ్యూనికేషన్) సిహెచ్ శ్రీనివాస రావు ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణా చారి, కాన్ఫరెన్స్ చైర్మన్ సివి నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

రూ.799కే విస్తారా టికెట్

ముంబై: టాటా, సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్వహణలోని విస్తారా 'ఫ్రీడమ్ టు ఫ్లై' ఆఫర్ కింద 799 రూపాయలకే (అన్ని రకాల చార్జీలు కలిపి) ఎకానమీ క్లాస్, 2099 రూపాయలకు ప్రీమియం ఎకానమీ క్లాస్ టికెట్లు అందిస్తోంది. పరిమిత కాలం పాటే అమల్లో ఉండే ఈ ఆఫర్ కింద సోమవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వరకు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ఈ నెల 23వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 23వ తేదీ మధ్యలో ప్రయాణ తేదీని ఎంచుకోవచ్చు. ఈ ఆఫర్ కింద గోవా, పోర్ట్ బ్లెయిర్, లే (లడక్), జమ్ము, శ్రీనగర్, కొచి, గౌహతి, అమృతసర్, భువనేశ్వర్ వంటి విహార కేంద్రాలకు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకునే అవకాశం అందుబాటులో ఉన్నట్లు విస్తారా తెలిపింది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల మధ్య కూడా ఈ ఆఫర్ కింద టికెట్లు బుక్ చేసుకోవచ్చు. శ్రీనగర్-జమ్ము రూట్‌లో అతి తక్కువ ధరలు అందుబాటులో ఉన్నట్లు కంపెనీ పేర్కొంది.

అక్టోబర్‌లో విదేశాలకు 'గో ఎయిర్'



కోల్‌కతా: తక్కువ ధరలకే విమానయాన అవకాశం కల్పిస్తున్న ప్రైవేటు విమానయాన సంస్థ గో ఎయిర్ వచ్చే అక్టోబర్ నుంచి విదేశీ గమ్యాలకు సర్వీసులు నడపనుంది. ప్రారంభ దశలో ఆసియాలోని గమ్యాలకు విమాన సర్వీసులు నడపనున్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జే వాడియా చెప్పారు. ప్రాంతీయంగా ఏయే గమ్యాలకు విమాన సర్వీసులు నడపవచ్చనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుతం 24 విమానాలున్న గో ఎయిర్.. 143 ఎయిర్‌బస్ నియో ఎ320 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. వాటిలో ఐదు మాత్రమే ఇప్పటికి అందాయి. ఇంజన్‌కి సంబంధించిన సమస్యల వల్ల కొత్త విమానాల డెలివరీ జాప్యం అవుతున్నదని వాడియా తెలిపారు. ఎయిరిండియాలో వాటాలు తీసుకోవడంపై ఆసక్తి ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పట్లో ఐపిఒకు వచ్చే యోచన కూడా లేదని తెలిపారు.

ఆనంద్ మహీంద్రా పారితోషికం రూ.7.67 కోట్లు



న్యూఢిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) చైర్మన్ ఆనంద్ మహీంద్రా 2016-2017 ఆర్థిక సంవత్సరంలో 7.67 కోట్ల రూపాయల జీతం అందుకున్నారు. క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈయన అందుకున్న జీతంలో పెరుగుదల 16.38 శాతంగా ఉంది. కంపెనీ వార్షిక నివేదికలో ఆనంద్ మహీంద్రా ఎంత జీతం అందుకున్న వివరాలను వెల్లడించారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయెంకా 7.39 కోట్ల రూపాయల పారితోషికం అందుకున్నారు. ఈయన జీతంలో పెరుగుదల క్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 15.86 శాతం ఉంది. 2016-17 సంవత్సరంలో కంపెనీ ఉద్యోగులు అందుకున్న సగటు వేతనం 7.08 లక్షల రూపాయలుగా ఉంది. దీంతో పోల్చితే ఆనంద్ మహీంద్రా వేతనం 108.27 రెట్లు, గోయెంకా వేతనం 104.43 రెట్లు ఎక్కువగా ఉంది. ఎం అండ్ ఎం గ్రూప్ సిఎఫ్ఒ, సిఐఒ విఎస్ పార్థసారథి 3.52 కోట్ల రూపాయల పారితోషికాన్ని అందుకున్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల సగటు వేతనం 0.43 శాతం పెరిగింది. వ్యక్తిగత పనితీరు, ద్రవ్యోల్బణం, పరిశ్రమ ధోరణులు, ప్రామాణికాలు పరిగణనలోకి తీసుకుని ఎగ్జిక్యూటివ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పారితోషికాన్ని నిర్ణయించినట్టు కంపెనీ పేర్కొంది.

నాట్కోకు టామీఫ్లూ కిక్

■ **జూన్ త్రైమాసిక లాభంలో రెండింతల వృద్ధి**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రెండింతలు వృద్ధి చెంది 97.3 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 47.5 కోట్ల రూపాయలుగా ఉంది. అమెరికా మార్కెట్లో జెనరిక్ టామీఫ్లూ ఔషధ విక్రయానికి ప్రత్యేక హక్కులు లభించటం కంపెనీకి కలిసి వచ్చింది. త్రైమాసిక సమీక్షా కాలంలో నాట్కో రాబడులు కూడా 30 శాతం వృద్ధితో 345.5 కోట్ల రూపాయల నుంచి 448.70 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. అయితే 2016-17 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం నికర లాభం 47 శాతం క్షీణించగా రాబడి 22 శాతం తగ్గింది. గిలీడ్, రోచేతో ఉన్న వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోవటంతో పాటు గత ఏడాది డిసెంబరులో అమెరికా మార్కెట్లోకి ఇన్‌ఫ్లుయెంజా చికిత్సలో వినియోగించే జెనరిక్ ఔషధం టామీఫ్లూ క్యాప్సూల్స్‌ను నాట్కో ఫార్మా విడుదల చేసింది. బహుళ జాతి దిగ్గజ సంస్థతో కేసు పరిష్కరించుకోవటంతో 30 ఎంజి, 45 ఎంజి, 75 ఎంజి సామర్థ్యం గల టామీఫ్లూ ఔషధాలను పరిమితకాలంపాటు విక్రయించేందుకు నాట్కోకు ప్రత్యేక హక్కులు లభించాయి. ఈ ప్రత్యేక హక్కులతో గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నాట్కో రాబడులు, లాభాలు గణనీయంగా పెరిగాయి.

డివిడెండ్: ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2017-18 ఆర్థిక సంవత్సరానికి 2 రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 1.25 రూపాయల (62.5 శాతం) మధ్యంతర డివిడెండ్‌ను నాట్కో ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపు రికార్డు తేదీని ఈ నెల 18వ తేదీని ఖరారు చేసినట్లు పేర్కొంది. కాగా డివిడెండ్‌ను ఈ నెల 23న చెల్లించనున్నట్లు తెలిపింది. ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో బిఎస్ఇలో నాట్కో షేరు 1.22 శాతం లాభంతో 960.80 రూపాయల వద్ద స్థిరపడింది.

లాభాల స్వీకరణతో వెనక్కి..

స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు



ముంబై: స్టాక్ మార్కెట్‌ను ముందుకు నడిపించే ట్రిగ్గర్లేవీ లేకపోవడంతో ట్రేడింగ్ చివర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడడం వల్ల సోమవారం మార్కెట్ నష్టాల్లోకి జారింది. తాజాగా వెలువడిన కార్పొరేట్ ఫలితాలు కూడా ఇన్వెస్టర్లను ఆకట్టుకోలేకపోయాయి. దీనికి తోడు అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి మరింత బలోపేతమై రెండేళ్ల గరిష్ఠ స్థాయికి చేరడం సాఫ్ట్‌వేర్ స్ర్కిప్‌లలో అమ్మకాల జోరుకు కారణమైంది. రూపాయి బలం కారణంగా ఐటి కంపెనీల ఆదాయాలు దెబ్బతింటాయన్న భయాలతో ఆ కౌంటర్లలో అమ్మకాలు భారీగా సాగినట్టు బ్రోకర్లు చెబుతున్నారు. ఇన్ఫోసిస్ 1.75 శాతం నష్టపోయి సెన్సెక్స్‌లోని స్ర్కిప్‌లలో అత్యధికంగా నష్టపోయిన స్ర్కిప్‌గా నిలిచింది. టిసిఎస్, విప్రో కూడా నష్టాలతో ముగిశాయి. సోమవారం సెన్సెక్స్ 32377.80 పాయింట్ల వద్ద ప్రారంభమై దే గరిష్ఠ స్థాయి 32396.14 పాయింట్లకు చేరినా చివర్లో సాగిన అమ్మకాల ఒత్తిడి కారణంగా 51.74 పాయింట్ల నష్టంతో 32273.67 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 9 పాయింట్ల నష్టంతో 10057.40 పాయింట్ల వద్ద క్లోజయింది. వెలుపలి బిఎస్ఇ మిడ్‌క్యాప్ ఇండెక్స్ జీవితకాల గరిష్ఠ స్థాయి 15600.27 పాయింట్లను తాకగా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.15 శాతం లాభపడి 16109.21 పాయింట్ల వద్ద పాజిటివ్‌గా ముగిశాయి. ఎలాంటి ట్రిగ్గర్లు లేకపోవడం, షేర్లు అధిక విలువలకు చేరడంతో మార్కెట్ కన్సాలిడేషన్‌లోకి వెళ్లిందని, అయితే పాజిటివ్ సెంటిమెంట్, అధిక లిక్విడిటీ యథాతథంగా కొనసాగుతాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

14 శాతం లాభపడిన జేపీ అసోసియేట్స్

మెరుగైన త్రైమాసిక ఫలితాలు ప్రకటించడంతో జైప్రకాశ్ అసోసియేట్స్ షేరు 14 శాతం పెరిగింది. బిఎస్ఇలో ఈ స్ర్కిప్ 14.40 శాతం లాభపడి రూ.29 వద్ద ముగియగా ఎన్ఎస్ఇలో 14.20 శాతం లాభపడి రూ.28.95 వద్ద ముగిసింది. బిఎస్ఇలో ఇంట్రాడేలో ఈ షేరు రూ.30.40 వరకు పెరుగుకుపోయింది.

ఐపిఒకి జిఐసి దరఖాస్తు

ప్రభుత్వ రంగంలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ (జిఐసి) పబ్లిక్ ఇష్యూకి రావడానికి సెబి అనుమతి కోరుతూ దరఖాస్తు చేసింది. అన్ని పిఎస్‌యు బీమా కంపెనీలను లిస్టింగ్ చేయాలన్న ప్రభుత్వ వ్యూహంలో భాగంగా ఒక్కోటి ఐదు రూపాయల ముఖ విలువ గల 12.4 కోట్ల వాటాలు విక్రయించనున్నట్టు జిఐసి తన దరఖాస్తులో తెలిపింది. ఈ ఇష్యూ అనంతరం జిఐసిలో ప్రభుత్వ వాటా 14.22 శాతం మేరకు తగ్గుతుంది. వాటిలో 1.7 కోట్ల షేర్లను ఐపిఓ ద్వారాను, 10.7 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ బాటలోను విక్రయించాలని యోచిస్తున్నట్టు పేర్కొంది.

నేటి నుంచి గోల్డ్ బాండ్ల ట్రేడింగ్

గత నెలలో విక్రయించిన గోల్డ్ బాండ్ల ట్రేడింగ్ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని రిజర్వ్ బ్యాంకు ప్రకటించింది. జూలై 10 నుంచి 14 తేదీల మధ్యన గోల్డ్ బాండ్ స్కీమ్ 2017-18 సీరీస్ 2 బాండ్లకు దరఖాస్తులను స్వీకరించారు. 28వ తేదీన ఇన్వెస్టర్లకు డీమ్యాట్ విధానంలో బాండ్లు ఇచ్చారు. గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ బాండ్లను ట్రేడింగ్ చేసుకోవచ్చని ఆర్‌బిఐ తెలిపింది. ఈ జూలై సీరీస్ బాండ్ల కన్నా ముందు ఎనిమిది విడతలుగా గోల్డ్ బాండ్లు విక్రయించడం ద్వారా 5,400 కోట్ల రూపాయలు సమీకరించారు.

హిండాల్కో రూ.4,400 కోట్ల సమీకరణ

రుణపత్రాల జారీ ద్వారా 4400 కోట్ల రూపాయల సమీకరణ అంశం డైరెక్టర్ల బోర్డు ఈ వారంలో పరిశీలించనున్నట్టు హిండాల్కో ఇండస్ట్రీస్ ప్రకటించింది. వర్కింగ్ కాపిటల్ అవసరాల కోసం రెండు వేల కోట్ల రూపాయలు మించకుండా అన్‌సెక్యూర్డ్ డిబెంచర్లు జారీ చేసే విషయం కూడా బోర్డు పరిశీలిస్తుందని పేర్కొంది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	29,320	29,350	29,400	28,520	--
క్రితం ముగింపు	29,390	29,400	29,440	28,690	--
22 క్యారెట్లు	28,730	27,300	27,230	28,370	27,110
క్రితం ముగింపు	28,800	27,300	27,290	28,540	27,120
వెండి (కిలో)	38,350	38,600	38,500	37,060	--
క్రితం ముగింపు	38,450	38,200	38,600	37,950	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77.00	గోదావరి	77.00
కరీంనగర్	78.00	విజయవాడ	79.00
వరంగల్	77.00	గుంటూరు	80.00
మహబూబ్‌నగర్	77.00	ఒంగోలు	81.00
కర్నూలు	77.00	చిత్తూరు	83.00
విశాఖపట్నం	76.00	నెల్లూరు	83.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	321.00	వరంగల్	323.00
విజయవాడ	328.00	చెన్నై	372.00
గోదావరి	328.00	నమక్కల్	365.00
బెంగళూరు	360.00	చిత్తూరు	365.00
విశాఖపట్నం	335.00	ముంబై	368.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	57.95	67.19
పౌండ్	75.65	87.73
యూరో	68.37	79.28
ఆస్ట్రేలియా డాలర్	46.02	53.25
బహ్రెయిన్ దినార్	157.02	179.84
కువైట్ దినార్	174.48	217.28
ఒమని రియాల్	153.64	175.82
సౌదీ రియాల్	15.41	18.27
సింగపూర్ డాలర్	42.60	50.46
యుఎఇ దిరమ్	15.77	18.44

10100 వద్ద అప్రమత్త ధోరణి

నిఫ్టీ మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమై 10100 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్ సాధించింది. ఆ తర్వాత రోజంతా సుదీర్ఘ కన్సాలిడేషన్ సాధించిన అనంతరం చివరికి 9 పాయింట్ల నష్టంతో మైనర్ అప్రమత్త ధోరణిలో డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. కొద్ది రోజులుగా మార్కెట్ 10100, 10000 మధ్యన పరిమిత పరిధిలో సైడ్‌వేస్‌లో కదలాడుతోంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే కాస్తంత బలాన్ని ప్రదర్శించడం తప్పనిసరి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం: 10100 మద్దతు: 9980 — టెక్ వ్యూ

- మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 10100 పైన బలంగా క్లోజ్ కావాలి.
- మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 9980 కన్నా దిగజారితే మరింత కరెక్షన్ ట్రెండ్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి, ట్రెండ్‌ను నిర్ణయించే స్థాయి 9900. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ఉంటుంది.
- బ్యాంక్ నిఫ్టీ ప్రధాన స్థాయి 25000 కన్నా స్వల్పంగా దిగువన క్లోజయింది. స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చుననేందుకు ఇది సంకేతం. ఈ స్థాయిలో బ్రేకౌట్ తప్పనిసరి.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా నిస్తేజం

తిథి : శ్రావణ బహుళ పాడ్యమి **నక్షత్రం :** ధనిష్ఠ

పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మీన రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 10057.40 (-9)

ట్రెండ్ మార్పు వేళలు: 9.53, 2.40

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 10 గంటల నుంచి 2.30 వరకు నిస్తేజంగా ఉండి 2.45 నుంచి ముగింపు వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.45 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి. — ఆస్ట్రో వ్యూ

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10095, 10130

మద్దతు స్థాయిలు : 10015, 9980

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 6.98(6.65)100
ADITYA SPIN. 9.1(9)245
AGRO TECH FO 529.95(524.8)1416
ALPHAGEO (I) 839.55(878.8)14064
ALU FLUORIDE 58.3(58.5)2767
AMAR RAJA BA 822.55(805.65)86778
ANDHRA BANK 55.7(56.05)132049
ANDHRA CEMEN 9.97(9.84)49169
ANDHRA PETRO 26.75(26.95)60934
ANJANI PORTL 224.35(227.9)308
ASTRA MICRO 131(132.45)23155
AUROB.PHARMA 724.15(725.2)167925
AVANTEL LTD 238.3(224.1)7379
AVANTI FEEDS 1803.2(1782)23934
B.N.RATHI SE 33.65(36)11918
BALAJI AMINE 323.95(320.75)33306
BAMBINO AGRO 183.3(180)3147
BARTRONICSIN 15.05(15.05)15905
BHAGIRA.CHEM 177.6(171.1)14386
BHAGYA INL 23.5(24)4185
BHARATFIN 831.5(839.75)72951
BNR UDYOG 42.2(37.75)3581
CAMBRIDGE 71.35(72.8)2677
CAT TECHN. .63(.66)100
CCHHL 14.66(14.96)22026
CCL PRODUCTS 281.85(279.05)1723
CELESTIAL 24.8(24.05)4866
CIL SECURITS 40.95(41.25)6892
COROM INTER 443.65(446.65)132432
CYBERMATE 3.2(3.27)37000
CYIENT 524.55(525.75)4592
DANLAW TECH. 49.1(49)2866
DECAN CEMENT 1110.05(1104.6)251
DHAN ROTO SP 22.8(22.8)534
DIAMONPOWER 25.4(25.9)39358
DIVI'S LAB. 683.2(681.6)55549
DIVYA.GRANIT 100(99.75)2196
DQ ENT 13.34(13.39)1948
DR.REDDY'S 2210.3(2244.1)50996
EMPEE SUGARS 6.09(5.8)18635
EVEREST ORG. 100(98)479
FACOR ALLOYS 4.11(4.04)132384
FIRSTOBJ 16.25(15.55)1850
G.R.CABLES .32(.33)9469
GATI LTD. 119.95(120.2)77187
GAYATRI BIO 12(11.74)224
GAYATRI PROJ 166.85(170.15)1246
GENNEX LAB 4.52(4.57)94561
GMR INFRASTR 18.55(17.65)2478497
GODAVARI DRU 40.2(39.85)2553
GOLDST INFRA 87.35(79.45)59922
GOLDSTONE EN 10.91(9.92)17882
GRANULES (I) 132.3(131.6)35378
GVK POWERINF 13.48(12.35)9549638
HBL P SYS 47.6(47)22707
HERITGFOOD 1296.45(1260.2)1508
HIND.FLUROCA 14.65(15.39)1100
HINDUSTN BIO .93(.93)225
I.C.S.A. IND 2.99(2.91)9076
IKF TECHNO .7(.61)293222
INCAP LTD. 50.9(48.5)6037
IPAPPM 307.8(310.45)2986
IVRCL LTD 6.31(6.32)586109
KAKATIYA CEM 384.55(370.95)9980
KALLAM SPG. 26.95(27.1)19339
KAVERI SEED 695.25(697.9)24286
KCP LTD 103.1(101.7)14128
KERNEX MICRO 36.9(35.7)4364
KNR CONST 208.15(208.15)511
KREBS BIOCHM 102(101)252
LANCO INFRA 1.15(1.2)6116098
LOKESH MACH 85(83.2)12182
MADHUCON PRJ 32.05(31.8)16190
MOLD-TEK TEC 50.9(50.55)4733
MOSCHIP SEMI 49.4(50.6)204182
MSR INDIA 23.9(22.8)359660
N C L IND. 213.55(204.65)19947
NAGAR.AGRICH 35.5(37.05)39261
NATCO PHARM 960.8(949.2)93860
NCC 89.95(87.1)329398
NEHA INTER. 6.12(6.04)12471
NETTLINX LTD 115.15(110.35)11586
NEULAND LAB. 1388.8(1425)717
NIHAR INFO 16.9(16.5)1850
NILE LTD. 624.45(622.05)2640
NTL 4.47(4.6)3300
OIL COUNTRY 45.5(46.8)201
PADMALAYA TE 9.4(9)42654
PALRED 103.15(103.7)1623
PANYAM CEMEN 63.15(63.05)18433
PENNAR STEEL 54.4(54.8)33900
PFL INFOTECH 5.77(5.77)10
PHYTOCHEM I. 59.55(60.7)1801
PITTI LAMIN. 53.6(54.2)2097
POKARNA LTD 1304.15(1285)253
PRAJAY ENGS. 9.56(9.82)7089
PREMIER EXPL 466.1(454.7)1623
PRISM CEMENT 118.45(118.45)10236
RAIN 132.65(129)166652
RAJ PACKAGIN 56.75(57.25)2266
REG.CERAMIC 5.7(5.88)400
RESTILE CER. 5.5(5.42)4353
SAGAR CEM. 819.8(824.1)521
SAMKRG PIST. 291.15(289)6562
SAMPRE NUTRI 45(44.7)6513
SANGHI IND. 93.15(93.9)71491
SATVAH.ISPAT 43.15(44)2087
SAVEN TECHNO 23.05(22.8)817
SMPL 1.94(1.82)172101
SMS PHARMACE 75.55(76.8)1114
SREE RAYALA 132.95(130.3)2374
STEEL EXCH 85.95(89.55)267255
SUJANA INDUS 1.12(1.16)13031
SURANATP 4.96(5.14)8613
SURYACHAKRA 1.61(1.63)53295
SURYAVA SPIN 9.39(9.88)3
SURYLAK.COTT 107.65(105.65)4614
SUVEN LIFE S 167.75(168.5)24388
TAJ GVK HOTL 164.05(164.95)3425
TANLA 34.8(35.1)79325
TRANSCORP IN 19.45(19.8)19397
TRANSGENE BI 2.36(2.48)8708
TRANSPORT CO 297.65(298.35)7985
USHER AGRO 7.84(7.73)7127
VICEROY HOTE 19.75(18.7)84454
VIJAY TEXTIL 63.05(63.9)37621
VIMTA LABS 139.75(136.3)3711
VIRAT CRANE 38.35(37.15)5099
VIRINCHI 89.6(90.55)49735
VISAKA IND. 487.8(488.3)5013
VISTA PHARMA 31.5(31.15)8464
VIVIMED LABS 123.1(123.15)124798
VST INDUS. 2906.65(2908.05)402
WATERBASE 112.3(109.55)125728
XLENERGY 1.85(2.05)2349
YBRANTDIGI 7.01(6.8)96502
ZEN TECH 57.5(55.85)84596
ZENOTECH 52(51.35)19372

ఎన్ఎస్ఇ-500 (NSE)

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం

AARTIDRUGS 558.7(554)5916
AARTIIND 936.4(919.75)14950
ABAN 178.15(176.95)543244
ABB 1405.9(1426.2)26755
ABFRL 170.3(171.8)266838
ABGSHIP 13.3(12.7)30365
ACC 1817.35(1813.35)257138
ADANIENT 140.1(138)2242614
ADANIPORTS 414.25(406.65)3863466
ADANIPOWER 32.9(32.9)5312933
ADANITRANS 127.75(123.8)544692
AEGISCHEM 186.3(185.25)83580
AHLUCONT 281.55(280.15)3169
AIAENG 1439.75(1437.65)21787
AJANTPHARM 1338.05(1340.55)50255
AKZOINDIA 1810.5(1796)2404
ALBK 71.85(71.45)1452479
ALLCARGO 171.55(171.65)84833
ALOKTEXT 3.25(3.15)4978637
AMARAJABAT 821.25(805.8)1235383
AMBUJACEM 279.5(277.45)1632831
AMTEKAUTO 28.25(26.7)1492544
ANANTRAJ 60.8(59.95)860838
ANDHRABANK 55.65(56.1)1525843
APARINDS 789.6(767.25)116951
APLLTD 530.4(531.8)33356
APOLLOHOSP 1268.05(1258.1)83444
APOLLOTYRE 285.5(262.25)18908914
ARVIND 389.1(364.7)4863745
ASHIANA 189.15(185.85)9248
ASHOKA 187.4(179.35)98318
ASHOKLEY 111.2(109.2)8251146
ASIANPAINT 1149.65(1157.3)576280
ASTRAL 641.3(614.75)32156
ASTRAZEN 914.25(909.5)1777
ATUL 2091.05(2101.5)14466
AUROPHARMA 724.45(725.3)1316319
AVANTIFEED 1801.3(1781.2)137138
AXISBANK 505.8(508.1)5293884
BAJAJ-AUTO 2889.25(2874.65)169287
BAJAJCORP 407.85(408.2)33131
BAJAJELEC 331.95(325.9)81490
BAJAJFINSV 5433.05(5308.15)243057
BAJAJHIND 16.05(15.65)8257228
BAJAJHLDNG 2562.3(2416.65)66226
BALKRISIND 1650.15(1590.4)187619
BALLARPUR 16.15(15.75)933140
BALMLAWRIE 251.5(246.55)56851
BALRAMCHIN 178.95(173.7)3018899
BANKBARODA 160.05(158.95)4382843
BANKINDIA 158.05(158.45)2783549
BASF 1462.35(1432.85)8729
BATAINDIA 641.3(631.35)1085338
BBTC 915.5(882)463346
BEML 1718.05(1727.65)289668
BERGEPAINT 248.95(241.35)865622
BFUTILITIE 370.2(368.15)171522
BGRENERGY 142.95(142.85)53863
BHARATFIN 829.8(840.45)1118511
BHARATFORG 1161.55(1155.45)503083
BHARTIARTL 417.45(420.9)1170962
BHEL 138.9(137.25)2710873
BHUSANSTL 72.5(68.1)1292389
BIOCON 354.25(357)1723793
BIRLACORPN 960.3(957.45)80375
BLISSGVS 173.85(175.95)97850
BLUEDART 4148.5(4190)8880
BLUESTARCO 695.4(676.4)38658
BOMDYEING 82.9(81.5)1552475
BOSCHLTD 24353.85(24560.2)8954
BPCL 527.7(517.9)4681753
BRFL 147.8(148.15)41084
BRIGADE 275.3(269.1)53579
BRITANNIA 4107.8(3917.4)891341
CADILAHC 533.05(532.9)455871
CANBK 352.55(351.6)850397
CANFINHOME 2945.15(2979)198091
CAPF 791.3(778.05)551771
CARERATING 1608.35(1613.1)12869
CASTEXTECH 6.7(6.7)386792
CASTROLIND 398.65(396.1)523832
CCL 280.8(280.15)43020
CEATLTD 1814.35(1740.35)1597924
CENTRALBK 86.7(87.55)1081724
CENTURYPLY 266.3(260.75)591689
CENTURYTEX 1225.1(1222.45)681482
CERA 2869.05(2821.9)6169
CESC 977.8(967.55)576425
CHAMBLFERT 141.5(140.55)806524
CHENNPETRO 417.85(403.4)2886864
CHOLAFIN 1206.2(1180.4)386967
CIPLA 566.5(568.7)769606
CLNINDIA 631.05(622.6)13825
COALINDIA 251.5(249.2)3336900
COLPAL 1071.85(1073.5)119734
CONCOR 1184.4(1179.6)285967
COROMANDEL 445(447.9)118450
CORPBANK 48.7(48.9)177926
COX&KINGS 275.65(274.25)54977
CRISIL 1850.5(1853.9)7631
CUB 171.1(168.05)441096
CUMMINSIND 946.15(936.6)210437
CYIENT 523.7(527.55)17917
DABUR 319.45(307.3)2371502
DALMIABHA 2652.1(2569.55)123174
DBCORP 380.2(379.9)62074
DBREALTY 40.85(40.35)641849
DCBBANK 196.05(195.1)854795
DCMSHRIRAM 401.05(395.8)362563
DEEPAKFERT 352.9(358.2)149865
DELTACORP 175.6(165.45)4884413
DEN 83.1(83.3)36505
DENABANK 33.35(33.4)388832
DHANUKA 755.7(734.6)30052
DHFL 456.75(456.7)1280797
DISHTV 76.8(79.3)5158746
DIVISLAB 684.05(682.15)427725
DLF 191.35(189.8)4263872
DREDGECORP 627.15(626.55)144041
DRREDDY 2206.95(2239.55)736078
DYNAMATECH 2377.05(2364.8)17505
ECLERX 1288.05(1263.85)6516
EDELWEISS 229.2(225.15)3811506
EICHERMOT 31969.85(31637.25)35910
EIDPARRY 314.5(320)185620
EIHOTEL 131.05(132.3)62639
ELECTCAST 28.8(29.95)402228
ELGIEQUIP 227.3(227.4)4316
EMAMILTD 1150.25(1151.25)141480
ENGINERSIN 159.7(159.55)1417285
EROSMEDIA 219.4(210)2411912
ESCORTS 672.7(671.1)1162293
ESSDEE 38.9(36.55)282720
ESSELPACK 250.25(247.6)80924
EVEREADY 310.1(303.1)1044374
EXIDEIND 215.7(215.8)2256570
FCONSUMER 42.2(41.25)2907750
FDC 179.95(176.2)77472
FEDERALBNK 114.5(114.25)5649172
FINCABLES 492.65(482.9)42595
FINPIPE 587.95(585.85)21566
FLFL 320.75(314.05)71686
FORTIS 164.15(166.35)8518218
FSL 35.6(34.15)2638847
GAIL 381.6(377.75)3238309
GATI 119.65(120.1)336213
GDL 270(270.1)321598
GEPIL 704.95(711.25)4709
GESHIP 385.2(386.4)34805
GET&D 375.65(371.65)106927
GILLETTE 5349.4(5325.25)1971
GLAXO 2399.8(2425.1)6545
GLENMARK 688.75(689.3)589918
GLOBOFFS 36.45(36.65)40831
GMDCLTD 139.85(137.5)338864
GMRINFRA 18.55(17.65)25559596
GODFRYPHLP 1050.45(1057.75)58416
GODREJCP 967.2(960.85)412422
GODREJIND 638(649.95)298077
GODREJPROP 504.4(494.4)233226
GPPL 142.1(139.9)354186
GRANULES 132.55(131.65)406133
GREAVESCOT 160(156.15)194630
GREENPLY 280.4(269.8)233333
GRINDWELL 411.15(407.6)15718
GRUH 508.65(503.8)111987
GSFC 126.4(136.25)2786308
GSKCONS 5458(5479.85)3182
GSPL 187.35(183.9)223082
GUJFLUORO 813.35(786.55)103180
GUJGASLTD 758.2(755)10339
GULFOILLUB 810.55(807)10946
GVKPIL 13.45(12.35)34524275
HATHWAY 32.4(32.45)73535
HAVELLS 494.9(492.55)882186
HCC 39.45(39.5)6557548
HCL-INSYS 47.1(47.2)482080
HCLTECH 886(890.65)823485
HDFC 1725.4(1731.35)2372097
HDFCBANK 1788.55(1790.25)479665
HDIL 69.25(75.75)36548682
HEIDELBERG 125.1(123.7)60886
HEROMOTOCO 3952.7(3956.55)644961
HEXAWARE 253.55(252.1)583922
HFCL 18.2(16.9)9707409
HIMATSEIDE 332.75(330.65)60359
HINDALCO 227.65(225.25)4951339
HINDCOPPER 61.95(62.25)835474
HINDPETRO 458.1(432.6)11129918
HINDUNILVR 1186.3(1192.1)868190
HINDZINC 285.15(285.9)1733736
HMT 36.2(37.05)2255
HMVL 269.55(269.95)17069
HONAUT 12653.25(12542.3)661
HOTELEELA 23.75(23.3)785877
HSIL 371.2(366.95)34434
HTMEDIA 87.3(86.45)104557
IBREALEST 266.15(247.6)23748707
IBULHSGFIN 1199.5(1213.2)578775
ICICIBANK 300.15(296.25)11870705
ICRA 3927.3(3925.7)674
IDBI 57.15(57)1115660
IDEA 93.05(92.7)4899324
IDFC 58.55(57.55)3173240
IFBIND 671.35(676.7)14018
IFCI 26(26.15)1634733
IGARASHI 957.9(959.35)7357
IGL 1196.4(1180.25)404513
IIFL 595.1(593.8)58506
IL&FSTRANS 88.95(88.7)173011
INDHOTEL 129.05(128)224778
INDIACEM 200.05(198.5)4338600
INDIANB 304.8(304.2)722067
INDOCO 200.45(200.15)7975
INDUSINDBK 1650.5(1664.7)386830
INEOSSTYRO 1003.7(1022.15)18027
INFRATEL 397.85(406.55)2453089
INFY 968.25(983.75)3036872
INGERRAND 830.8(844.8)7886
INOXLEISUR 246.05(249.4)102888
INOXWIND 139.45(136.85)271594
INTELLECT 105.05(107.6)260664
IOB 24.65(24.55)536042
IOC 431.2(418.95)8854820
IPAPPM 307.4(310.6)20519
IPCALAB 464(461.9)16630
IRB 225(221.2)1752474
ITC 279.85(280.75)8451267
J&KBANK 81.2(80.8)153012
JAGRAN 180.3(178.1)83088
JAICORPLTD 82.3(81.5)358048
JBCHEPHARM 301.8(305.15)73861
JBFIND 201.5(195.5)280483
JCHAC 2040.65(2033.95)4815
JETAIRWAYS 633.9(609.4)2693245
JINDALPOLY 411.4(400.7)119358
JINDALSTEL 143.55(138.35)14571995
JISLJALEQS 101.35(102.1)3651041
JKCEMENT 1026.45(1012.2)16821
JKIL 284.15(285.1)31331
JKLAKSHMI 446.1(449.55)96454
JKTYRE 165.95(160.2)2136007
JMFINANCIL 123.95(123.1)469359
JPASSOCIAT 28.95(25.35)155900716
JPINFRATEC 21.85(20.85)4874716
JPPOWER 7.5(7.2)16244586
JSWENERGY 69(68.25)5240877
JSWHL 1879.2(1878.25)7053
JUBILANT 699.85(698.1)188295
JUBLFOOD 1264.55(1279.3)352060
JUSTDIAL 373.85(352.5)3781635
JYOTHYLAB 384.55(384.4)75539
KALPATPOWR 353.55(357.95)30418
KANSAINER 455.55(446.45)125113
KEC 298.85(298.8)1595387
KESORAMIND 137(136.75)218577
KIRLOSENG 400(400.3)10809
KITEX 247.8(246.4)99367
KOLTEPATIL 160.1(159.4)66471
KOTAKBANK 997.9(996.2)619240
KPIT 123.3(124.1)692760
KRBL 468.75(455.6)179596
KSCL 693.8(697.65)482198
KSK 8(7.85)1844755
KTKBANK 154.9(148.7)2207205
KWALITY 139.25(134.15)680849
L&TFH 176.4(174)3878232
LAKSHVILAS 176.75(177.2)549659
LAOPALA 498.2(505.45)27226
LAXMIMACH 5891.85(5834.1)29019
LICHSGFIN 687.55(684.65)1963882
LITL 1.2(1.25)1314133
LT 1179.95(1175.85)1035670
LUPIN 985.05(992.8)1416550
M&M 1400.75(1418.05)1493977
M&MFIN 424.35(423.55)1569741
MAGMA 176.75(174.55)772456
MAHINDCIE 250.7(245.05)238084
MAHLIFE 429.15(421.3)26380
MANAPPURAM 106.3(102.8)8098109
MANPASAND 779.55(778.25)51101
MARICO 334.25(324.85)3052279
MARKSANS 41.3(40.35)1914981
MARUTI 7838.65(7770.3)327318
MAYURUNIQ 354.5(355.1)24692
MCDOWELL-N 2573.2(2596.1)271272
MCLEODRUSS 181(177.95)76722
MERCK 1258.65(1256.2)9883
MHRIL 382.7(369.7)51182
MINDACORP 107.9(108.55)112687
MINDTREE 483.2(471.05)357082
MMTC 58.1(58.65)350689
MOIL 343.85(335.5)150578
MONSANTO 2664.8(2691.3)4364
MOTHERSUMI 339.55(336.8)1479574
MOTILALOFS 1087.35(1086.15)106850
MPHASIS 599.2(597.7)37114
MRF 67821.2(66361.15)23514
MRPL 132.2(129.85)2665024
MTNL 19.45(19.5)614607
MUTHOOTFIN 474.35(461.75)645228
NATCOPHARM 960.9(949.5)607830
NATIONALUM 69.25(69.1)956234
NAUKRI 1038(1034.6)37780
NAVKARCORP 189.8(193.4)100017
NCC 90.15(86.95)6925876
NETWORK18 54.8(54.1)363435
NHPC 31(30.15)4128274
NIITTECH 499.6(502.8)278026
NITINFIRE 5.75(6)819094
NLCINDIA 99.5(98.4)182983
NMDC 125.75(125.2)1568811
NTPC 174.45(177.35)3630569
OBEROIRLTY 385.75(397.35)1851741
OFSS 3595.25(3603.25)8578
OIL 287.25(284.25)200014
OMAXE 204.3(203.95)572120
ONGC 165.9(166.4)3289743
ORIENTBANK 139.85(138.95)1277690
ORIENTCEM 154.9(155.05)78749
ORISSAMINE 1849.85(1822.25)3074
PAGEIND 16426.4(16375.2)4183
PARSVNATH 23.8(23)536468
PCJEWELLER 270.8(259.4)2920549
PEL 2963.5(2940.05)103363
PERSISTENT 621.6(637.9)39710
PETRONET 213(207.55)5043356
PFC 136.7(128.45)9487982
PFIZER 1798.35(1800.75)5490
PFS 41.1(40.15)1499123
PGHH 8099.25(8195.25)1126
PHOENIXLTD 498.85(481.35)25802
PIDILITIND 813.55(808.25)251391
PIIND 748.65(735.5)65234
PNB 152.1(151.05)5372108
POLARIS 240.25(233.5)137189
POWERGRID 225.95(224.6)2598508
PRAJIND 75.45(74.8)194255
PRESTIGE 264.85(272.9)84948
PRISMCEM 118.25(118.15)55869
PTC 123.35(117.7)3806190
PUNJLLOYD 21.45(21.35)1234994
PURVA 77.15(77.75)332502
PVR 1430.45(1400.2)290183
RADICO 151.45(145.6)805162
RAIN 132.8(129.25)1272494
RAJESHEXPO 739.35(740.15)281167
RALLIS 242.5(244.75)73738
RAMCOCEM 692(688.55)137188
RAMCOSYS 386.25(382.1)69679
RATNAMANI 839.6(833.55)30842
RAYMOND 776.95(769.15)165175
RCF 102.15(104.3)8242996
RCOM 23.9(23.3)10010204
RDEL 58.9(58.2)565107
RECLTD 181.3(174.15)7277590
REDINGTON 142.55(144.8)206447
RELAXO 487.45(456.95)99831
RELCAPITAL 781.4(744.1)5686320
RELIANCE 1616.35(1622.15)2180018
RELINFRA 542.2(530.45)1504888
RENUKA 19.3(18.85)9348959
REPCOHOME 700.45(767.35)1322353
RIIL 448.65(446.4)201837
RKFORGE 555(560.45)9763
ROLTA 56.5(56.4)266662
RPOWER 42.85(42.45)1636304
RTNPOWER 6.5(6.25)2487131
RUCHISOYA 23(23.15)391419
SADBHAV 289.2(288)37204
SADBHIN 102.1(102.85)3662
SAIL 62.4(61.7)3876935
SANOFI 4348.7(4285.15)12178
SBIN 311.2(305.25)11420767
SCHAEFFLER 4344.2(4294.85)401
SCHNEIDER 128.8(128.5)46710
SCI 88.75(89.1)2840605
SHARDACROP 450.55(450.05)9387
SHILPAMED 640.3(646.45)18693
SHK 263.55(264.9)24951
SHOPERSTOP 355.95(349.15)20396
SHREECEM 18122.85(18059.75)8372
SHRIRAMCIT 2155.75(2181.45)7792
SIEMENS 1359.55(1364.5)82168
SIMPLEXINF 476.75(454.8)17855
SINTEX 36.1(33.6)25027265
SITINET 25.5(25.5)479135
SJVN 33.2(33)320667
SKFINDIA 1559.75(1551.55)3756
SMLISUZU 998.9(982.15)38266
SNOWMAN 56.65(54.85)754530
SOBHA 384.2(386.35)276467
SOMANYCERA 757.05(757.3)8173
SONATSOFTW 156.75(160.05)247362
SOUTHBANK 29.25(29.25)4055767
SPARC 382.65(356.45)991576
SREINFRA 119.95(119.65)2264298
SRF 1543.95(1516.05)115795
SRTRANSFIN 988.1(992.15)414385
STAR 1045.85(1011.25)165223
STCINDIA 167.65(167.1)99554
SUNDARMFIN 1718.15(1687.85)195313
SUNDRMFAST 390.3(400.5)156499
SUNPHARMA 505.55(506.4)2279879
SUNTV 754.6(786.3)1869755
SUPREMEIND 1088.2(1106.1)17946
SUVEN 168.35(169.1)63096
SUZLON 17.3(17.65)44847538
SWANENERGY 131.25(127.75)282936
SYMPHONY 1385.3(1392.65)32187
SYNDIBANK 71.65(69.55)8480248
SYNGENE 470.65(463.85)42363
TAKE 142.9(150.15)162839
TATACHEM 607(606.35)352116
TATACOFFEE 127.8(127.15)189260
TATACOMM 651.3(641.35)389012
TATAELXSI 1733.15(1699.2)280500
TATAGLOBAL 170.45(166.45)2548868
TATAMOTORS 430(435.6)6461815
TATAMTRDVR 250.35(255)1556807
TATAPOWER 80(80.25)3124773
TATASPONGE 842.4(828.8)226789
TATASTEEL 600.05(575.85)11012930
TBZ 108.55(112.3)428383
TCS 2503.45(2522.8)942760
TECHM 406.35(409)1312508
TECHNO 368.65(366.3)19634
TEXRAIL 93.85(93)182335
THERMAX 907.05(904.95)6048
THOMASCOOK 222.9(222.4)129553
TIDEWATER 5871.9(5781.25)1210
TIMKEN 711.9(698.65)10856
TITAN 614.85(611.2)2467527
TNPL 354.1(363.9)128596
TORNTPHARM 1290(1276.25)66371
TORNTPOWER 201.6(187.25)5062608
TREEHOUSE 16(15.9)44230
TRIDENT 86.7(85.9)456725
TRITURBINE 138.9(136.95)36693
TTKPRESTIG 6296.65(6389.1)2192
TTML 7.55(7.45)2004125
TUBEINVEST 769.05(751.3)140554
TV18BRDCST 38.65(38.2)2401601
TVSMOTOR 602.9(599.3)598149
TVSSRICHAK 3610.05(3602.2)9044
TVTODAY 237.5(239.55)55107
UBL 823.05(815.7)135035
UCOBANK 32.55(32.45)198263
UFLEX 424.4(430.5)128964
ULTRACEMCO 4049.95(4081.35)159843
UNICHEMLAB 261.45(262.9)14209
UNIONBANK 146.35(145.1)2344223
UNITECH 8.8(8.25)65259055
UPL 877.65(887.05)664918
VAIBHAVGBL 513.8(526.2)5810
VAKRANGEE 462.55(448.7)976920
VEDL 287.7(288.85)5848430
VIDEOIND 22.65(23.05)471585
VIJAYABANK 67.35(67.7)597883
VINATIORGA 1080.25(1051.8)31849
VIPIND 199.6(194.3)371358
VOLTAS 536.85(541.7)784124
VRLLOG 348.3(343.45)279848
VSTIND 2901.55(2901.4)3370
VTL 1203.35(1202.1)37667
WABAG 624.75(623.15)34113
WABCOINDIA 5645.9(5690)2858
WELCORP 130.85(129.9)638463
WELSPUNIND 80.3(82.05)1322401
WHIRLPOOL 1193.5(1158.7)265263
WIPRO 287.75(289.4)1470499
WOCKPHARMA 599.65(599.75)404748
WONDERLA 347.35(345.55)17204
YESBANK 1799.85(1807.95)1331197
ZEEL 540.65(541.85)809866
ZEELEARN 43.95(43.85)120945
ZENSARTECH 791.5(784.95)211726
ZYDUSWELL 892.15(885.2)5623

హిందూజాని ఏం చేస్తారు?


పీపీఏ కొనసాగిస్తారా.. రద్దా?.. 14లోగా నిర్ణయం చెప్పండి

ఇంధన సంస్థలను కోరిన ఏపీఈఆర్‌సీ

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐరావతంగా మారనున్న హిందూజా పవర్ ప్లాంట్‌తో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని (పీపీఏ) కొనసాగించాలో.. రద్దు చేసుకోవాలో తేల్చుకోలేక రాష్ట్ర ఇంధన సంస్థలు తర్జనభర్జన పడుతున్నాయి. విశాఖ హిందూజా ప్లాంట్ నుంచి 1040 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఈ సంస్థలు గతంలోనే ప్రాథమికంగా కొనుగోలు ఒప్పందం చేసుకున్నాయి. ధరల విషయంలో పేచీ రావడంతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని ఆశ్రయించాయి. దీనిపై పలు దఫాలుగా ఉభయపక్షాల వాదనలు మండలి ఆలకించింది. ఈ నెల 15 తర్వాత తన తీర్పును వెల్లడించేందుకు సిద్ధమవుతూ.. 14వ తేదీ లోపు తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని ఇంధన సంస్థలను కోరింది. దీనిపై అవి న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నాయి. ఒకప్పుడు విద్యుత్ కొరత కారణంగా.. ముందూ వెనుకా ఆలోచించకుండా కరెంటు దొరికితే చాలన్నట్లుగా ఎడా పెడా కొనుగోలు ఒప్పందాలు చేసుకున్న ఇంధన సంస్థలు ఇప్పుడు మిగులు విద్యుత్ కారణంగా ఈ ఒప్పందాలను వదిలించుకోవాలని భావిస్తున్నాయి. ఇందుకు న్యాయపరమైన ప్రతిబంధకాలు ఎదురు కావడంతో తలలు పట్టుకుంటున్నాయి.

ఇదీ జరిగింది..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు హిందూజాకు చెందిన రెండు ప్లాంట్ల నుంచి 1040 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు రాష్ట్రంలోని నాలుగు డిస్కమ్‌లు ఒప్పందం చేసుకున్నాయి. రాష్ట్ర విభజన జరిగాక.. హిందూజా విద్యుత్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. హిందూజా విద్యుత్ తమదేనని ఏపీ ఇంధన సంస్థలు పేర్కొన్నాయి. అంతే కాకుండా హిందూజాతో సవరణ ఒప్పందం కూడా చేసుకున్నాయి. తీరా ఒప్పందం జరిగాక హిందూజా పేర్కొన్న ప్రాజెక్టు వ్యయం, యూనిట్ ధరను చూసి కంగుతిన్నాయి. యూనిట్ ధర రూ.4.96 పైసలని.. వీటికి అదనంగా ప్రసార, పంపిణీ నష్టాల కింద 41 పైసలు చెల్లించాలంటూ హిందూజా పేర్కొంది. ప్లాంటు పూర్తికి రూ.5623 కోట్లే అవుతుందని, పైగా నిర్మాణానికి ఎంతో ఆలస్యం చేసిందని ఏపీ ఇంధన సంస్థలు వాదిస్తున్నాయి. హుద్ హుద్ తుఫాను బీభత్సం, సకాలంలో భూములను అప్పగించకపోవడం వల్ల నిర్ణీత వ్యవధి కంటే.. 22 నెలలు ఆలస్యంగా ప్లాంటు పూర్తయిందని, ఈ కారణంగా వ్యయం పెరిగిందని.. ప్రాజెక్టు ఖర్చు రూ.8082 కోట్లకు చేరుకుందని హిందూజా అంటోంది. ఈ ప్రాజెక్టు ఆలస్యం కావడం వల్ల బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీగా రూ.1700 కోట్లు అదనంగా చెల్లించాల్సి వచ్చిందని, తుఫానుకు దెబ్బతినడం వల్ల రూ.105 కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెబుతోంది. అయితే.. ఆలస్యమైనందుకు బ్యాంకుల వడ్డీ భారం కింద రూ.450 కోట్ల మేర భరించేందుకు సిద్ధమని, రూ.1700 కోట్లు చెల్లించేది లేదని ఇంధన సంస్థలు స్పష్టం చేశాయి. తుఫాను నష్ట పరిహారం కింద బీమా కంపెనీల నుంచి ఎంత తీసుకున్నారో వెల్లడించాలని కోరాయి. హిందూజా చెబుతున్న యూనిట్ ధర రూ.4.96 చాలా అధికమని.. దీనికి ప్రసార నష్టాలు యూనిట్‌కు 41 పైసలు కలిపితే.. రూ.5.31కు చేరుతుందని.. ఇటీవల ఈస్ట్‌కోస్ట్ విద్యుత్ సంస్థ.. ప్రసార, పంపిణీ నష్టాలతో కలిపి యూనిట్‌ను రూ.4.27 చొప్పున అందిస్తామని



వచ్చిందని.. ఈ ధరతో పోల్చితే హిందూజా ధర చాలా ఎక్కువేనని ఇంధన సంస్థలు వాదించాయి. ఇంత ధరను తాము చెల్లించలేమని.. రూ.3.60కైతే సమ్మతిస్తామని పేర్కొన్నాయి. ఇందుకు హిందూజా అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 14లోగా ఏదో ఒక వైఖరిని వెల్లడించాలంటూ ఈఆర్‌సీ ఇంధన సంస్థలను కోరింది. కాగా.. ధర ఎక్కువని పీపీఏను రద్దు చేసుకుంటే.. న్యాయపరమైన చిక్కులు తప్పవని అధికారులు చెబుతున్నారు. పీపీఏను కొనసాగిస్తే భవిష్యత్‌లో కరెంటు చార్జీలను తగ్గించాలన్న సీఎం ఆదేశాన్ని అమలు చేయడం సాధ్యం కాదని ఆందోళన చెందుతున్నారు. దీంతో న్యాయ నిపుణుల సలహాను కోరారు. ఇదే సమయంలో గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులైన స్పెక్ట్రమ్, ల్యాంకో సంస్థలతో పీపీఏల గడువు ముగిసింది. ఒప్పందాల పునరుద్ధరణకు ఆయా సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని ఈఆర్‌సీ పరిశీలిస్తోంది. ఒప్పందాల పునరుద్ధరణకు అవకాశం లేదని తెలుస్తోంది.

---

50 మందిని చంపిన తాలిబన్, ఐఎస్

- నైజీరియా చర్చిలో కాల్పులు.. 12 మంది మృతి

కాబూల్/వర్రి, ఆగస్టు 7: వైరి వర్గాలైన తాలిబన్, ఐఎస్ ఉగ్రవాదులు ఏకమై ఆఫ్ఘనిస్థాన్‌లోని ఓ మారుమూల గ్రామంలో 50 మందికి పైగా అమాయక ప్రజలను హతమార్చారు. మృతుల్లో పురుషులు, మహిళలు సహా చిన్నారులు ఉన్నారు. ఎక్కువ మందిని కాల్చి చంపిన ఉగ్రవాదులు కొందరి తలలు నరికారు. రవాణా, సమాచార వ్యవస్థ లేని పర్వత ప్రాంతమైన సార్-ఎ-పుల్ ప్రావిన్స్‌లో సైనికులతో 48 గంటల పాటు హోరాహోరీ పోరాడి పైచేయి సాధించిన ఉగ్రవాదులు ఈ దమనకాండకు దిగారు. కాగా, నైజీరియాలోని ఓ చర్చిలో ఒక వ్యక్తి జరిపిన విచక్షణా రహిత కాల్పుల్లో 12 మంది చనిపోయారు. సెయింట్ ఫిలిప్స్ చర్చిలో ఉదయం 6 గంటలకు అకస్మాత్తుగా కాల్పుల శబ్దం వినిపించిందని, తేరుకునేలోపే పదుల సంఖ్యలో భక్తులు రక్తపు మడుగులో పడి ఉన్నారని ప్రత్యక్ష సాక్షి తెలిపారు. ఈ ఘటనలో 12 మంది చనిపోయారని అధికారికంగా చెప్పినప్పటికీ మృతుల సంఖ్య 20కి పైగా ఉంటుందని భక్తులు తెలిపారు. ఈ ప్రాంతంలో బొకోహారం ఉగ్రవాద సంస్థ ప్రభావం ఉంది. ఈ ఘటన వెనుక ఆ సంస్థ ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్, ఆగస్టు 7: పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర ముగిసింది. 40 రోజులు సాగిన ఈ యాత్రలో 2.60 లక్షల మంది యాత్రికులు మంచు లింగాన్ని దర్శించుకున్నారు. ఇంత తక్కువ సంఖ్యలో భక్తులు రావడం గత 14 ఏళ్లలో ఇది రెండోసారి. గత ఏడాది 2.20 లక్షల మంది భక్తులు అమర్‌నాథుణ్ని దర్శించుకున్నారు. కశ్మీర్‌లో పరిస్థితులు ప్రతికూలంగా ఉండడం వల్ల యాత్రికుల సంఖ్య తగ్గింది. ఏటా వర్షాకాల ఆరంభంలో ప్రారంభమయ్యే అమర్‌నాథ్ యాత్ర రక్షా బంధన్ రోజు ముగియడం ఆనవాయితీ. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జూన్ 29న ప్రారంభమైంది. హిమాలయాల్లోని ఒక మంచుగుహలో సహజసిద్ధంగా ఏర్పడే మంచులింగాన్ని ఏటా ఈ సీజన్‌లో మాత్రమే దర్శించుకునే వీలుంది.

అయోధ్యపై త్రిసభ్య ధర్మాసనం

- సుప్రీంకోర్టులో 11 నుంచి విచారణ



న్యూఢిల్లీ, ఆగస్టు 7: అయోధ్య భూమి వివాదంపై సుప్రీంకోర్టు ఈనెల 11నుంచి విచారణను ప్రారంభించనున్నది. దీనిపై వాదనలు వినేందుకు న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం ఏర్పాటయ్యింది. వివాదాస్పద భూమిపై అలహాబాద్ హైకోర్టు లఖనవూ బెంచి 2010లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుని సవాలు చేస్తూ దాఖలైన అనేక వ్యాజ్యాలను ఏడేళ్ల తర్వాత సుప్రీంకోర్టు విచారణ చేపట్టనున్నది. రామజన్మభూమి-బాబ్రీ మసీదు స్థలం యాజమాన్య హక్కులపై సుప్రీంకోర్టు ఇప్పుడు తుది తీర్పు ఇవ్వనున్నది. కాగా, అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని మూడు సమానభాగాలుగా విభజించుకుని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్ లల్లా సంస్థలు పంచుకోవాలని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై సంతృప్తి చెందని మూడు సంస్థలూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అయోధ్య కేసులో సత్వర విచారణకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని సీజే ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 21న ప్రకటించిన సంగతి తెలిసిందే.

బీచ్‌లో కాళ్లు పెడితే..
రంధ్రాలు పడ్డాయి

మెల్‌బోర్న్: కాళ్లు నొప్పెడుతున్నాయని, కాస్త ఉపశమనం కోసం కొద్దిసేపు బీచ్‌లో ఉంచాడు. ఇహ అంతే, చీల మండ భాగంలో వందల కొద్దీ సూక్ష్మ రంధ్రాలు. చూస్తుండగానే రక్తం ధారలుగా కారసాగింది. ఆస్ట్రేలియాకు చెందిన పదహారేళ్ల కుర్రాడు సామ్ కనిజే ఫుట్‌బాల్ ఆడగా, కాళ్లు విపరీతంగా నొప్పెట్టాయి. కొద్దిగా ఉపశమనం దొరుకుతుందని మెల్‌బోర్న్ బీచ్‌లోని సముద్రపు నీటిలో ఓ అరగంట పాటు కాళ్లు పెట్టాడు. దీంతో ఇలా జరిగింది. అతడిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, ఇలా ఎందుకు జరిగిందో వైద్యులకు కూడా అంతు చిక్కలేదు. సామ్ నాన్న ఓ వలలో కొన్ని మాంసం ముద్దలను తీసుకుని బీచ్‌కు వెళ్లాడు. ఆ మాంసాన్ని తిన్న పురుగులను ఆయన వీడియో తీశారు. కాగా, మాంసాన్ని తినే ఆంఫిపాడ్స్ వంటి కొన్ని సముద్ర పురుగుల వల్లే ఇలా అయి ఉంటుందని కొంత మంది నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆ పురుగులు జెల్లీ ఫిష్ లార్వా అయి ఉంటాయని వీడియోను చూసిన ఓ మెరైన్ నిపుణుడు తెలిపారు.

సర్వీస్ పీజీలకు మోక్షం లేదా?

- రెండున్నర నెలల క్రితం పూర్తైన కౌన్సెలింగ్
- ఇప్పటికీ రిలీవ్ చేయని డీఎంహెచ్‌వోలు
- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మంది వైద్యుల నిరీక్షణ

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ కోటాలో వైద్యవిద్యలో వారికి పీజీ సీట్లు వచ్చాయి. తమతోపాటు సీట్లు వచ్చిన ఇతర మెడికోలంతా మూడు నెలల క్రితమే ఆయా కళాశాలలు/ఆస్పత్రుల్లో చేరినా వారికింకా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సుమారు 300 మంది మెడికోలు రిలీవింగ్ ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నారు. పీజీ కౌన్సెలింగ్ పూర్తయి నెలలు గడుస్తున్నా, ఆయా జిల్లాల వైద్యాధికారులు రిలీవ్ చేయక పోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీజీ కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే సీట్లు పొందిన ప్రభుత్వ వైద్యులను రిలీవ్ చేయాలి. అయితే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డీఎంహెచ్‌వోలు వివిధ కారణాలతో దాదాపు మూడు నెలల నుంచి మెడికోలను రిలీవ్ చేయడం లేదు. ఇప్పటికైనా రిలీవ్ చేయాలని లేకపోతే, తమ భవిష్యత్తు దెబ్బతింటుందని వారు వాపోతున్నారు.

50శాతం ఇన్‌సర్వీస్ కోటా

మెడిసిన్ పీజీ సీట్లలో 50 శాతాన్ని ఇన్‌సర్వీస్ (ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వారికి) కోటాగా ప్రభుత్వం రిజర్వు చేసింది. రాష్ట్రంలోని మెడికల్ కళాశాల్లో 300 వరకు సర్వీస్ కోటా పీజీ సీట్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం రెండేళ్ల ఏజెన్సీ ప్రాంతంలో లేదా మూడేళ్ల గ్రామీణ ప్రాంతంలో లేదా నాలుగేళ్ల పట్టణ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించిన వారు సర్వీస్ కోటా సీట్లకు అర్హులు. వీరు కూడా పీజీ ప్రవేశ పరీక్ష రాయాలి. ప్రభుత్వ సర్వీసులో ఎంత ఎక్కువ కాలం పనిచేస్తే, అన్ని ఎక్కువ పాయింట్లు వస్తాయి. పీజీ ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కులతోపాటు, సర్వీసు పాయింట్లను కూడా పరిగణనలోకి తీసుకుని మెరిట్ ఆధారంగా పీజీ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సర్వీస్ కోటాలో సీటు పొంది, పీజీ చేసే వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజులను చెల్లిస్తుంది. పీజీ సీటు రాకముందు పనిచేసే ఆస్పత్రిలో ఎంత జీతం పొందే వారో అంతే మొత్తాన్ని పీజీ చేస్తున్న కాలంలో కూడా పొందే అవకాశముంది.



ఎదురుచూపులు

సాధారణ కోటా కింద పీజీలో చేరిన విద్యార్థులకు రెండున్నర నెలల క్రితమే క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. అయితే సర్వీస్ కోటాలో సీట్లు పొందిన వైద్యులు మాత్రం ఇంకా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలోనే సేవలు అందిస్తున్నారు. పీజీ సీట్లు పొందిన వైద్యులను రిలీవ్ చేయాల్సిన ఆయా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు తమకేమీ పట్టినట్టు వ్యవహరిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, తమను రిలీవ్ చేయాలని మెడికోలు కోరుతున్నారు.

త్వరలో అమరావతి డిక్లరేషన్

- స్పీకర్ కోడెల శివప్రసాదరావు



అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత సాధనకు రూపొందించిన అమరావతి డిక్లరేషన్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని స్పీకర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన మహిళలు, విద్యార్థినుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో ముసాయిదా డిక్లరేషన్‌లో మార్పులు, చేర్పులు చేశామని తెలిపారు. శాసనసభ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో అమరావతి డిక్లరేషన్‌పై కీలక సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరిలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ మహిళా పార్లమెంట్ అనంతరం సీఎం సూచనల మేరకు ఈ ప్రకటన రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళా సమస్యలను విస్తృత స్థాయిలో చర్చించి, డిక్లరేషన్‌కు తుదిరూపం ఇచ్చినట్లు వివరించారు. అన్నివిధాలా మహిళలకు సహాయపడే విధంగా ఒక బెంచ్‌మార్క్‌గా దీన్ని తయారు చేస్తున్నట్లు కోడెల తెలిపారు. అంతకుముందు ఇక్కడి సమావేశ మందిరంలో స్పీకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరావతి డిక్లరేషన్‌కు తుదిరూపం ఇచ్చారు. ప్రభుత్వంలోని ముఖ్య మహిళా అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన మహిళలు, విద్యార్థినులు పాల్గొని డిక్లరేషన్‌లోని పది అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అందరు అనుసరించే విధంగా, అన్ని రంగాల్లోనూ మహిళలు శక్తిమంతులుగా తయారయ్యేందుకు ఒక మార్గదర్శకంగా అమరావతి ప్రకటన ఉంటుందని ఈ సందర్భంగా స్పీకర్ తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు వచ్చి చర్చించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో మంత్రి పరిటాల సునీత, మాజీమంత్రి పీతల సుజాత పాల్గొన్నారు.

డిక్లరేషన్‌లోని 10 అంశాలివే...

స్త్రీ విద్య, మహిళల న్యాయపరమైన హక్కులు, మహిళల ఆరోగ్యం- సమతుల ఆహారం, పారిశ్రామిక రంగంలో మహిళలు, పరిశోధన- నూతన ఆవిష్కరణల్లో మహిళలు, రాజకీయాల్లో మహిళలు, మహిళల సామాజిక భద్రత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో మహిళల పాత్ర, మహిళల సామాజికాభివృద్ధి, డిజిటల్ విద్య.

పరిశ్రమలపై జీఎస్టీ అధ్యయనానికి కమిటీ

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలపై జీఎస్టీ ప్రభావంపై అధ్యయనానికి ఓ కమిటీ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాణిజ్య పన్నులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ కమిటీలో.. పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్, పరిశ్రమల శాఖ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనతో పాటు, ప్రస్తుతం ఉన్నవాటిపై జీఎస్టీ ప్రభావం ఏ విధంగా ఉంటుందో ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది.

3.4 కోట్లమందికి మశూచికం టీకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రుబెల్లా (మశూచికం/తట్టు) వ్యాధిని నివారించేందుకు కేంద్ర ఆరోగ్యశాఖ టీకాలు వేయనుంది. రెండో దశ భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మరో 6 రాష్ట్రాల్లో టీకాలు వేయబోతున్నామని సోమవారం కేంద్ర ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా 3.4 కోట్ల మంది పిల్లలకు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేసింది. స్కూళ్లు, కమ్యూనిటీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు అందుబాటులో ఉంటాయని వివరించింది. 9 నెలల నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలందరికి టీకాలు వేయించాలని ప్రభుత్వం సూచించింది.

జగన్ అరాచకవాది

- ఓటమి భయంతోనే నంద్యాలలో మకాం
- ఆయనపై నిఘా పెంచాలి
- వైసీపీ గుర్తింపు రద్దుచేయాలి
- రోజా మాటలు మహిళలూ వినలేరు
- టీడీపీ నేతల ధ్వజం

అమరావతి/పిఠాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యే రోజాపై రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ నేతలు మల్లెల లింగారెడ్డి, ఎస్వీఎస్ఎన్ వర్మ, వర్ల రామయ్య, బుద్ధా వెంకన్న, బచ్చుల అర్జునుడు విరుచుకుపడ్డారు. జగన్ అరాచకవాది అని, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని జవహర్ సోమవారం సచివాలయంలో విమర్శించారు. ఆయనకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే 10 రోజులు నంద్యాలలో ఉంటానని ప్రకటించారని ఎద్దేవాచేశారు. మంత్రి భూమా అఖిలప్రియ వస్త్రధారణపై రోజా చేసిన వ్యాఖ్యలను మహిళలే చీదరించుకుంటున్నారని తెలిపారు. అసాంఘిక శక్తిగా మారిన జగన్ కదలికలపై నిఘా ఉంచాలని టీడీపీ నేతలు వర్ల రామయ్య, వెంకన్న, అర్జునుడు డీజీపీ సాంబశివరావుకు ఇచ్చిన విజ్ఞాపనలో కోరారు. జగన్‌పై ఏపీ పోలీస్ మాన్యువల్ 6000-1 ఆర్డర్ ప్రకారం సస్పెక్ట్ షీట్ తెరవాలని కోరారు. నంద్యాల సభలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలని, ఆయన పార్టీ గుర్తింపు రద్దు చేయాలని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు రోజాను మహిళగా గుర్తించడం లేదని, సాటి మహిళలే ఆమె మాటలు వినలేక చెవులు మూస్కూకుంటున్నారని పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ వాఖ్యానించారు. రోజా బరితెగించి మాట్లాడుతున్న, వాడుతున్న భాష చూసి అందరూ సిగ్గుపడుతున్నారన్నారు. తాను నటించిన సినిమాల్లో వేసుకున్న వస్త్రాలను గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. ఆమె భాష, సంస్కృతి, మాట్లాడే విధానం జబర్దస్త్, రచ్చబండ తదితర టీవీ కార్యక్రమాల్లో బయటపడిందన్నారు. ఒక్కసారి తన కుటుంబ సభ్యులతో కలిసి వాటిని చూస్తే వారే చెప్పుతో కొడతారని వ్యాఖ్యానించారు. నాలుక ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మానుకోవాలని.. సభ్యత, సంస్కారం లేని మాటలను ప్రజలు పట్టించుకోరన్నారు.

జగన్ వ్యాఖ్యలు సరికాదు: విష్ణుకుమార్‌రాజు

కాకినాడ: నంద్యాల సభలో సీఎంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు, విశాఖ రూరల్ ఎమ్మెల్యే పెన్మత్స విష్ణుకుమార్‌రాజు ఖండించారు. జగన్ మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని కాకినాడలో హితవు పలికారు. ఒక్కో సమయంలో సభకు హాజరైనవారిని చూసి అత్యుత్సాహంతోనో లేక వేరే ప్రేరేపించే కారణాలతోనో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని, ఏదేమైనా జగన్ వ్యాఖ్యలు సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.

కొరకరాని జీఎస్టీ

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించింది. వాస్తవానికి సెప్టెంబరు ఒకటి నుంచి అమలు చేయాలని వ్యాపార, పారిశ్రామిక వర్గాలతో పాటు అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం కూడా కోరింది. సెప్టెంబర్ 15 దాటితే జీఎస్టీ బిల్లు చెల్లకుండా పోతుంది. దాంతో కథ మళ్లీ మొదటికొస్తుందన్న భయంతో ప్రభుత్వం వీటన్నింటినీ పెడచెవిన బెట్టింది.

ఎవరికీ పూర్తిగా తెలియదు

జీఎస్టీని జూలై 1 నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం తిరుగులేని నిర్ణయం తీసుకున్న నాటికి ఈ కొత్త పన్నుల వ్యవస్థపై అధికార యంత్రాంగంలోనే పూర్తి అవగాహన లేదు. సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్, రాష్ట్రాల్లోని వ్యాట్ అధికారుల్లో అయోమయమే ఉంది. నియమ నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన లేదు. స్టేక్ హోల్డర్ల మద్దతు కూడగట్టే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చార్టర్డ్ అకౌంటెంట్లు, ఉత్పత్తులు, సర్వీసుల రంగంలోని చిన్న వ్యాపారులు, టాక్స్ కన్సల్టెంట్స్, వినియోగదారుల సంఘాల్లోని అసంతృప్తి నెల రోజులు దాటినా కొనసాగుతోంది. బిజినెస్ వర్గాలు, వృత్తి నిపుణుల సంఘాలు చేసిన నిర్మాణాత్మక సూచనలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదన్న విమర్శలున్నాయి. అన్నింటిని మించి టెక్నాలజీ బ్యాక్ బోన్ సంసిద్ధత కూడా ప్రశ్నార్థకంగానే ఉంది. జీఎస్టీ నెట్‌వర్క్‌లో ప్రైవేట్ సంస్థలకు మెజార్టీ వాటాలు ఉండటంపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. జీఎస్టీతో పాటే అమల్లోకి తేవాల్సిన యాంటీ ప్రాఫిటీరింగ్ చట్టం ఇంకా రూపుదిద్దుకోనేలేదు. వినియోగదారుల హక్కుల రక్షణ ప్రస్తుతానికి గాలికి వదిలినట్టుగానే ఉంది.

బరువు జనంపై... భయం వ్యాపారుల్లో

నిజానికి పరోక్ష పన్నుల భారం వినియోగదారులపై ఉంటుంది. వ్యాపారులకు పోయేదేమీ లేదు. జీఎస్టీ పేరుతో జరిగిన హంగామా కారణంగా అనవసరంగా ట్రేడర్లను ప్రభుత్వం హడలగొట్టింది. బడా కార్పొరేట్ సంస్థలను, స్టాక్ మార్కెట్లను, స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న ఎఫ్ఐఐలను అలరించేందుకు ప్రయత్నించింది. ఇప్పటి వరకు కేవలం రాష్ట్ర ప్రభుత్వ టాక్స్ అధికారులతో డీల్ చేసిన చిన్నవ్యాపారుల్లో, ఒక్కసారిగా కేంద్రం దృష్టిలో పడటం వల్ల కొంత అసహనం, బెరుకు ఉంటాయి. ఈ మానసిక సమస్యలను అర్థం చేసుకోలేదు. కాగా, బడా కార్పొరేట్ సంస్థలు మాత్రమే జీఎస్టీ పట్ల సంతోషంగా ఉన్నాయి. అసంఖ్యాకులైన చిన్న ట్రేడర్లు, ఉత్పత్తిదారులు, ముఖ్యంగా అసంఘటిత రంగంలోని వారు జీఎస్టీ దెబ్బకు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. వ్యాపారులను వేధింపులకు గురిచేసే అనేక అధికారాలను జీఎస్టీని అమలుచేసే అధికార యంత్రాంగానికి కట్టబెట్టారు. అసలే అంతంత మాత్రం అవగాహన, దానికి తోడు అపరిమిత అధికారాలు. పర్యవసానాలు ఎలా ఉంటాయో అన్న భయం చిన్న వ్యాపారుల్లో ఉంది. అపరిమిత విచక్షణాధికారాలు అవినీతి పెరుగుదలకు దోహదం చేస్తాయన్న విమర్శలున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన నెల రోజుల్లోనే జీఎస్టీ కౌన్సిల్ అధికారి ఒకరు అవినీతి శాఖకు పట్టుబడ్డాడు. ఈ భయాలను తొలిగించే ప్రయత్నాలు జరగడమే లేదు.

ఆకట్టుకోని కాంపోజిషన్ స్కీమ్

జీఎస్టీలో భాగంగా చిన్న వ్యాపారుల కోసం కాంపోజిషన్ స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. 20 లక్షల రూపాయల నుంచి 75 లక్షల రూపాయల మధ్య టర్నోవర్ ఉన్న లోకల్ వ్యాపారులు ఈ పథకం కింద నమోదు చేసుకుంటే అనేక వెసులుబాట్లు లభిస్తాయి.రిటర్న్స్ ఫైల్ చేయడంలోని ఇబ్బందులు ఉండవు. 75 లక్షల రూపాయల లోపు టర్నోవర్ ఉన్న ఉత్పత్తిదారులు(ఐస్‌క్రీమ్, పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులు మినహాయించి) టర్నోవర్‌పై 2 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది. రెస్టారెంట్ సర్వీసులకు దీనిని 5 శాతంగా, ట్రేడర్స్‌కు 1 శాతంగా నిర్ణయించారు. చిన్న వ్యాపారుల కోసం రూపొందించిన ఈ స్కీమ్‌కు స్పందనేలేదు. జూలై 16 లోగా కాంపోజిషన్ స్కీమ్‌కు ఆప్ట్ చేసుకోవాలని అడిగారు. 70 లక్షల మంది జీఎస్టీ కింద నమోదు చేసుకుంటే అందులో లక్ష మంది కూడా ఇప్పటివరకు కాంపోజిట్ స్కీమ్ కింద నమోదు చేసుకోలేదు. ప్రభుత్వ వర్గాలు కూడా తీవ్రంగా ఆశ్చర్యపోయాయి. బలహీనమైన ఈ ప్రతిస్పందన వల్ల గడువును ఆగస్టు 16 వరకు పొడిగించారు. ఆగస్టు మొదటివారంలో ప్రభుత్వ వర్గాలు ఇచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటికి ఐదు లక్షల మంది కాంపోజిషన్ స్కీమ్‌లో చేరినట్టుగా తెలుస్తోంది. ఇది కూడా చాలా తక్కువ. చిన్న వ్యాపారుల కోసం ఉద్దేశించినట్టుగా చెబుతున్న ఈ స్కీమ్ చిన్న వ్యాపారులను ఎందుకు ఆకట్టుకోలేకపోతున్నదీ ఎవరికీ అర్థం కావడం లేదు.

అభివృద్ధి సూచీలు కిందకు!

జీఎస్టీ అమల్లోకి వచ్చిన తొలి నెల జూలైలో ఆర్థిక రంగంలోని పరిణామాలు ప్రోత్సాహకరంగా ఏమీలేవు. పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించిన పర్చేజ్ మేనేజర్స్ సూచీ, సర్వీసుల రంగానికి సంబంధించిన సూచీ కూడా అధోగమనంలో ఉన్నాయి. ఈ రెండు కీలక విభాగాల్లోనూ అధోగమనానికి కారణం జీఎస్టీయేనని చెబుతున్నారు. రానున్న నెలల్లో కూడా పరిస్థితి ఏమంత మెరుగ్గా ఉండకపోవచ్చన్న అంచనాలున్నాయి. తొలి ఏడాది జీడీపీపై జీఎస్టీ ప్రభావం ఎలా ఉంటుందన్న అంశం ఆసక్తికరంగా మారింది.

నంద్యాల టెన్షన్!

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేయడంతో హైడ్రామా చోటు చేసుకుంది. రిటర్నింగ్ అధికారి (ఆర్వో), కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఏ నిర్ణయం తీసుకుంటారోనని రెండు పార్టీలు టెన్షన్ పడ్డాయి. చివరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ సలహా మేరకు ఇరువురి నామినేషన్లను ఆర్వో ఆమోదించడంతో ఉత్కంఠకు తెరపడింది. నంద్యాల ఉప ఎన్నిక నామినేషన్ల ఘట్టం ఈ నెల 5వ తేదీన ముగిసింది. 30 మంది అభ్యర్థులు 41 నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వాటి పరిశీలన చేపట్టారు. వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఒక నామినేషన్‌లో జ్యుడీషియల్ స్టాంప్ ఉంది. మరో నామినేషన్‌లో అది లేదని, అలాగే నోటరీ చేసిన అడ్వకేట్ రామతులసిరెడ్డి నోటరీ లైసెన్సు 2013 డిసెంబరుతోనే ముగిసిందని, ఆ నామినేషన్ చెల్లదని టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తరపున హాజరైన న్యాయవాది రామచంద్రరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. నోటరీ లైసెన్సు కాలపరిమితి ముగిసిందని జిల్లా రిజిస్ట్రార్ ఇచ్చిన పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి అందజేశారు. దీంతో శిల్పా నామినేషన్ చెల్లుబాటుపై ఒక్కసారిగా ఉత్కంఠ మొదలైంది. అదే సమయంలో... వైసీపీ నేతలు బ్రహ్మానంద రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఆయన ఐటీ రిటర్న్స్ చూపలేదని, నామినేషన్‌ను తిరస్కరించాలని వైసీపీ తరపు న్యాయవాది టి.తులసిరెడ్డి వాదించారు. ఇద్దరి అభ్యంతరాలను రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ పరిశీలనకు ఆర్వో పంపారు. ఈసీ ఆదేశాల మేరకు సాయంత్రం 5 గంటలకు అభ్యంతరాలపై వాదనలు విన్నారు. చివరికి... వారిద్దరి నామినేషన్లు చెల్లుతాయని స్పష్టం చేశారు. దీంతో ఉత్కంఠకు తెరపడింది. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. అంతకుముందు టీడీపీ, వైసీపీ నేతలు పలువురు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద మోహరించారు. పోలీసులు కూడా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నంద్యాలలో తలపడేందుకు 30 మంది అభ్యర్థులు 41 నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ తరపున రెండో అభ్యర్థిగా నామినేషన్ వేసిన భూమా నాగమౌనికారెడ్డి, వైసీపీ రెండో అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, ఎంఐఎం అభ్యర్థి పి.వెంకట నారాయణరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన చాకలి పుల్లయ్య, సుదర్శన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి రామరాజు నామినేషన్లను (మొత్తం 6) ఆర్వో సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. 24 మంది అభ్యర్థుల పత్రాలను ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు 9వ తేదీ. ఇక... ఉప ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున అదనపు బలగాలను తరలించాలని ఆదేశించినట్లు భన్వర్‌లాల్ చెప్పారు. అవసరమైన ప్రాంతా ల్లో సాయుధ పోలీసులను నియమించాలని ఆదేశించారు.

చేనేత సొబగులు!



జాతీయ చేనేత దినోత్సవ సభ వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

చేనేతకు 'సంక్రాంతి'!

- చంద్రన్న కానుకలో వస్త్రాల పంపిణీ
- తెల్లకార్డుపై పంచె, ధోవతి, చీరలు
- జీఎస్టీ తొలగింపు కోసం కేంద్రంతో పోరు
- చేనేత దినోత్సవ సభలో అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు యేటా చంద్రన్న కానుకలను అందుకొంటున్నవారికి మరో శుభవార్త! ఈ కానుకలు ఈసారి మరింత బరువెక్కనున్నాయి. తెల్లకార్డుదారులకు, ఈ కానుకలతోపాటు పంచె, ధోవతి, చీరలనూ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడం కోసమే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చేనేత జౌళిశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. నేత కార్మికులు అమ్ముకోగా మిగిలిన స్టాకుని డిసెంబరు నుంచి కొనుగోలు చేసి.. కానుకలతోపాటు అందిస్తామని వివరించారు. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవసభలో మంత్రి ప్రసంగించారు. "చేనేత రంగానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారం ఇబ్బందిపెడుతోంది. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీతో సీఎం మాట్లాడారు. అయితే తగిన స్పందన రాలేదు. త్వరలో ముఖ్యమంత్రి, ఎంపీలు, నేను ప్రధానిని కలుస్తాం. అప్పటికీ కదలిక లేకపోతే చేనేత కార్మికులను కలుపుకొని, కేంద్రంపై పోరాటానికి సిద్ధమవుతాం" అని వివరించారు. చేనేతకి మార్కెటింగ్ సౌకర్యం మరింత మెరుగుపరచడంతోపాటు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ఆలోచనలు చేస్తున్నట్టు తెలిపారు. చుట్టుపుచూపు నేతలు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. నేత రంగంపై జీఎస్టీ ప్రభావం బండలా పడిందని, కేంద్రాన్ని ఒప్పించే శక్తి తమకు(టీడీపీ ఎంపీలు) చాలడంలేదని, సీఎం శక్తికూడా తోడైతేనే ఫలితం ఉంటుందని హిందూపురం ఎంపీ నిమ్మల కిష్టప్ప అన్నారు.



చేనేత వస్త్ర ప్రదర్శనలో యువతి హొయలు

రాష్ట్రంలో నాలుగు ఫార్మా క్లస్టర్లు

- పులివెందుల, విశాఖ, కృష్ణపట్నం, నాయుడుపేటలో ఏర్పాటు: చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రాత్రి రాష్ట్రంలో ఫార్మా పరిశ్రమ ఏర్పాటుపై పరిశ్రమల శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధితో సహా ఉపాధి కల్పనలో ఫార్మా రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్రంలో ఫార్మా రంగం విస్తరించేందుకు విస్తృత అకాశాలున్నాయని చెప్పారు. పులివెందులలో పశుసంవర్థక శాఖ నిర్మించిన భవన సముదాయంలో ఫార్మా క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని ఇండస్ట్రియల్ పార్కులో, కృష్ణపట్నంలో, విశాఖ జిల్లా అచ్యుతాపురంలోనూ ఫార్మా క్లస్టర్లను అభివృద్ధి చేయాలన్నారు. ప్రకాశం జిల్లా డిండిలో ఏర్పాటు చేయదలచిన ఫార్మా క్లస్టర్‌పై అడ్వకేట్ జనరల్ నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటించేలా చూడాలన్నారు. ఈ ప్రాంతంలో ఫార్మా క్లస్టర్ కోసం ఇప్పటికే పర్యావరణ అనుమతులు ఉన్నందున న్యాయపరమైన ప్రతిబంధకాలు లేకుండా చూడాలని సూచించారు. ఇక్కడ కార్యకలాపాలు చేపట్టేందుకు గతంలో వాన్‌పిక్ సంస్థకు భూములు ఇవ్వడం, దానిపై దర్యాప్తులు జరుగుతుండటం వంటి కారణాల నేపథ్యంలో విశ్లేషణాత్మకంగా సమీక్షించాలన్నారు. ఫార్మా కోసం ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటుచేసి, నోడల్ అధికారిని నియమించాలని సీఎం సూచించారు. విశాఖ రాంకీ ఫార్మాలో నిబంధనల అతిక్రమణల గురించి వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని, అతిక్రమణలుంటే కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు.

3 నెలలు.. 28 ప్రాజెక్టులు!

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం పనులను పరిశీలించారు. "రాబోయే 3 నెలల వ్యవధిలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఉన్న 28 ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభిస్తాం. దీనిలో తిరుగులేదు. నీటి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. పోలవరాన్ని 2019కి పూర్తిచేస్తాం. 2018నాటికి గ్రావిటీ ద్వారా నీళ్లిస్తాం. ఈలోపే పట్టిసీమ పూర్తిచేసి కృష్ణా డెల్టాలో 14 లక్షల ఆయకట్టును స్థిరీకరించాం. ఈనెల 15న పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ప్రారంభిస్తున్నాం. త్వరలో చింతలపూడి పథకాన్ని పూర్తి చేస్తాం. ప్రతి ఎకరాకు నీరందివ్వడమే నా జీవితాశయం" అని చంద్రబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్మించడాన్ని కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని విపక్షానికి చురకలు అంటించారు. "కొందరు అడ్డుకోవాలని చూస్తుంటే, మరికొందరు అభినందిస్తున్నారు. పనులు బాగా జరుగుతున్నాయని సీపీఐ నారాయణ, లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ మెచ్చుకున్నారు" అని తెలిపారు. పురుషోత్తపట్నం పంప్ హౌస్ నిర్మాణానికి రైతులందరూ సహకరించినా... ఒక్క వ్యక్తి అడ్డుపడ్డారని అన్నారు. "పోలవరం ప్రాజెక్టుకు 16 వేల కోట్లు ఖర్చువుతుండగా... భూసేకరణ, పునరావాసానికే 32వేల కోట్లదాకా ఖర్చు అవుతున్నాయి. నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం" అని అన్నారు.



ఏఈ పోస్టుకు ఎంపికైన యువ ఇంజనీర్‌కు నియామక పత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు



వర్షంలోనే పోలవరం సందర్శన

ఇది మీ అదృష్టం!

- కొత్త ఇంజనీర్లకు సీఎం అభినందనలు

ఏపీపీఎస్సీ ద్వారా ఏఈ పోస్టులకు ఎంపికైన 518 మందికి సీఎం నియామక పత్రాలు అందించారు. పోలవరం ప్రాజెక్టు ప్రత్యేకతను వారికి వివరించారు. "గత పదేళ్లుగా ఒక్క ఇంజనీర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఇప్పుడు ఒకేసారి 518 మందిని నియమించాం. పోలవరంలో నియామకపత్రాలు అందిస్తున్నాం. ఇలాంటి ప్రాజెక్టు దేశంలో మరెక్కడా లేదు. ఇక్కడి నుంచే మీ ఉద్యోగ ప్రస్థానం మొదలవుతోంది. ఇది మీ అదృష్టం" అని అని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఇంజనీరు నీటి భద్రతకు అనుగుణంగా అడుగులు వేయాలన్నారు.

తప్పులు సరిదిద్దాం...

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు గోదావరి జలాలను వినియోగించుకునేందుకే పట్టిసీమను నిర్మించామని సీఎం తెలిపా రు. "పూర్వీకులు చేసిన తప్పిదాల వల్ల నష్టపోయాం. మహారాష్ట్ర, కర్ణాటకను దాటుకుని జూరాలకు.. ఆ తర్వాత శ్రీశైలానికి కృష్ణా జలాలు రావాలి. అక్కడ దామాషా ప్రకారం తెలంగాణ, ఏపీ పంచుకోవాలి. తాగునీటికీ సమస్య ఏర్పడే పరిస్థితి. కానీ.. పట్టిసీమ ద్వారా తొలి ఏడాది 6, 7 టీఎంసీలతో కృష్ణా ఆయకట్టును స్థిరీకరించాం. ఈ ఏడాది 54 టీఎంసీలతో మెరుగుపరిచాం. ఈ ఏడాది జూన్‌లోనే కృష్ణా డెల్టాకు, గోదావరి జిల్లాలకు నీరిచ్చాం" అని చంద్రబాబు వివరించారు. గత ఏడాది రబీకి కూడా నీరివ్వగలిగామన్నారు. ఇప్పుడు ఖరీఫ్‌కు జూన్‌లోనే నీరివ్వడం వల్ల తుఫాన్లకు ముందే పంట చేతికొస్తుందని... ముందస్తు రబీకి అవకాశముంటుందని చెప్పారు.

వర్షంలోనే పనుల పరిశీలన

సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు గంటపాటు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పనులను సీఎం పరిశీలించారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో పోలవరం చేరుకున్నారు. అప్పటికే వర్షం మొదలైంది. కొన్ని నిమిషాలపాటు ప్రత్యేక వాహనంలో నిరీక్షించిన ముఖ్యమంత్రి... ఆ తర్వాత వర్షంలోనే ప్రాజెక్టు పనుల పరిశీలనకు బయలుదేరారు. స్పిల్ పనులు సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. స్పిల్‌వే ఎగువ, దిగువ ప్రాంతాల్లోను ఆయన పర్యటన వానలోనే సాగింది.

అనుసంధానమే మార్గం...

"రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య జల యుద్ధాలు జరుగుతున్నాయి. కావేరీ జలాల విషయంలో ఇదే జరిగింది. ఈ సమస్యకు పరిష్కారం నదుల అనుసంధానం ఒక్కటే" అని చంద్రబాబు తెలిపారు. కృష్ణా నది ఎగువన అనేక ప్రాజెక్టులు కట్టడంతో... దిగువన నాల్గవ రాష్ట్రంగా ఉన్న మనకు జలాల లభ్యత పూర్తిగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ సమయానికి ప్రాజెక్టుల్లో నీరు చేరాలి. కానీ... శ్రీశైలం, నాగార్జునసాగర్ ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. అయితే... పట్టిసీమవల్ల కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వగలిగాం. అందరికీ నీటి భద్రత ఇవ్వాలి. నీళ్లు ఉంటే సంపద సృష్టించవచ్చు. అందుకే పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు రేయింబవళ్లు కష్టపడుతున్నాం" చంద్రబాబు చెప్పారు.

15 నుంచి పురుషోత్తపట్నం నీరు

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఈనెల 15న రెండు పంపుల ద్వారా పోలవరం ఎడమ ప్రధాన కాల్వలోకి గోదావరి జలాలను ఎత్తిపోస్తామని చంద్రబాబు తెలిపారు. "పురుషోత్తపట్నం వద్ద పది పంపులు నిర్మించాలి. పనులు జోరుగా సాగుతున్నాయి. బీహెచ్ఈఎల్ మోటార్లు ఇవ్వడంలో జాప్యం జరిగింది. లేకుంటే మరింత ముందే పనులు పూర్తయ్యేవి" అని తెలిపారు.

పవన్ గోడమీద పిల్లి

- బాబు కలియుగ యముడు: రోజా



మంగళగిరి, ఆగస్టు 7: ఏపీ సీఎం చంద్రబాబును కలియుగ యముడుగాను, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గోడమీద పిల్లిగాను వైసీపీ ఎమ్మెల్యే రోజా అభివర్ణించారు. వైసీపీ చేనేత విభాగం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం జరిగిన 'జాతీయ చేనేత సదస్సు'కు రోజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "చేనేత కార్మికులది అలనాడు యముడినే ఎదిరించిన వంశం. ప్రస్తుతం కలియుగ యముడైన సీఎం చంద్రబాబును ఎదిరించడం పెద్ద విషయం కాదు" అని అన్నారు. చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించుకున్న పవన్ ఆ తర్వాత ఏమయ్యారని ప్రశ్నించారు. ఇటీవల చంద్రబాబును రహస్యంగా కలిసి గోడ మీద పిల్లిలా మారిపోయారని ఎద్దేవా చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పుష్పరాజ్

అందరికీ ఆహార భద్రతే లక్ష్యం

- ఆహార కమిషన్ చైర్మన్ పుష్పరాజ్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ జేఆర్ పుష్పరాజ్ అన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన ఆహార కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు ఎన్.విజయ్‌కుమార్(చిత్తూరు), జి.కృష్ణమ్మ(కర్నూలు), డాక్టర్ స్వర్ణగీత(ప్రకాశం), ఎల్.వెంకట్రావు(విశాఖ), ఎన్.శ్రీనివాసరావు(తూర్పు గోదావరి) సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పుష్పరాజ్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఆర్ఎం తరగతుల ప్రారంభం

- ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతాం: చాన్సలర్

మంగళగిరి రూరల్, ఆగస్టు 7: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో నూతనంగా ఏర్పాటైన ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో సోమవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ఎస్ఆర్ఎం విద్యాసంస్థల వ్యవస్థాపక చాన్సెలర్ డాక్టర్ టిఆర్ ముత్తు తరగతులను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ప్రోత్సాహంతోనే అమరావతిలో 150 రోజుల్లో వర్సిటీ నిర్మాణం పూర్తి చేయగలిగామని చెప్పా రు. ఈ వర్సిటీని ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని పచ్చముత్తు తెలిపారు.

నేడు జెన్కో ట్రాన్స్‌కో భవనాలు ప్రారంభం



విజయవాడలోని గుణదలలో నిర్మించిన విద్యుత్‌సౌధ

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గుణదలలో ఏపీ ఇంధన సంస్థలు నిర్మించిన విద్యుత్తు సౌధలోని ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్కో భవన సముదాయాలు మంగళవారం రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సీఎం చంద్రబాబు వీటిని ప్రారంభిస్తారు.

చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అంబికా

అమరావతి: రాష్ట్ర చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అంబికా కృష్ణను ప్రభుత్వం నియమించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు నియోజకవర్గం నుంచి గతంలో ఈయన శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.

బడికి సర్కారు బాసట

- మౌలిక వసతులకు 4848 కోట్లు
- త్వరలో టెండర్లకు ఆహ్వానం

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలుగనుంది. రానున్న రెండేళ్ల వ్యవధిలో రూ.4848 కోట్ల వ్యయంతో అన్ని స్కూళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రంగం సిద్ధమైంది. ప్రహరీ గోడలు, బయో ఫెన్సింగ్, అదనపు తరగతి గదులు, లైబ్రరీ గదులు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్ తదితర వసతులు కల్పిస్తారు. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. దీంతో పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో తొలిసారిగా 'హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం)' విధానంలో కాంట్రాక్టు సంస్థలకు పనులను అప్పగించనున్నారు. ప్రస్తుతం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) పనుల్లో ఈ విధానం అమలవుతోంది. దీనికి కేంద్రప్రభుత్వం కూడా పూర్తి సానుకూలత వ్యక్తం చేసింది.

ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా.. ఈ కొత్త విధానాన్ని విద్యాశాఖలో వర్తింపజేసేందుకు మానవ వనరుల అభివృద్ధి మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పాఠశాలలను పలు ప్యాకేజీలుగా విభజించి పనులు కేటాయిస్తారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. 60 శాతం నిధుల్ని కాంట్రాక్టరు సమకూర్చుకుని ఖర్చుచేయాలి. 2017-18 నుంచి 2024-25 విద్యా సంవత్సరాల్లో అంటే ఎనిమిదేళ్లలో ప్రభుత్వం కాంట్రాక్టరుకు చెల్లింపులు చేయాలి. రిజర్వు బ్యాంకు వడ్డీ 6.5 శాతంతో పాటు యాన్యుటీ కింద మరో 3శాతాన్ని కలిపి అంటే మొత్తం మీద ఖర్చుచేసిన వ్యయానికి 9.5 శాతం వడ్డీతో ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రాజెక్టు వ్యయం రూ.4848 కోట్లలో 40 శాతాన్ని మొదటి మూడేళ్లలో ప్రభుత్వం తన వాటాగా సమకూరుస్తుంది. 2017-18, 2018-19, 2019-20లలో రూ.550 కోట్ల చొప్పున రూ.1650 కోట్లు, తర్వాత వరుసగా 2020-21లో రూ.734 కోట్లు, 2021-22లో రూ.687 కోట్లు, 2022-23లో రూ.640 కోట్లు, 2023-24లో రూ.592 కోట్లు, 2024-25లో రూ.545 కోట్లు.. మొత్తం రూ.3198 కోట్లను కాంట్రాక్టరుకు చెల్లిస్తుంది. త్వరలోనే వీటికి టెండర్లు ఆహ్వానించనున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఫిల్మ్ చాంబర్ క్షమాపణ చెప్పడం తప్పు

- డ్రగ్స్ కేసులో ఎవరి నేరమూ రుజువు కాలేదు: వర్మ లేఖ



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసు విషయంలో తొలినుంచీ సంచలన వ్యాఖ్యలు చేస్తున్న దర్శకుడు రాంగోపాల్ వర్మ మరోసారి స్పందించారు. తెలుగు చిత్ర పరిశ్రమ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. 'అతి కొద్ది మంది చేసిన పొరపాట్లకు ఒక పరిశ్రమ తలదించుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరం' అంటూ టాలీవుడ్ పెద్దలు ప్రభుత్వానికి లేఖ రాయడంపై వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారికి ఆయన బహిరంగ లేఖ రాశారు. 'అసలు వాళ్లు చేసిన నేరమేంటో, దానికి సంబంధించిన ఆధారాలేంటో కూడా చెప్పకుండానే.. వాళ్లు అప్పుడే ఏదో మహానేరం చేసినట్లు కలర్ ఇచ్చిన అధికారులపై ఆగ్రహించకుండా అప్పుడే నేరం రుజువైందనే ధోరణిలో క్షమాపణ లేఖ పంపించడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. నోటీసులందుకొని విచారణకు హాజరైన వారిలో ఓ ఒక్కరూ తాము తప్పు చేసినట్లు బహిరంగంగా చెప్పలేదని, అలాగే ఫలానా వారు చేసిన తప్పు రుజువైందని అధికారులు కూడా చెప్పలేదన్నారు. విచారణకు హాజరైనవారు.. తమపై వచ్చిన ఆరోపణలపై నోరు విప్పాలన్నారు. కేసులో వీళ్ల తప్పు లేదని తెలిస్తే అధికారులకు క్షమాపణ లేఖ రాసినట్లే వీరందరికీ ఫిల్మ్ చాంబర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో డ్రగ్స్‌పై కన్నేయండి: మంత్రి గంటా



విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని పలు పాఠశాల ల్లో మత్తుమందుల వినియోగం జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మధురానగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం మంత్రి ఆ పాఠశాలను పరిశీలించి, తరగతి గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈవ్‌టీజింగ్, మత్తుమందుల వినియోగం జరుగుతున్నట్టు తనకు సమాచారం వచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి ఫోన్ నంబర్ ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, గైర్హాజరైనవారి గురించి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని ఆదేశించారు.

మా సర్కారు ఆడబిడ్డలకు 'రక్షా' కవచం: సీఎం

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు రక్షాబంధన్ శుభాకాంక్షలు చెప్పారు. రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో పలువురు మహిళా నేతలు సీఎంకు రాఖీ కట్టారు. రాష్ట్ర మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత, పార్టీ మహిళాధ్యక్షురాలు శోభా హైమావతి, కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ అనూరాధ, ఆచంట సునీత, బ్రహ్మకుమారీలు, తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు సీతక్క, దూలం రాధిక రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మమతాను రాగాలకు, ప్రేమానుబంధాలకు నిదర్శనం రాఖీ పండుగ అని అభివర్ణించారు. ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం రక్షాకవచంలా ఉంటుందని ఆయన అభయమిచ్చారు. ఆపదలో ఉన్న మహిళల కోసం అభయహస్తం యాప్‌ను రూపొందించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈవ్‌టీజింగ్ చేసే వారిపై, మహిళలను వేధించే వారిపై కఠిన తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై గౌరవం పెరిగేలాగా అమ్మకి వందనం కార్యక్రమం చేపట్టనున్నామని సీఎం తెలిపారు.

ఐఏఎస్‌ల జనంబాట!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మండల అధికారుల వరకు ప్రజల్లో ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.

రాత్రి బస... తెల్లారి గ్రామ సభ

అధికారులు గ్రామాలకు వెళ్లడమే కాదు. రాత్రి బస కూడా చేయాలి. తెల్లవారిన తర్వాత గ్రామస్థులతో సమావేశం కావాలి. శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నెలకు మూడురోజుల పాటు జనంలోకి వెళ్లాలి. కనీసం ఒకరోజు గ్రామంలో రాత్రి బస చేయాలి. విభాగాధిపతులు నెలకు ఎనిమిది రోజులు గ్రామాలకు వెళ్లాలి. కనీసం రెండురోజుల పాటు గ్రామాల్లో రాత్రి బస చేయాలి. జిల్లా కలెక్టర్లు వారానికి రెండురోజుల పాటు గ్రామాలకు వెళ్లాలి. వారంలో కనీసం ఒకరోజు గ్రామంలో రాత్రి బస చేయాలి. జిల్లాల్లో ఉన్న శాఖల అధికారులు నెలకు మూడురోజుల పాటు గ్రామాలకు వెళ్లాలి. ఒక రోజు రాత్రి బస చేయాలి. ఈ అధికారులంతా తమ పర్యటన వివరాలను, అక్కడ ప్రభుత్వ కార్యక్రమాలపై సేకరించిన సమాచారం, ప్రజాభిప్రాయం, ప్రజల సమస్యలు తదితరాలన్నింటినిపైనా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక సమర్పించాలి. రాష్ట్ర ఐటీ విభాగం దీనికోసం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. ప్రధాన కార్యదర్శికి వచ్చిన నివేదికలన్నింటినీ ప్రణాళికా శాఖ సమీక్షిస్తుంది.

భారతీ సిమెంట్ పన్ను ఎగవేత!

- 40 లక్షల ఐటీ చెల్లించని జగన్ కంపెనీ
- జాబితాలో మరిన్ని తెలుగు సంస్థలు.. కాగ్ నివేదికలో వెల్లడి



జగన్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి షర్మిళ

న్యూఢిల్లీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భారీ ఆదాయం ఉన్న కంపెనీలకు అందించే ప్రోత్సాహకాలను అడ్డం పెట్టుకుని కొన్ని కంపెనీలు అవకతవకలకు పాల్పడుతూ ఆదాయ పన్ను(ఐటీ) ఎగవేస్తున్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) గుర్తించింది. అందులో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి చెందిన భారతీ సిమెంట్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరికొన్ని కంపెనీలు ఉన్నాయి. 2012-13 నుంచి 2015-16 ఆర్థిక సంవత్సరాల మధ్య కంపెనీల ఆదాయ పన్ను చెల్లింపుపై కాగ్ రూపొందించిన నివేదికను కేంద్రం తాజాగా పార్లమెంటుకు సమర్పించింది. సాధారణంగా భారీ ఆదాయం కలిగిన కంపెనీలు.. తమ వాటాదారులకు డివిడెండ్ల రూపంలో ఆదాయాన్ని పంపిణీ చేస్తే.. 2001 ఆర్థిక చట్టంలోని 115 బీజే సెక్షన్ ప్రకారం పాక్షికంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దాన్ని కనీస ప్రత్యామ్నాయ పన్ను అంటారు. ఆ సెక్షన్‌ను ఉపయోగించుకుని కంపెనీలు పెద్దఎత్తున ఐటీ ఎగవేస్తున్నాయని కాగ్ ఆక్షేపించింది. తమ కంపెనీకి చెందిన కొన్ని ఆస్తులు న్యాయపరమైన చిక్కుల్లో ఉన్నాయంటూ భారతీ సిమెంట్.. కొంత ఆదాయ మొత్తాన్ని లాభాల్లో చేర్చలేదు. తద్వారా రూ.40.63 లక్షలను ఆదాయ పన్నుగా చెల్లించలేదని కాగ్ వెల్లడించింది. ఇదే తరహాలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ రూ.20.31 కోట్ల పన్ను చెల్లించలేదు. హైదరాబాద్‌కు చెందిన సోమా ఎంటర్‌ప్రైజెస్ వరుసగా రెండేళ్లు రూ.98.24 కోట్లను సబ్ కాంట్రాక్టర్లకు చెల్లించకుండానే చెల్లించామని చెప్పి రూ.20.05 కోట్ల ఆదాయ పన్నును ఎగవేసింది.

ట్రిపుల్ ఐటీల్లో మరో 366 సీట్లు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో కొత్తగా 366 సీట్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సీట్లను ఈ విద్యా సంవత్సరంలోనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళంలలో ట్రిపుల్ ఐటీలున్నాయి. వీటి పరిధిలోని 122 మండలాలకు అడ్మిషన్లలో ప్రాతినిధ్యం లేదు. సోమవారం రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) వీసీ, డైరెక్టర్లతో మంత్రి గంటా శ్రీనివాసరావు నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది. ప్రాతినిధ్యంలేని 122 మండలాల విద్యార్థులకు అవకాశం కల్పించే దిశగా 366 సీట్లు కొత్తగా సృష్టించి విద్యార్థులకు కేటాయించాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ/ఎస్టీ కేటగిరీల్లో ఒక్కో సీటు చొప్పున మండలానికి మూడు సీట్లు కేటాయించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం విడుదల చేయాలన్నారు. కాగా, కొత్తగా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్‌గా నియమితులైన హర శ్రీరాములు, ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ పరిపాలనాధికారిగా నియమితులైన బసవయ్యకు మంత్రి గంటా నియామక ఉత్తర్వులు అందజేశారు.

'విలేజ్ మాల్స్'పై వారంలో నిర్ణయం: ప్రత్తిపాటి

విజయవాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగరాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న విలేజ్ మాల్స్ విషయంలో వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. అనంతరం ప్రజా స్పందనను బట్టి రాష్ట్రవ్యాప్తంగా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడలోని పలు రేషన్ దుకాణాలను మంత్రి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.





థామ్సన్ నిర్వేదం

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో సంచలనాల మీద సంచలనాలు నమోదవుతున్నాయి. థండర్ బోల్ట్‌కు షాక్ తర్వాత.. మహిళల థ్రిల్లింగ్ రేస్‌లోనూ కొత్త చాంపియన్ అవతరించింది. 100మీ రేస్‌లో 'డిప్ ఆఫ్ లైఫ్'తో అమెరికన్ అథ్లెట్ టోరీ బోయి వరల్డ్ టైటిల్ సాధించింది. ఫినిషింగ్ లైన్‌పై ఆమె చేసిన ఫీట్.. సెకనులో వందో వంతు తేడాతో అగ్రస్థానంలో నిలబెట్టింది. కాగా.. టైటిల్ ఫేవరెట్, జమైకా స్టార్ థామ్సన్ మాత్రం ఐదో స్థానంతో నిరాశపరిచింది.

టోరీ బోయి

వాల్ష్‌కు స్వర్ణం

న్యూజిలాండ్‌కు చెందిన థామస్ వాల్ష్.. పురుషుల షాట్‌పుట్ స్వర్ణాన్ని సాధించాడు. చివరి ప్రయత్నంలో 22.03 మీటర్లు విసిరిన వాల్ష్ అగ్రస్థానంలో నిలిచాడు. డిఫెండింగ్ చాంప్ జొ కొవాక్స్ (అమెరికా) 21.66 మీ.లతో రజతం నెగ్గగా.. క్రొయేషియా అథ్లెట్ స్టైప్ జునిక్ (21.46 మీ.) కాంస్యం దక్కించుకున్నాడు. ఒలింపిక్ చాంపియన్ రియాన్ క్రూజర్.. 21.20మీ. విసిరి ఆరో స్థానంతో నిరాశపరిచాడు.



థామస్ వాల్ష్

బోయి.. 'గోల్డెన్' ఫీట్

• 100మీ రేస్‌లో విజయం • థామ్సన్ ఫ్లాప్

లండన్: ఉసేన్ బోల్ట్‌కు గాట్లిన్ షాకిచ్చిన తర్వాతి రోజే.. మహిళల రేస్‌లో కూడా సంచలనం నమోదైంది. అమెరికా స్ప్రింటర్ టోరీ బోయి.. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్స్‌లో తనకు అలవాటైన ఫీట్‌తో మహిళల 100మీ టైటిల్‌ను సాధించింది. ఫినిషింగ్ లైన్ వద్ద కొంత ముందుకు వంగిన బోయి.. సెకనులో వందో వంతు తేడాతో స్వర్ణాన్ని ఎగరేసుకుపోయింది. అయితే హాట్ ఫేవరెట్, రియో ఒలింపిక్ పసిడి పతక విజేత ఎలైనీ థామ్సన్ (జమైకా) అనూహ్యంగా ఐదో స్థానంలో నిలిచింది. రేస్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగింది. ఐవరీకోస్ట్ అథ్లెట్ మరి-జోసి టా లు, బోయి మధ్య పోరు హోరాహోరీగా సాగింది. అయితే ఫినిషింగ్ లైన్‌ను క్రాస్ చేసిన తర్వాత బోయి కింద పడిపోగా.. టా లు విజేతగా సంబరాలు చేసుకుంది. ఫలితాలు వెలువడిన తర్వాత కానీ అసలు విషయం అర్థం కాలేదు. ఫినిషింగ్ లైన్ వద్ద వంగి బాడీని ముందుగా తీసుకువచ్చిన బోయి.. 10.85 సెకన్ల టైమింగ్‌తో మొదటి స్థానంలో నిలిచింది. టా లు (10.86 సె) రజతం దక్కించుకుంది. నెదర్లాండ్స్‌కు చెందిన డఫ్నే షిప్పర్స్ 10.96 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం కైవసం చేసుకుంది. తాను వరల్డ్ చాంపియన్ అనేది నమ్మలేక పోతున్నానని బోయి చెప్పింది. గెలవాలన్న కసి.. తనను చాంపియన్‌ను చేసిందని తెలిపింది. ప్రముఖ టోర్నీల్లో ఫినిషింగ్‌లైన్ వద్ద ఇలా దుమకడం ఆమెకు కొత్తేమీ కాదు. రియో ఒలింపిక్స్‌లో 200మీ రేస్‌లో ఇలాగే చేసిన బోయి.. కాంస్యం సాధించింది. అసలు ఫినిషింగ్ లైన్‌పై పడిపోదామనే అనుకున్నానని రేస్ అనంతరం బోయి చెప్పింది. అయితే తుది వరకు పట్టువీడ కుండా పోరాడాలనేదే తన సంకల్పమని తెలిపింది. కాగా, హాట్ ఫేవరెట్ అయిన రియో చాంపియన్ 25 ఏళ్ల థామ్సన్.. మెరుగ్గానే రేస్‌ను ఆరంభించినా సగం దూరం చేరేసరికి ఆశించిన రీతిలో వేగం సాధించలేక పోయింది. రేస్ అనంతరం ఆమె ఎంతో బాధగా కనిపించింది. 'ఏం జరిగిందో అర్థం కావడం లేదు. నేను బాగానే ఆరంభించినా.. మిగతా వారు దూసుకెళ్లారు. రేస్‌లో పుంజుకోనందుకు సిగ్గు పడుతున్నా'నని థామ్సన్ చెప్పింది. టా లు అందరినీ వెనక్కు నెట్టి విజేతగా నిలిచేలా కనిపించింది. కానీ, బోయి కొంచెం ముందుకు వంగడం.. ఫలితాన్ని లిప్తపాటులో మార్చేసింది.

గాట్లిన్‌కు ఇంకా అవమానాలు..

కొత్త వరల్డ్ చాంపియన్ జస్టిన్ గాట్లిన్ ఇంకా అవమానాలను ఎదుర్కొంటూనే ఉన్నాడు. ఒలింపిక్ స్టేడియంలో పతకాల ప్రదానం సందర్భంగా కూడా గాట్లిన్‌ను జనం హేళన చేశారు. ఇదే సందర్భంలో కాంస్యం సాధించిన స్ప్రింట్ కింగ్ ఉసేన్ బోల్ట్‌కు బ్రహ్మరథం పట్టారు. డోపీగా రెండుసార్లు పట్టుబడి సస్పెన్షన్‌కు గురైన 35 ఏళ్ల గాట్లిన్.. బోల్ట్ చివరి 100మీ రేస్‌లో అతడిని ఓడించి షాకిచ్చాడు. తమ ఫేవరెట్ అథ్లెట్ ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేని అభిమానులు గాట్లిన్‌ను గేలి చేశారు. అయితే, నోరు మూసుకోండి అన్నట్టుగా జస్టిన్ తన పెదవులపై వేలిని ఉంచాడు. పతకాల ప్రదానం సందర్భంగా కూడా గాట్లిన్ అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కాంస్యం సాధించిన బోల్ట్ పేరు పిలవగానే.. స్టేడియం మొత్తం 'ఉసేన్ బోల్ట్.. ఉసేన్ బోల్ట్' అంటూ మార్మోగిపోయింది. కానీ స్వర్ణం నెగ్గిన గాట్లిన్ పేరు పిలవగానే.. ఎగతాళి మొదలైంది. అయితే జస్టిన్.. తన ముఖంలో ఎటువంటి భావాలు కనిపించకుండా స్థిరంగా నిలబడ్డాడు. ఆ తర్వాత బోల్ట్, కోల్‌మన్‌తో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చాడు. కాగా.. డోపీగా 2006లో మరోసారి పట్టుబడినప్పుడు.. గాట్లిన్‌పై జీవితకాల నిషేధం విధించాల్సిందని చెప్పిన ఐఏఏఎఫ్ చీఫ్ సెబాస్టియన్ కో.. తానే స్వయంగా జస్టిన్‌కు పతకాన్ని ప్రదానం చేశాడు.

కోల్‌మన్, గాట్లిన్, బోల్ట్





వారెవా.. స్టెఫానిడి

మహిళల పోల్‌వాల్ట్‌లో గ్రీస్ అథ్లెట్ ఎకటెరిని స్టెఫానిడి గోల్డ్ సాధించింది. ఫైనల్లో స్టెఫానిడి 4.91 మీటర్లు దూకి మొదటి స్థానంలో నిలిచింది. శాండి మోరిస్ (అమెరికా) 4.7 మీటర్లతో రజతం సాధించగా.. రోబిలిస్ పినాడో (వెనుజులా) కాంస్యం దక్కించుకుంది.

థియామ్‌కు హెప్టాథ్లాన్ గోల్డ్



థియామ్

స్వప్నకు 26వ స్థానం

రియో ఒలింపిక్ చాంపియన్ నఫి థియామ్ (బెల్జియం).. మహిళల హెప్టాథ్లాన్ పసిడిని సొంతం చేసుకుంది. 6784 పాయింట్లతో థియామ్ టాప్ ప్లేస్‌లో నిలిచింది. 6696 పాయింట్లతో కరోలిన్ స్కాఫర్ (జర్మనీ), 6636 పాయింట్లతో అనోక్ వెట్టర్ (నెదర్లాండ్స్) రజత, కాంస్యాలు సాధించారు. కాగా, భారత్‌కు చెందిన స్వప్నా బర్మన్ 5431 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచింది. మహిళల మారథాన్‌లో బెహ్రెయిన్ అథ్లెట్ రోస్ చెలియో (2:27.11) స్వర్ణం నెగ్గింది. కిప్లాఘట్ (కెన్యా), అమి క్రాగ్ (అమెరికా) రజత, కాంస్య పతకాలు సాధించారు.

శ్రీశాంత్‌కు ఊరట

• నిషేధాన్ని కొట్టేసిన కేరళ హైకోర్టు



శ్రీశాంత్

న్యూఢిల్లీ: పేస్ బౌలర్ శ్రీశాంత్‌పై జీవితకాల నిషేధాన్ని కేరళ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. 2013 ఐపీఎల్-6లో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో శ్రీశాంత్ మరికొందరు క్రికెటర్లపై బీసీసీఐ జీవిత కాల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నిషేధాన్ని శ్రీశాంత్.. పటియాల హౌస్ కోర్టులో సవాలు చేయగా.. అతడు సహ అజిత్ చండీలా, అంకిత్ చవాన్‌తో పాటు మొత్తం 36 మందిపై సదరు క్రిమినల్ ఆరోపణలను ఆ కోర్టు కొట్టివేసింది. అయితే బీసీసీఐ మాత్రం శ్రీశాంత్‌పై నిషేధాన్ని ఎత్తివేయలేదు. దాంతో అతడు కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి ఎ. మహ్మద్.. శ్రీశాంత్‌పై బీసీసీఐ విధించిన జీవితకాల నిషేధాన్ని కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. దీనిపై బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా స్పందిస్తూ 'తీర్పు ఈరోజే వచ్చింది. దానిని బీసీసీఐ న్యాయ విభాగం పరిశీలించి అభిప్రాయం తెలియజేస్తుంది. న్యాయ విభాగం పరిశీలనపై బోర్డు సాధారణ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. తీర్పు తనకు అనుకూలంగా రావడంపట్ల శ్రీశాంత్..భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపాడు.

అంపైర్లది ఓవరాక్షన్



గవాస్కర్

కొలంబో: రవీంద్ర జడేజాపై ఓ టెస్ట్ నిషేధం విధించడాన్ని అంపైర్ల ఓవరాక్షన్‌గా మాజీ కెప్టెన్ గవాస్కర్ అభివర్ణించాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో ఆదివారం ఆటలో కరుణరత్నె క్రీజులో ఉన్నా.. జడేజా అతడిపైకి బంతి విసిరాడు. దీన్ని ఫీల్డ్ అంపైర్లు ప్రమాదకర చర్యగా గుర్తించారు. దాంతో ఈ రెండేళ్లలో అతడి ఖాతాలో మరో ఆరు డీమెరిట్ పాయింట్లు చేరడంతో జడేజాపై ఓ టెస్ట్ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఇక తాను తప్పు చేశానని జడేజా అంగీకరిస్తూ.. 'నేను మంచివాడిగా మారదామనుకున్న తరుణంలో లోకమంతా చెడ్డదైపోయింది' అని ఓ హిందీ సినిమాలో డైలాగ్‌ను ఉటంకించాడు.

ప్రొ కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

STAR SPORTS 2	గుజరాత్ X హరియాణ రాత్రి 8.గం	బెంగళూరు X టైటాన్స్ రాత్రి 9.గం	maa movies

సిరీస్ ఇంగ్లండ్ వశం

● 177 రన్స్‌తో సౌతాఫ్రికా ఓటమి

● 5 వికెట్లతో అదరగొట్టిన అలీ



అలీ (5/69)

మాంచెస్టర్: దక్షిణాఫ్రికాతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌ను ఇంగ్లడ్ 3-1తో కైవసం చేసుకుంది. నాలుగో మ్యాచ్‌లో మొయిన్ అలీ (5/69) మ్యాజిక్‌తో ఇంగ్లండ్ 177 పరుగుల తేడాతో మరో రోజు మిగిలుండగానే విజయం సాధించింది. కెప్టెన్‌గా జో రూట్ బాధ్యతలు చేపట్టిన తొలి సిరీస్‌లోనే ఇంగ్లండ్‌ను విజేతగా నిలబెట్టాడు. అందునా 1998 తర్వాత సౌతాఫ్రికాపై సిరీస్ నెగ్గడం ఇదే తొలిసారి. దక్షిణాఫ్రికా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా మోర్నీ మోర్కెల్, ఇంగ్లండ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా మొయిన్ అలీ నిలిచారు. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 380 పరుగుల లక్ష్య ఛేదనలో.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అలీ దెబ్బకు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 202 పరుగులకే కుప్పకూలింది. అండర్సన్ మూడు వికెట్లు పడగొట్టాడు. హషీమ్ ఆమ్లా (83), కెప్టెన్ డు ప్లెసిస్ (61) అర్ధ శతకాలతో ఆదుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆమ్లా, డికాక్ (1), డి బ్రుయాన్ (0)లను వెంట వెంటనే అవుట్ చేసిన అలీ సఫారీలను కోలుకోలేని దెబ్బకొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 224/8తో సోమవారం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్.. మరో 19 పరుగులు మాత్రమే జోడించి 243 రన్స్ వద్ద ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 362, దక్షిణాఫ్రికా 226 పరుగులు చేశాయి.


ధోనీ స్లెడ్జింగ్ చేయడం చూడలేదు



సాహా

కొలంబో: ప్రత్యర్థి ఆటగాళ్లను స్లెడ్జింగ్ చేయడం తప్పనిసరికాదని భారత టెస్ట్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అన్నాడు. ఎంతో మంది వికెట్ కీపర్లు ఇష్టపడుతున్న ఈ పద్ధతిపై తనకు నమ్మకంలేదని సాహా చెప్పాడు. 'ధోనీ స్లెడ్జింగ్ చేయడం నేనెప్పుడూ చూడలేదు. ఇది తప్పనిసరి కాదని నా అభిప్రాయం. మాటలతో రెచ్చగొట్టినంత మాత్రాన ఎవరూ వికెట్లు సమర్పించుకోరు. కొన్నిసార్లు మాత్రం బ్యాట్స్‌మెన్‌కు ఊహించని షాక్‌లు ఇస్తుంటాం. నీ షాట్ సెలెక్షన్ బాగాలేదు. నువ్వు చెత్త షాట్‌లు ఆడుతున్నావంటూ కామెంట్లు చేస్తుంటాం. ఇలాంటి మాటల వరకు పరవాలేదు. ఇక ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ నాకు ఆదర్శం. చిన్నప్పటి నుంచీ అతని కీపింగ్ చూస్తూ పెరిగాను. అతని బ్యాటింగ్, కీపింగ్ స్టయిల్ అంటే ఎంతో ఇష్టం. మార్క్ బౌచర్, ఇయాన్ హీలీ కీపింగ్ కూడా బాగుంటుంద'ని సాహా తెలిపాడు.

డోప్‌లో విఫలమైన ఎరాని!



రోమ్: ఫ్రెంచ్ ఓపెన్ మాజీ ఫైనలిస్ట్ సారా ఎరాని (ఇటలీ) డోప్ టెస్ట్‌లో విఫలమైంది. గత ఫిబ్రవరిలో ఆమె నుంచి సేకరించిన మూత్రపు నమూనాలో 'అనాస్ట్రోజోల్' ఆనవాళ్లు కనుగొన్నట్టు రెండు ఇటలీ పత్రికలు వెల్లడించాయి. 2012 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడిపోయిన 30 ఏళ్ల సారా.. కెరీర్‌లో అత్యుత్తమంగా ఐదో ర్యాంక్‌కు చేరుకుంది.

ఆనంద్‌కు తొలి విజయం

సెయింట్ లూయిస్ (యుఎస్‌ఏ): ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ సింక్విఫీల్డ్ చెస్ టోర్నీలో తొలి



విజయం నమోదు చేశాడు. తొలి నాలుగు రౌండ్లు డ్రాగా ముగించిన ఆనంద్ ఐదో గేమ్‌లో అద్భుత విజయం సాధించాడు. అమెరికాకు చెందిన ఫాబియానో కరువానాతో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన విషీ.. 29 ఎత్తుల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేశాడు. ఇక ఈ విజయంతో ఒక పాయింట్ ఖాతాలో వేసుకున్న ఆనంద్ ఐదు రౌండ్ల అనంతరం మొత్తం 3 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మాగ్నస్ కార్ల్‌సన్ కూడా మూడు పాయింట్లతో ఉన్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన లాగ్రావ్ మాక్సిమ్ (3.5) అగ్రస్థానంలో ఉన్నాడు. కాగా.. మంగళవారం జరిగే ఆరో రౌండ్‌లో కర్జాకిన్ (రష్యా)తో ఆనంద్ తలపడనున్నాడు.

లక్ష్యానికి 36 కి.మీ. దూరంలో..



సమీర్ సింగ్

చివరిలో ఆగిన సమీర్ సింగ్ పరుగు


ముంబై: అతడి పేరు సమీర్‌సింగ్.. వయస్సు 44 ఏళ్లు.. స్వస్థలం మధ్యప్రదేశ్.. మారథాన్ అంటే ప్రాణం.. ఐదు ఆల్ట్రా మారథాన్ల విజేత.. 100 రోజుల్లో 10వేల కి.మీ. పరుగెత్తాలన్నది అతడి లక్ష్యం. ఆ దూరం ఎంతో తెలుసా? చైనా వాల్ (5500 కి.మీ.), ముంబై-లండన్ (7,200 కి.మీ.) కంటే ఎక్కువ. ఆ మేరకు ఏప్రిల్ 29న మండు వేసవిలో ముంబైలో తన రన్ ప్రారంభించాడు. నాటినుంచి ఎండ, వానలను లెక్క చేయకుండా లక్ష్యం దిశగా రోజుకు 100 కి.మీ.లు పరుగెడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో అతడు ఏకంగా 16 కిలోల బరువు తగ్గిపోయాడు. ఆదివారం అతడు తన లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. కానీ సుదీర్ఘ పరుగులో సమీర్‌కు పలు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యాయి. అయినా వెనుకాడలేదు. కానీ అవి బాగా ఎక్కువ కావడంతో చివరకు అంటే.. ఆదివారం 9,969.19 కి.మీ.ల వద్ద సమీర్ ఇక పరుగెత్తలేని స్థితికి చేరుకున్నాడు. దాంతో లక్ష్యానికి దాదాపు 36 కి.మీ. దూరంలో ఆగిపోయాడు. అయితే అందుకు సమీర్ చింతించడంలేదు. పూర్తిగా స్వస్థత చేకూరాక 40 వేల కి.మీ. పరుగును మొదలుపెడతానని ధీమాగా ప్రకటించాడు. కాగా.. అతడి వెన్నంటే ఉన్న డాక్యుమెంటరీ దర్శకులు వందన, విక్రమ్ భట్టి.. సమీర్‌ను 'ఫెయిత్ రన్నర్'గా అభివర్ణించారు.

సతేంద్ర, మోహిత్‌కు రజతాలు

న్యూఢిల్లీ: ఆసియా జూనియర్ బాక్సింగ్‌లో సతేంద్ర రావత్ (80+ కిలోలు), మోహిత్ ఖంతనా (80) రజత పతకాలు నెగ్గారు. సోమవారంనాటి ఫైనల్లో అల్మతోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో సతేంద్ర, తొంగబే (కజకిస్థాన్) చేతిలో మోహిత్ ఓటమి పాలయ్యారు. ఇక సెమీస్‌లో ఓడిన అంకిత్ నర్వాల్ (57), భవేష్ కాంతిమణి (52), సిద్దార్థ మాలిక్ (48), వినిత్ దాహియ (75), అక్షయ్ సివాచ్ (60), అమన్ (70) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

విజయానికి 4 సూత్రాలు!

అమెరికాలో చదువుకోవటం చాలా మందికి ఒక కల. ఆ కల ఆనందంగా కొనసాగాలంటే- విద్యార్థులు- తమ జీవనశైలిలో, వ్యక్తిత్వంలో కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. అమెరికాకు వెళ్లిన విద్యార్థులు తరచూ చేసే కొన్ని తప్పులేమిటో చూద్దాం. ఈ తప్పులు మనకు కన్సలెంట్స్ చెప్పనవి. ఈ తప్పులు చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తే ఎన్నో లాభాలుంటాయి..



విదేశీ చదువు

• అతి సర్వత్రా..

అమెరికాలో చదువుకోవటానికి వెళ్లిన విద్యార్థుల్లో చాలా మంది స్కాలర్‌షిప్‌ల ద్వారానో.. బ్యాంకు లోనుల ద్వారానో వెళ్లిన వారే! అందువల్ల వారు తాము ఖర్చు పెట్టే పైసా నుంచి ఎంతో కొంత లాభం పొందాలని ప్రయత్నిస్తూ ఉంటారు. కొంత వరకూ ఇది బానే ఉంటుంది కానీ ఎక్కువగా లాభం పొందటానికి ప్రయత్నిస్తే ఒత్తిడి కూడా పెరుగుతుంది. ఉదాహరణకు చాలా విశ్వవిద్యాలయాల్లో మీల్ ప్లాన్స్ ఉంటాయి. పూర్తిగా పైసా వసూల్ చేయాలనే ఉద్దేశంతో ఆకలిగా లేకపోయినా ఎక్కువ తినేస్తే సెమిస్టర్ పూర్తయ్యే సరికి బరువు పెరిగిపోతారు. మనకు ఎంత అవసరమో అంతవరకే మితంగా తినటం మంచిది. ఇదే విధంగా లాండ్రీకి ముందే డబ్బులు చెల్లించాం కాబట్టి ప్రతి రోజూ బట్టలు లాండ్రీకి వేయాలనుకోవటం సరికాదు.

• లోపాలుంటే..

చాలా సందర్భాలలో మనం చెల్లించే సొమ్ముకు ఎలాంటి సేవలు లభిస్తాయో ముందే తెలుస్తుంది. అయితే కొన్ని సార్లు సేవాలోపాలు కూడా ఉండచ్చు. అలాంటి సమయంలో ఆ సేవా లోపాలను ఎత్తి చూపించటం తప్పు కాదు. చాలా సందర్భాలలో మన దేశానికి చెందిన విద్యార్థులు సర్దుకుపోవటం ఉత్తమమనే భావనలో ఉంటారు. మనం సొమ్ము చెల్లిస్తున్నాం కాబట్టి సర్దుకుపోవాల్సిన అవసరం లేదు. సేవలలో లోపం ఉందనే విషయాన్ని సంబంధిత వ్యక్తులకు తెలియజేస్తే వారు తగిన చర్యలు తీసుకుంటారు. చాలా విశ్వవిద్యాలయాలలో అంతర్జాతీయ విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి వారికి అవసరమైన విషయాలపై వెంటనే చర్యలు తీసుకుంటారు.

• తక్కువగా ఆలోచించవద్దు..

మన విద్యా వ్యవస్థలో మార్కులకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇతర నైపుణ్యాలకు తక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. ఎక్కువ మార్కులను వచ్చిన వారిని మొనగాళ్లుగా భావిస్తూ ఉంటారు. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చినవారందరికీ పెద్ద పెద్ద ఉద్యోగాలు వస్తాయని.. వారు జీవితంలో దూసుకువెళ్లిపోతారని భావించకూడదు. అమెరికా విద్యావ్యవస్థలో మార్కులతో పాటుగా ఇతర నైపుణ్యాలకు కూడా సమాన విలువ ఇస్తూ ఉంటారు. జీవితంలో విజయం సాధించటానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పటానికి ప్రయత్నిస్తారు. అందువల్ల మన దేశంలో చదువుకున్నప్పుడు తక్కువ మార్పులు వచ్చిన వారు.. అమెరికాలో విజయం సాధించకూడదనే నిబంధనేమి లేదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని- తమ గురించి తాము తక్కువగా ఆలోచించకోకుండా ఉంటే మంచిది.

ఆకర్షణలు వద్దు..

విశ్వవిద్యాలయంలో చేరిన తొలి సంవత్సరమే ఆకర్షణలకు లోనవటం.. ప్రేమలో పడటం వంటి వాటి వల్ల ఇబ్బందులు ఏర్పడతాయి. అమెరికాలో విద్యా వ్యవస్థ- మన దేశంలో మాదిరిగా ఉండదు. సిద్ధాంతాలు చెప్పటంతో పాటుగా ప్రాక్టికల్స్‌కు, ప్రాజెక్ట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అందువల్ల మన ప్రాధమ్యాలు ఏమిటనే విషయాన్ని స్పష్టంగా నిర్ణయించుకొని వాటిని అమలు చేయటానికి ప్రయత్నించాలి. మనం ఎలా చదువుతున్నామనే విషయాన్ని.. వ్యక్తిగతంగా మనం ఎలా ఉంటున్నామనే విషయాన్ని ఎవరూ గమనిస్తూ ఉండరు కాబట్టి మరింత బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరముంది.

- స్పెషల్ డెస్క్

కాంగ్రెస్ ఉనికికే ముప్పు!

మోదీ-షాపై పోరు ఆషామాషీ కాదు.. పాత వ్యూహాలు చెల్లవు

• కీలక సమయంలో నాయకత్వ అనిశ్చితి

• సీనియర్ జైరాం రమేశ్ ఆందోళన



కోచి, ఆగస్టు 7: లోక్‌సభ ఎన్నికల అనంతరం వరుసగా మూడేళ్లపాటు జరిగిన ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో (పంజాబ్ తప్ప) ఘోరవైఫల్యానికి కారణాలేంటో కాంగ్రెస్ నాయకత్వం ఆత్మశోధన చేసుకోవాలని కోరుతున్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్.. తమ పార్టీ మునుపెన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఉనికే ప్రమాదంలో పడిందని సోమవారం ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రధాని మోదీ-బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాలపై పోరాటం ఆషామాషీ కాదని, కాంగ్రెస్ నాయకులంతా ఉమ్మడిగా కృషిచేసి సవాళ్లను అధిగమించాలని పిలుపిచ్చారు. 'అవును.. మా పార్టీ తీవ్ర సంక్షోభంలో ఉంది. 1996 నుంచి 2004 వరకు అధికారం కోల్పోయి ఎన్నికల సంక్షోభాలను ఎదుర్కొంది. అత్యవసర పరిస్థితి తర్వాత 1977లో జరిగిన ఎన్నికల్లో ఓటమి కారణంగా సంక్షోభాన్ని ఎదుర్కొంది. కానీ ఇప్పుడు దాని ఉనికే సంక్షోభంలో పడింది.' అని ఆందోళన వ్యక్తంచేశారు. 'మనం మోదీ-షాపైన పోరాడుతున్నామని కాంగ్రెస్ నేతలు అర్థం చేసుకోవాలి. వారిద్దరి ఆలోచన, కార్యాచరణ విభిన్నంగా ఉంటుంది. కాంగ్రెస్ గనుక పట్టువిడుపుల ధోరణితో వ్యవహరించకుంటే ఎందుకూ కొరగాకుండా పోతుంది' అని జైరాం తేల్చిచెప్పారు. 2019లో మోదీకి గట్టిపోటీ ఇవ్వగల నాయకుడు కాంగ్రెస్‌లో ఉన్నారా అని ప్రశ్నించగా.. పార్టీ నేతల సమష్టి కృషితోనే ఆయన్ను ఎదుర్కోగలమని, ఏ ఒక్క వ్యక్తి చేతిలోని మంత్రదండమూ పనిచేయదని బదులిచ్చారు. 'పాతబడిన నినాదాలు, బూజుపట్టిన ఫార్ములాలు, పాత వ్యూహాలూ పనిచేయవ'ని స్పష్టం చేశారు.

నితీశ్ తీరుతో బీజేపీ వ్యతిరేక కూటమికి షాక్

బిహార్ సీఎం నితీశ్‌కుమార్ ఎన్డీయేలోకి వెళ్లడంతో దేశంలో బీజేపీ వ్యతిరేక కూటమి ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని జైరాం అంగీకరించారు. ఆర్జేడీ-జేడీయూ-కాంగ్రెస్ మహాకూటమికి అనుకూలంగా ప్రజలిచ్చిన తీర్పును ఆయన వంచించారని ఆరోపించారు. 'నితీశ్ తీరుతో వ్యక్తిగతంగా బాధపడ్డాను. కానీ దానిని దాటుకుని ముందుకెళ్లక తప్పదు.' అని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ ఏడాది చివరిలోగా అధ్యక్ష పగ్గాలు స్వీకరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయని, తదుపరి ఏడాది లోక్‌సభ ఎన్నికలు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో నాయకత్వ అనిశ్చితి పార్టీకి మంచిది కాదన్నారు. దీనికి రాహుల్ త్వరగా తెరదించాలని విజ్ఞప్తి చేశారు. 1977లో రాయ్‌బరేలీ ఓటమి తర్వాత ఇందిరాగాంధీ 1978లో కర్ణాటకలోని చిక్‌మగళూరు నుంచి పోటీచేసి విజయం సాధించారని, కాంగ్రెస్‌కు పునర్జన్మ లభించిందని, వచ్చే ఏడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పార్టీ గెలిచి కాంగ్రెస్‌ను మళ్లీ బతికిస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్ విజయం కోసం గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరు రిసార్టుకు తరలించడాన్ని జైరాం సమర్థించుకున్నారు.



మాయావతిపై తిరుగుబాటు!

• ఏకతాటిపైకి 16 దళిత, ఓబీసీ, ముస్లిం సంఘాలు

లఖ్‌నవ్, ఆగస్టు 7: దళితుల్లో పట్టు సాధించేందుకు రాజ్యసభ సభ్యత్వానికి అర్థాంతరంగా రాజీనామా చేసిన బీఎస్పీ అధినేత్రి మాయావతి.. మరిన్ని చిక్కుల్లో పడ్డారు. బీఎస్పీ ఓటుబ్యాంకును దెబ్బతీసేందుకు ఆమెకు ఒకప్పటి సన్నిహితుడు, పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి నసీముద్దీన్ సిద్దిఖీ 16 దళిత, ఓబీసీ, ముస్లిం సంఘాలను ఏకతాటిపైకి తెచ్చారు. వాటి నేతలతో ఆదివారం ఢిల్లీలో సమావేశమై రోజంతా మంతనాలు సాగించారు. త్వరలో మళ్లీ భేటీ అయి 'సర్వసమాజ్' పేరుతో ఉమ్మడి కూటమిని ఏర్పాటు చేస్తామని సిద్దిఖీ సోమవారం వెల్లడించారు.

ఇది మోదీ షాదీ ముబారక్

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముస్లిం యువతుల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఒక పథకం ప్రవేశపెట్టారు. దీని పేరు షాదీ షగున్ (శుభ కల్యాణం).ఈ పథకంలో భాగంగా పట్టభద్రులైన ముస్లిం యువతులకు రూ.51 వేలు పెళ్లి కానుక అందించనున్నారు. పట్టభద్రులు కావడంతో పాటు అంతకుముందు మౌలానా అజాద్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (ఎంఏఈఎఫ్) స్కాలర్‌షిప్‌లు అందుకుని ఉంటే ఈ నజరానా అందుతుంది. అలాగే 9, 10 తరగతులు చదివే ముస్లిం బాలికలు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఇవ్వాలని జాతీయ మైనారిటీ కమిషన్ నేతృత్వంలో పని చేసే ఎంఏఈఎఫ్ నిర్ణయించింది. ఇప్పటి వరకు ఇంటర్‌మీడియేట్ చదివే బాలికలకు మాత్రమే రూ.12 వేల చొప్పున ఇస్తున్నారు. 'ట్రిపుల్ తలాక్ పద్ధతికి వ్యతిరేకంగా చేపట్టిన చర్యలతో మోదీ ప్రభుత్వానికి ముస్లిం మహిళల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ముస్లి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బీజేపీకి ఓటు వేశారు. అలాగే ట్రిపుల్ తలాక్ నుంచి విముక్తం చేయలంటూ ఎందరో ముస్లిం మహిళలు లేఖలు రాశారు. మరో రెండేళ్లలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముస్లిం మహిళల మద్దతును మరింత పటిష్టం చేసుకోవడానికి షాదీ షగున్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.



భారత్‌లో స్థిరపడ్డ పాక్ మహిళ మొహిసిన్ ప్రధాని మోదీకి రాఖీ కడుతున్న దృశ్యం. ఆమె గత 23 ఏళ్లుగా మోదీకి రాఖీ కడుతున్నారు.

పక్కాగా సంక్షేమ పథకాలు

సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బోగస్ లబ్ధిదారులను ఏరివేయాలని, 2011 నాటి సామాజిక గణాంకాల ఆధారంగా పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గణాంకాల అధ్యయనం కోసం ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుమిత్ బోస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేస్తున్న పథకాలకు తొలుత దీన్ని వర్తింపజేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు.

22న బ్యాంకుల సమ్మె

చెన్నై, ఆగస్టు 7: ప్రైవేటీకరణ, నష్టాల్లో ఉన్న బ్యాకుల మూసివేత, ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 22వ తేదీన ఒక రోజు సమ్మె చేపట్టనున్నారు. ఈ సమ్మెలో దేశ వ్యాప్తంగా 10 లక్షల ఉద్యోగులు పాల్గొంటారని ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు చెందిన 9 యూనియన్లతో కూడిన ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం తెలిపారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 15న భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ లేదా నవంబరులో రెండు రోజుల సమ్మె కూడా చేస్తామన్నారు.

కొత్త భత్యాలపై ఐటీ కట్టాల్సిందే: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 7: భత్యాలపై ఉద్యోగుల మరో డిమాండ్‌ను కేంద్రం తోసిపుచ్చింది. 7వ వేతన సవరణ సంఘం సిఫారసుల మేరకు అమల్లోకి తెచ్చిన కొత్త భత్యాలపై ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు ఇటీవల కోరాయి. అలా ఇవ్వడం కుదరదని ఆర్థిక శాఖ వర్గాలు సోమవారం తేల్చేశాయి. కేంద్ర ఉద్యోగులకు ప్రత్యేక మినహాయింపు ఇస్తే, మిగతా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు, వీరికి మధ్య వివక్ష చూపినట్లవుతుందని పేర్కొన్నాయి. అలా చేయడం అయ్యే పని కాదని తేల్చిచెప్పాయి.

భీమ్ యూజర్లకు క్యాష్‌బ్యాక్ కానుక

బెంగళూరు, ఆగస్టు 7: భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ (భీమ్) యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీలు జరిపే వారికి ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవ కానుక ఇవ్వనుంది. ఆగస్టు 15న క్యాష్‌బ్యాక్ రూపంలో పెద్దమొత్తంలో ప్రోత్సాహకాలు అందించనుంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు భీమ్ యాప్‌ను నిర్వహిస్తున్న ఎన్‌పీసీఐ ఎండీ, సీఈవో ఏపీ హోటా తెలిపారు. భీమ్ యాప్‌తో వేగంగా లావాదేవీలు జరిపేలా సరికొత్త 1.4 వెర్షన్‌ను రూపొందించినట్లు, త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

అహ్మద్ పటేల్ గెలిచేనా?

• గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల ఉత్కంఠ

• 3 సీట్లు.. బరిలో నలుగురు.. నేడే పోలింగ్

• జంపింగులతో 44కు తగ్గిన కాంగ్రెస్ బలం

• ఆదుకోవాల్సిన మిత్రుల దోబూచులాట



న్యూఢిల్లీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యూపీఏ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్‌లో సోనియాగాంధీ తర్వాత శక్తివంతుడైన నేతగా వెలుగొందిన అహ్మద్ పటేల్‌కు ఇప్పుడు రాజ్యసభ సభ్యత్వమే డౌటుగా మారింది. ఆయన్ను గెలిపించుకునేందుకు అవసరమైన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ సమీకరించుకోలేక పోతోంది. గుజరాత్‌లో ప్రధానప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు ఇటీవలి వరకు 57 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. శాసనసభాపక్ష నేత శంకర్ సింఘ్ వాఘేలా పార్టీతో ఇరవయ్యేళ్ల బంధాన్ని తెంచుకొని, డజను మంది ఎమ్మెల్యేలతో వెళ్లిపోయారు. దాంతో పార్టీ బలం 44కు పడిపోయింది. పటేల్ గెలవాలంటే 46 మంది ఎమ్మెల్యేలు కావాలి. గుజరాత్‌లో 3 రాజ్యసభ సీట్లకు పోటీ జరుగుతుంటే బీజేపీ నాలుగో అభ్యర్థిని నిలబెట్టి అహ్మద్ పటేల్‌ను ఇబ్బంది పెడుతోంది. అమిత్‌షా, స్మృతి ఇరానీతో పాటు, కాంగ్రెస్ నుంచి బయటికొచ్చిన నేతను బరిలో దింపింది. దాంతో ఎన్సీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇతర స్వతంత్ర ఎమ్మెల్యేలకు గిరాకీ పెరిగింది. మంగళవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో కర్ణాటక క్యాంపు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గుజరాత్‌కు తీసుకొచ్చారు. ఎన్సీపీ మద్దతుందని, తన విజయం ఖాయమని అహ్మద్ పటేల్ ధీమాగా చెబుతుండగా, ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ ప్రకటించారు. మరోపక్క శంకర్ సింగ్ వాఘేలా మెత్తబడ్డారు. తనకు కాంగ్రెస్‌పైనే కోపమని అహ్మద్ పటేల్ పాత మిత్రుడే అన్నారు. అహ్మద్ పటేల్‌ను ఒడ్డునపడేసే అవకాశం ఉందని పరోక్షంగా సంకేతమిచ్చారు. నోటా ఓటుతో ఇప్పటికీ అహ్మద్ పటేల్ పరిస్థితి అనిశ్చితిగానే ఉంది. క్యాంపులో దాచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఎవరైనా చివరి నిమిషంలో ఫిరాయించినా, నోటా ఓటు వేసినా అహ్మద్ పటేల్ గెలుపు ప్రమాదంలో పడుతుంది.

మోదీ-షాల ప్రతీకారమే

యూపీఏ పదేళ్ల పాలనలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తమకు చేసిందానికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా భావిస్తున్నారు. తమకు చాటుమాటు మిత్రుడే అయినప్పటికీ సోనియా రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్‌కు చెమటలు పట్టిస్తున్నారు. పటేల్ వీరిద్దరితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని గుజరాత్‌లో కాంగ్రెస్‌కు సమాధి కట్టారని, అందుకు మూల్యం చెల్లించక తప్పదని ఆ పార్టీ నేతలే అంటున్నారు. ఆపరేషన్ 'కాంగ్రెస్ ముక్త భారత్'లో భాగంగా కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేయడానికి వచ్చిన ఏ అవకాశాన్నీ ప్రధాని, బీజేపీ అధ్యక్షుడు వదులుకోవడం లేదు. ఇప్పుడు అహ్మద్ పటేల్ వంతు వచ్చిందని గుజరాత్ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. గుజరాత్‌లో బీజేపీ నాలుగుసార్లు అధికారంలోకి రావడానికి, కాంగ్రెస్ ఎదగకపోవడానికి అహ్మద్ పటేలే కారణమని కాంగ్రెస్ నేతలు గట్టిగా వాదిస్తున్నారు. సోనియాకు సలహాదారు కావడంతో ఆయనపై వ్యతిరేకంగా ప్రకటనలు చేయడానికి సాహసించేవారు కాదు. అహ్మద్ పటేల్‌కు గుజరాత్‌లో పలు విద్యా, వ్యాపార సంస్థల్లో వాటాలున్నాయి. మోదీ-షాలు వాటిల్లో లొసుగుల్ని పట్టించుకోకుండా పరస్పరం సహకరించుకునే వారన్న వాదనా ఉంది.



ముంబైలో పేలుడు పదార్థాలు పట్టివేత

ముంబై, ఆగస్టు 7: దేశ ప్రజలు 70వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమవుతున్న వేళ.. ముంబైలో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు బయటపడ్డాయి. పేలుళ్లకు ఉపయోగించే ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్‌ల తయారీలో వాడే అమ్మోనియం నైట్రేట్ 15కిలోలు, 9డిటొనేటర్లను పోలీసులు థాణేలో స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాలు డాయిఘర్‌లోని స్క్రాప్ యార్డులో ఉన్నట్టుగా పోలీసులకు సమాచారం అందడంతో ముంబై క్రైం బ్రాంచ్, రైల్వే పోలీస్, మహరాష్ట్ర యాంటి టెర్రరిస్ట్ స్క్వాడ్ ఆ యార్డులో తనిఖీలు చేపట్టి అక్కడున్న ఒక ఎస్‌యూవీ (స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్)లో పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్క్రాప్‌యార్డ్ యజమాని ఇస్మాయిల్ షేక్, అతడి కుమారుడు, ముంబ్రాకు చెందిన మహేంద్ర నాయక్ అనే బిల్డర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఐదుగురు ఉగ్రవాదుల హతం

• మిలిటెంట్ల చొరబాటును తిప్పికొట్టిన భారత జవాన్లు

శ్రీనగర్, జమ్మూ ఆగస్టు 7: సరిహద్దు గుండా దేశంలోకి ఉగ్రవాదుల భారీ చొరబాటు యత్నాన్ని ఆర్మీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. సోమవారం పీవోకే గుండా నియంత్రణ రేఖ వెంబడి కుప్వారా జిల్లా మచ్చిల్ సెక్టార్‌లోకి ప్రవేశించాలని మిలిటెంట్లు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమైన సైనికులు ఐదుగుర్ని మట్టుబెట్టారని రక్షణశాఖ మీడియా ప్రతినిధి తెలిపారు. ఘటనా స్థలంలో ఐదు తుపాకుల్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. కాగా, వరుసగా ఐదో వారం కూడా నియంత్రణ రేఖ వెంబడి పీవోకేకు పూంచ్- రావలకోట్ మధ్య బస్ సర్వీసులు నిలిపివేశారు.

చండీగఢ్ వీధుల్లో వేధింపుల పర్వం

ఐఏఎస్ కుమార్తె వెంటపడి వేధించిన హర్యానా బీజేపీ అధ్యక్షుడి తనయుడు

• ఆ మార్గంలో సీసీ టీవీ ఫుటేజీ మాయం





చండీగఢ్/న్యూఢిల్లీ, ఆగస్టు 7: అతడు హర్యానా బీజేపీ అధ్యక్షుడి తనయుడు. ఆమె సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తె. అతడు, అతగాడి స్నేహితుడు ఫుల్లుగా మందు కొట్టి.. చండీగఢ్ వీధుల్లో ఆమె వెంటపడి వేధించారు. ఇద్దరూ ఆమె కారును వెంబడిస్తూ.. అడ్డం పడుతూ.. కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. సంచలనం రేకెత్తించిన ఈ కేసును నీరుగార్చేందుకు రాజకీయ, అధికార ప్రముఖులు 'శక్తియుక్తులు' ప్రదర్శిస్తున్న తీరు విమర్శల పాలవుతోంది. చండీగఢ్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో బాధితురాలు సీనియర్ ఐఏఎస్ అధికారి వీరేంద్ర కుందు కుమార్తె వర్ణిక కుందు (28). నిందితులు హర్యానా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ బరాలా కుమారుడు వికాస్ బరాలా (23), అతని స్నేహితుడు ఆశిష్ కుమార్ (27). డిస్క్ జాకీగా పని చేస్తున్న వర్ణిక తన కారులో ఇంటికి వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న వికాస్, ఆశిష్ తమ ఎస్‌యూవీలో వెంబడించి కిడ్నాప్ చేయబోయారు. వర్ణిక ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వికాస్, ఆశిష్‌లను అరెస్టు చేశారు. మొదట నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. తర్వాత కేసును నీరుగార్చేందుకు తెర తీశారు. అభియోగాల తీవ్రతను తగ్గించి.. నిందితులకు బెయిల్ ఇచ్చి సాగనంపారు. వర్ణికను వెంబడించిన 5 కిలో మీటర్ల నిడివి మార్గంలో చాలాచోట్ల ఉన్న సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ మాయమైపోవడం కేసులో కొత్త మలుపు. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా.. కేంద్ర హోం శాఖకు రిపోర్ట్ చేయాల్సి ఉండడం గమనార్హం. ఈ ఘటన దర్యాప్తు తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోర్టు పర్యవేక్షణలో సాగేలా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని 'పిల్' వేయనున్నట్లు బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ లలితా కుమారమంగళం పోలీసులకు లేఖ రాశారు. కాగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas, *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.***